



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 25 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 17 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# సరికొత్త శక్తిగా ఏపీ



కర్నూలు 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' సభలో ప్రధాని మోదీ




- రాష్ట్రంలో అవకాశాలు, సామర్థ్యాల్ని ప్రపంచమంతా గమనిస్తోంది
- ఢిల్లీ, అమరావతి కలిసి.. వేగవంతమైన అభివృద్ధి వైపు ప్రయాణం
- జీఎస్టీ సంస్కరణలతో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రూ.8 వేల కోట్ల ప్రయోజనాలు
- 21వ శతాబ్దం భారతదేశానిదే

## డబుల్ ఇంజిన్ సర్కారుతో.. రాష్ట్రానికి రెండింతల లాభం

5

- జీఎస్టీ తగ్గింపుతో సూపర్ సేవింగ్స్ ప్రారంభం మాత్రమే
- అన్ని ఎన్నికల్లోనూ మోదీ గెలవాలి.. కేంద్ర సహకారంతో ఏపీకి అత్యధిక పెట్టుబడులు
- త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్ : సీఎం చంద్రబాబు

2

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

కూటమి ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారుతోందని.. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సరికొత్త శక్తిగా అవతరించబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. దేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో అవకాశాలు, సామర్థ్యాల్ని ప్రపంచమంతా గమనిస్తోందన్నారు. 2రోజుల కిందటే గూగుల్ పెద్ద పెట్టుబడిని ప్రకటించిందని, దేశంలో మొదటి ఏఐ (కృత్రిమ మేధ) హబ్ నిర్మించబోతోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో తయారీ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని.. ఆత్మనిర్భర భారత్ కల సాకారానికి ఇది చేదోడవుతుందని కొనియాడారు. కర్నూలులో గురువారం నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' బహిరంగ సభలో పాల్గొన్న మోదీ.. రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'భారతదేశాన్నే నడిపించగలిగిన

- మిగతా2లో



## మావోయిస్టు అగ్రనేత ఆశన్న లొంగుబాటు

- మావోయిస్టు కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న లొంగుబాటు
- అభయ్ లొంగిపోయిన మరుసటి రోజే ఈ కీలక పరిణామం
- ఛత్తీస్‌గఢ్‌లో ఒకేరోజు 78 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి
- చంద్రబాబు, మాధవరెడ్డిలపై దాడుల్లో ఆశన్న కీలక పాత్ర
- ప్రభుత్వ చర్యలతోనే మావోయిస్టుల్లో మార్పు వస్తోందన్న అమిత్ షా

5



## ట్రంప్-మోదీ మధ్య సంభాషణ జరగనేలేదు

- రష్యా చమురు అంశంపై విదేశాంగ శాఖ
- రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపేసేందుకు మోదీ అంగీకరించారన్న ట్రంప్
- అలాంటి చర్చ జరగలేదన్న విదేశాగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్
- ఇప్పటికే కేంద్రం స్పష్టతనిచ్చిందని వెల్లడి

5

## హెచ్-4 వీసాదారులకు భారీ ఊరట

- హెచ్-4 వీసాదారుల ఉద్యోగ హక్కుపై అమెరికా సుప్రీంకోర్టు కీలక నిర్ణయం
- 'సేవ్ జాబ్స్ యూఎస్ఏ' దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరణ

## కూటమి ప్రభుత్వం 15 ఏళ్లు కొనసాగాలి



- మోదీ, చంద్రబాబు నాయకత్వంలో సమష్టిగా ముందుకు సాగుతాం
- మోదీ కర్మయోగి.. దేశం తలెత్తుకునేలా చేస్తున్నారు
- తనకిచ్చిన శాఖల్ని సమర్థంగా నిర్వహిస్తున్న మంత్రి లోకేశ్
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'స్ఫూర్తిదాయక నేత మోదీ.. ఆయనో కర్మయోగి. ఏ ఫలితం ఆశించకుండా, లాభాపేక్ష లేకుండా దేశసేవ చేస్తున్నారు. ఈ తరానికి దిశానిర్దేశం చేసే ప్రధాని స్థాయిలో ఆయన ఉండటం మనం చేసుకున్న అదృష్టం' అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొనియాడారు. సభలో ఆయన మాట్లాడుతూ.. 'మోదీ.. ప్రభుత్వాన్నే కాదు.. రెండు తరాల్ని ముందుకు నడిపిస్తున్నారు. ఇప్పుడు పుట్టే బిడ్డలకు దిశానిర్దేశం చేస్తున్నారు. దేశం తలెత్తి చూసేలా ఆత్మనిర్భర భారత్ అమలుచేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి ఆయన అండగా ఉన్నారు. దీంతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ప్రజల నమ్మకాలను నిలబెడుతూ మోదీ, చంద్రబాబు నాయకత్వంలో.. సమష్టిగా ముందుకెళ్తాం' అని చెప్పారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్న లోకేశ్ తనకిచ్చిన శాఖలను సమర్థంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. 'రాష్ట్రానికి గూగుల్ సంస్థ వచ్చింది.. రూ.13వేల కోట్లపైన పెట్టుబడులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఓర్వకల్లులో రూ.4వేల కోట్ల పెట్టుబడి వస్తోంది' అని పవన్ కల్యాణ్ చెప్పారు. 'గతంలో జీఎస్టీ పెరగడం తప్ప తగ్గడం ఎప్పుడూ చూడలేదు. మోదీ హామీతో జీఎస్టీ తగ్గింది. ఒక్కో కుటుంబానికి రూ.20వేలు ఆదా చేసుకునే అవకాశం కలుగుతుంది.



## మల్లన్న సేవలో ప్రధాని

- భ్రమరాంబ, మల్లికార్జునలకు ప్రత్యేక పూజలు
- సీఎం, డిప్యూటీ సీఎంతో కలిసి శ్రీశైలంలో 3 గంటల పర్యటన
- పూర్ణకుంభంతో అర్చకుల స్వాగతం
- పూజల అనంతరం వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు
- స్వామివారి శేషవస్త్రాలు అందించిన చంద్రబాబు, పవన్
- స్వామి సన్నిధిలో 40 నిమిషాలు
- తర్వాత శివాజీ స్ఫూర్తి కేంద్రం సందర్శన
- 1,800 మంది పోలీసులతో భారీ బందోబస్తు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవిని ప్రధాని మోదీ గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ప్రధాని తొలుత కర్నూలు విమానాశ్రయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు ఆయనకు ఘనంగా స్వాగతం

- మిగతా2లో

## అది నాణ్యత లేని మద్యమే

- అద్దేపల్లి నకిలీ మద్యం కేసులో ల్యాబ్ నివేదిక
- స్ట్రెంత్ ప్రమాణాలు పాటించకుండా తయారీ
- 25గా ఉండాల్సిన యూపీ 35గా నమోదు
- 75 ఉండాల్సిన ఓపీ 65గా నిర్ధారణ
- ప్రమాదకరం కాకపోయినా మంచిది కాదు
- ఎక్సైజ్ అధికారులకు చేరిన నివేదిక

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో అద్దేపల్లి జనార్దనరావు తయారు చేసిన మద్యంలో నిబంధనల ప్రకారం ఉండాల్సిన ప్రమాణాలు లేవని తేలింది. ఈ మద్యం అత్యంత ప్రమాదకరమైనది కాకపోయినా అందులో స్ట్రెంత్ (గాఢత), నాణ్యత ప్రమాణాల కంటే తక్కువగా ఉన్నాయని రుజువైంది. ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ గోదాము నుంచి ఎక్సైజ్ అధికారులు స్వాధీనం

- మిగతా2లో



## దీపావళికి ముందే ఢిల్లీలో డేంజర్ బెల్స్

- కాలుష్యం గుప్పిట్లో దేశ రాజధాని!
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ప్రమాదకరంగా వాయు కాలుష్యం
- దీపావళికి ముందే విషమిస్తున్న పరిస్థితి
- పలు ప్రాంతాల్లో 300 దాటిన గాలి నాణ్యత సూచీ
- 'గ్రాప్' తొలి దశ ఆంక్షలు అమలు చేసిన అధికారులు

5



# మోదీ పాలనలో.. దేశం అస్తవ్యస్తం

- పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం.. యువశక్తి నిర్వీర్యం
- సెప్టెంబర్ నెలలో 5.2 శాతానికి నిరుద్యోగిత రేటు
- వచ్చే 90 రోజుల్లో 50 వేల మంది టెకీలపై వేటు!
- పింఛన్ సూచీలో డీ-గ్రేడ్‌తో అట్టడుగున భారత్
- ఏకంగా 13 నెలల గరిష్ఠానికి చేరిన వాణిజ్య లోటు
- 4 నెలల్లో యూఎస్‌కు 37.5% తగ్గిన ఎగుమతులు

5



# మల్లన్న సేవలో ప్రధాని

-మొదటిపేజీ తరువాయి

పలికారు. మోదీ, చంద్రబాబు, పవన్ ముగ్గురూ కలసి ఒకే హెలికాప్టర్లో శ్రీశైలంలోని సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నంద్యాల కలెక్టర్ రాజకుమారి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, జేసీ విష్ణుచరణ్ తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన 10 కిలోమీటర్లు ప్రయాణించి మల్లన్న క్షేత్రానికి చేరుకున్నారు. ప్రధాన అర్చకుడు వీరన్న స్వామి నేతృత్వంలో ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగానికి ప్రధాని ఏకవార రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, పంచామృతాలతో అభిషేకం చేశారు. అదే విధంగా భ్రమరాంబికకు ఖడ్గమాల, కుంకమార్చన పూజలు చేశారు. తర్వాత మల్లిక గుండమ్మ దర్శనం చేసుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో ప్రధానికి వేద పండితులు వేదాశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం అర్చక స్వాములు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆయనకు స్వామివారి శేష వస్త్రాలు, స్వామి. అమ్మవార్ల చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు. శ్రీశైలంలో మొత్తంగా 3 గంటలు పర్యటించిన ప్రధాని.. 40 నిమిషాలు మల్లన్న సేవలో గడిపారు.

**ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ**

చంద్రబాబు, పవన్‌తో కలిసి ప్రధాని మధ్యాహ్నం 12:35 గంటలకు ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రానికి వెళ్లారు. ముందుగా శివాజీ దర్బార్, గోడలపై శివాజీ జీవిత చరిత్రపై శిల్పాలతో కూడిన చిత్ర మాలికలను ఆయన ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా శివాజీ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం స్ఫూర్తి కేంద్రం నిర్వాహకులు టీజీ వెంకటేశ్, సుబ్బారెడ్డి తదితరులు ఆయనకు స్ఫూర్తి కేంద్రం జ్ఞాపికను అందజేశారు.

# అది నాణ్యత లేని మద్యమే

-మొదటిపేజీ తరువాయి

చేసుకున్న మద్యం సరుకు నమూనాల ల్యాబ్ నివేదిక గురువారం ఎక్సైజ్ ఉన్నతాధికారులకు చేరింది. గోదాములో మద్యం తయారీకి ఉపయోగించిన ముడిసరుకు, రసాయనాలు, స్పిరిట్‌తో పాటు తయారు చేసిన మద్యంను అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ మొత్తం సరుకుకు సంబంధించిన 45 రకాల నమూనాలను పరీక్షల నిమిత్తం కాకినాడలోని ప్రాంతీయ ఎక్సైజ్ ప్రయోగశాలకు పంపారు.

**యూపీ 35-ఓపీ 65**

మద్యం తయారీలో ఎంత నాణ్యత ఉంది? ఎంత స్ట్రెంత్ ఉంది? అన్న వివరాలను యూపీ(అండర్ ప్రూఫ్), ఓపీ(ఓవర్ ప్రూఫ్)లు తెలియజేస్తాయి. ప్రతి మద్యం తయారీకి ఒక సూత్రం ఉంటుంది. దాని ప్రకారం నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తూ మద్యం తయారు చేయాలి. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన డిస్టిలరీలు ఈ విధానాన్ని పాటిస్తాయి. డిస్టిలరీల్లో మద్యం తయారైన తర్వాత ఆ నమూనాలను ఎక్సైజ్ శాఖ ప్రయోగశాలకు పంపి పరీక్షలు చేయిస్తారు. నిర్దేశించిన నిబంధనల ప్రకారం మద్యం తయారు చేశారని ధ్రువీకరణ ఇచ్చిన తర్వాతే డిస్టిలరీల్లో సరుకును సీసాల్లో నింపుతారు. ముఖ్యంగా మద్యంలో రెండు ప్రమాణాలు యూపీ, ఓపీ ఉంటాయి. యూపీ 25గా ఉండాలి. జనార్దనరావు గోదాములో లభించిన మద్యంలో అది 35గా నమోదైంది. 100 నుంచి యూపీని తీసివేయగా వచ్చిన విలువ ఓపీని సూచిస్తుంది. ప్రమాణాల ప్రకారం 75 ఉండాల్సిన ఓపీ ఇబ్రహీపట్నంలో సీజ్ చేసిన సరుకులో 65గా ఉన్నట్టు నిర్ధారణైంది. ఈ విధంగా విలువలు నమోదైన మద్యంలో నీరు గానీ, ఇంకా ఏమైనా ద్రవపదార్థాలను గానీ మిశ్రమం చేసినట్టు సైంటిస్టులు భావిస్తున్నారు. సాధారణంగా యూపీ 25, ఓపీ 75గా ఉన్న మద్యం తాగాలంటే అందులో నీరు, సోడా, డ్రింక్ ఇలా ఏదో ఒకటి మిశ్రమం చేసుకోవాలి. జనార్దనరావు తయారు చేసిన మద్యంలో యూపీ 35, ఓపీ 65గా ఉండడంతో ఎలాంటి ద్రవపదార్థం కలపకుండా దాన్ని తాగొచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. ఎలాంటి నాణ్యత, గాఢతా ప్రమాణాలు పాటించకుండా తయారు చేశారని సైంటిస్ట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

**విలువలు ఎలా నిర్ధారిస్తారంటే..**

మద్యం తయారీలో రెక్టిఫైడ్ స్పిరిట్, కార్మెల్(రంగు తెలియజేసే రసాయనం)తో పాటు వివిధ రకాల రసాయనాలు ఉపయోగిస్తారు. వాటిని బ్రాందీకి ఒకవిధంగా, విస్కీకి ఒకవిధంగా, రమ్ముకు ఒకవిధంగా మిశ్రమం చేస్తారు. ఈ మిశ్రమానికి సంబంధించి ప్రతి వెరైటీకి ఒక్కో ప్రత్యేక సూత్రం ఉంటుంది. డిస్టిలరీల్లో తయారైన మద్యం ప్రయోగశాలకు వెళ్లిన తర్వాత అక్కడ బిరడాల్లో పోస్తారు. ముందుగా థర్మామీటర్‌ను బిరడాలో పెట్టి ఉష్ణోగ్రతను నమోదు చేస్తారు. తర్వాత థర్మామీటర్‌ను తీసేసి హైడ్రోమీటర్ పెడతారు. ఇది ఒక రీడింగ్‌ను చూపిస్తుంది. థర్మామీటర్ చూపించిన ఉష్ణోగ్రత, హైడ్రోమీటర్ చూపించిన రీడింగ్‌ను నమోదు చేసుకుని స్పైస్ టేబుల్ ఉన్న పుస్తకంలో చూస్తారు. అందులో ఉన్న విలువలను బట్టి మద్యంలో ఉన్న గాఢతను నిర్ధారిస్తారు.

# డబుల్ ఇంజిన్ సర్కారుతో.. రాష్ట్రానికి రెండింతల లాభం

కర్నూలు

డబుల్ ఇంజిన్ సర్కారుతో రాష్ట్రానికి డబుల్ బెనిఫిట్ వచ్చిందని, కేంద్ర సహకారంతో ఏపీకి అత్యధిక పెట్టుబడులు సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇటు సూపర్ సిక్స్ పథకాలు.. అటు సూపర్ జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు సూపర్ సేవింగ్ మేలు కలిగిందన్నారు. సూపర్ జీఎస్టీతో ఒనగూరుతున్న సూపర్ సేవింగ్స్ ప్రారంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని లాభాలను చూడబోతున్నామని స్పష్టీకరించారు. కర్నూలులో గురువారం నిర్వహించిన సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ సభలో చంద్రబాబు మాట్లాడారు. బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధిస్తుందని, ప్రధాని మోదీ విజయయాత్ర కొనసాగుతుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. 'అన్ని ఎన్నికల్లోనూ మోదీ గెలవాలి. అదే భారత్ విజయం.. అదే మన విజయం' అని అన్నారు.

**98 వేల ఈవెంట్లు నిర్వహించాం**

'జీఎస్టీ సంస్కరణలతో బచత్ ఉత్సవ్ నేడు భరోసా ఉత్సవ్‌గా మారింది. సూపర్ జీఎస్టీకి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 98 వేల ఈవెంట్లు నిర్వహించాం. జీఎస్టీ తగ్గింపుతో 99 శాతం వస్తువుల్ని 0 లేదా 5 శాతం పరిధిలోకి తెచ్చారు. ఫలితంగా అన్ని వస్తువుల ధరలూ తగ్గాయి. విద్యార్థులు, రైతులు, చిరుద్యోగులు, చిరువ్యాపారులు, వృద్ధులు, కూలీలు, కార్మికులు.. ఇలా అన్ని వర్గాలకూ లబ్ధి కలిగింది. ప్రతి కుటుంబానికీ ఏడాదికి రూ.15 వేలు ఆదా అవుతాయి' అని సీఎం చెప్పారు.

**ప్రపంచ పర్యాటక కేంద్రంగా రాయలసీమ**

'ఉద్యాన హబ్‌గా, ప్రపంచ పర్యాటక కేంద్రంగా రాయలసీమ మారుతుంది. ఆ ప్రాంతం మొత్తం గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, సిమెంటు పరిశ్రమలు వస్తున్నాయి. స్పేస్ సిటీ, డిఫెన్స్ కారిడార్, ఎయిరో స్పేస్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు రానున్నాయి. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ వస్తుంది. వైఎస్సార్ కడప జిల్లాకు స్టీలు ప్లాంటు, ఓర్వకల్లుకు డ్రోన్ సిటీ రాబోతున్నాయి. ఇప్పుడు ప్రధాని చేతుల మీదుగా విద్యుత్తు, రైల్వే, జాతీయ రహదారులకు చెందిన రూ.13,430 కోట్ల విలువైన ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుపుకొంటున్నాం. రూ.4,922 కోట్ల విలువైన కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌లు వస్తున్నాయి. మెగా డీఎస్సీ, పీఎం కిసాన్–అన్నదాతా సుఖీభవ, స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం–2, పింఛన్ల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలతో సూపర్‌సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశాం' అని సీఎం వివరించారు. 'ప్రజాసేవలో సీఎంగా, ప్రధానిగా 25 ఏళ్ల సుదీర్ఘ పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీకి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నాను. మోదీ ఓ విలక్షణ నాయకుడు. నిబద్ధతతో భారత జాతికి ఎనలేని సేవ చేస్తున్నారు. 21వ శతాబ్దం మోదీదే. సరైన సమయంలో దేశానికి మోదీ రూపంలో సరైన నాయకుడు లభించారు. నేను ఎందరో ప్రధానమంత్రులతో కలిసి పనిచేశాను. మోదీ లాంటి నాయకుడిని చూడలేదు. ఆయన నిరంతరం పనిచేస్తారు. ఎన్నో గేమ్ ఛేంజింగ్ సంస్కరణలను తీసుకొచ్చారు. వాటి ఫలితంగా దేశం బలపడింది. దేశం మరింతగా పురోగమిస్తూ 2047కు ప్రపంచంలోనే సూపర్‌పవర్‌గా మారనుంది. ఇది మోదీ మార్గదర్శనంలోనే సాధ్యం. రాబోయే శతాబ్దాలు మనవే. ఆయన్ను చూసి గర్వపడుతున్నా' అని చంద్రబాబు అన్నారు.

**చిప్‌ల నుంచి షిప్‌ల వరకు మనదగ్గరే ఉత్పత్తి**

'ప్రస్తుతం ప్రపంచ మార్కెట్‌ను యుద్ధాలు, టారిఫ్‌లు ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమయంలో మోదీ చెప్పిన స్వదేశీ మంత్రం మనకు బ్రహ్మాస్త్రం. దానిని అందిపుచ్చుకుని సెమీకండక్టర్‌ల నుంచి శాటిలైట్‌ల వరకు, చిప్‌ల నుంచి షిప్‌ల వరకు మన వద్దే ఉత్పత్తి అయ్యేలా కార్యాచరణ చేపట్టాం' అని సీఎం చెప్పారు. '11 ఏళ్ల క్రితం 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థికవ్యవస్థ మోదీ సంకల్పంతో ఇప్పుడు 4వ స్థానానికి చేరింది. 2028 నాటికి మూడో స్థానానికి, 2038కి రెండో స్థానానికి చేరతాం. ఆర్థికంగా దేశం బలాన్ని ఈ విజయాలు సూచిస్తే... సైనికంగా మన శక్తిని ఆపరేషన్ సిందూర్ చూపించింది' అని కొనియాడారు.

**మోదీకి మరింత శక్తినివ్వాలి**

'శక్తిపీఠం, జ్యోతిర్లింగం ఒకేచోట కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. మోదీ అక్కడ పూజలు చేయడం ఆ క్షేత్రం శక్తిని తెలుపుతోంది. దేశాన్ని నిరంతరం ప్రగతి పథంలో నడిపించేందుకు అవసరమైన మరింత శక్తిని మోదీకి ఇవ్వాలని శ్రీశైల భ్రమరాంబమల్లికార్జున స్వామిని వేడుకుంటున్నా. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేయాలని కోరుకుంటున్నా' అని చంద్రబాబు అన్నారు.

## సరికొత్త శక్తిగా ఏపీ

-మొదటిపేజీ తరువాయి

శక్తి ఆంధ్రప్రదేశ్‌కు ఉంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వాలు గతంలో ఆంధ్రప్రదేశ్ సామర్థ్యాన్ని విస్మరించి దేశానికే నష్టం చేశాయి. ఏపీ సొంత అభివృద్ధికి పోరాటం చేసుకునే దుస్థితికి తెచ్చాయి' అని విమర్శించారు. 'ఆంధ్రప్రదేశ్.. ఆత్మగౌరవానికి, సంస్కృతికి నిలయం. సైన్స్, ఆవిష్కరణలకు కేంద్రం. ఇక్కడ అనంత అవకాశాలున్నాయి. అపారశక్తి కలిగిన యువత అందుబాటులో ఉంది. 21వ శతాబ్దం భారతదేశానిదే. ఇది 140 కోట్ల భారతీయుల శతాబ్దం. 2047 నాటికి మనదేశం వికసిత భారత్‌గా తయారవుతుంది. వికసిత ఆంధ్రప్రదేశ్‌తోనే వికసిత భారత్ కల నెరవేరుతుంది' అని చెప్పారు. 'కొత్త ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల సందర్భంగా ఏపీ ప్రజలకు అభినందనలు. విద్యుత్తు, రోడ్లు, రైల్వే, హైవేలు, వాణిజ్య ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశాం. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో కనెక్టివిటీని బలోపేతం చేస్తాయి. పరిశ్రమల ఏర్పాటుకు ఊతమిస్తూ ప్రజల జీవితాలను మారుస్తాయి. వీటితో కర్నూలు ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుంది' అని పేర్కొన్నారు. మోదీ ప్రసంగంలోని ప్రధానాంశాలు..

**ఇంధన విప్లవానికి ప్రధాన కేంద్రంగా ఏపీ**

ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే విద్యుత్తు భద్రత ఎంతో ముఖ్యం. ఇప్పుడు ప్రారంభించిన రూ.3,000 కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుల వల్ల దేశ ఇంధన సామర్థ్యం మరింత పెరగబోతోంది.

దేశంలో ఇంధన విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రంగా ఉంది. చంద్రబాబు నేతృత్వంలో శ్రీకాకుళం నుంచి అంగుల్ వరకు సహజ వాయు ప్రాజెక్టు ప్రారంభించాం. ఇది 15 లక్షల ఇళ్లకు గ్యాస్ అందిస్తుంది.

చిత్తూరులో ప్రారంభించిన ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్‌లో రోజుకు 20,000 సిలిండర్లు నింపే సామర్థ్యం ఉంది. రవాణా, నిల్వ రంగంలో ఉద్యోగాలు కల్పిస్తుంది.

దేశంలో ఇప్పుడు వేగవంతమైన అభివృద్ధి జరుగుతోంది. అయితే గతాన్ని మరచిపోకూడదు. 11 ఏళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తలసరి ఇంధన వినియోగం 1,000 యూనిట్ల కంటే తక్కువ.విద్యుత్తు కోతల వంటి సమస్యలు ఉండేవి. వేల గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు కూడా లేవు.


ఇప్పుడు దేశంలో శుద్ధ ఇంధనం నుంచి టోటల్ ఎనర్జీ ఉత్పత్తి వరకు ప్రతి రంగంలోనూ రికార్డులే. ప్రతి గ్రామంలోనూ విద్యుదీకరణ జరిగింది. తలసరి విద్యుత్తు వినియోగం 1,400 యూనిట్లకు పెరిగింది. పరిశ్రమలు, ఇళ్లకు అవసరమైనంత విద్యుత్తు అందుబాటులో ఉంది.

నిమ్మలూరులో నైట్‌విజన్.. రక్షణ రంగ ఎగుమతులు కొత్త ఎత్తుకు

దేశ రక్షణ రంగంలో ఆత్మనిర్భరత సాధించేందుకు మరో ముందడుగే నిమ్మలూరులో ప్రారంభమైన అడ్వాన్స్‌డ్ నైట్ విజన్ పరిశ్రమ. ఇందులో తయారయ్యే నైట్‌విజన్ పరికరాలు, మిస్సైల్ సెన్సర్లు, డ్రోన్ గార్డుల వ్యవస్థ ద్వారా భారత్ సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఇక్కడ తయారయ్యే పరికరాలు దేశ రక్షణ రంగ ఎగుమతుల్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్తాయి. భారత్ రక్షణ రంగ శక్తిని ఆపరేషన్ సిందూర్‌లో మనమంతా ప్రత్యక్షంగా చూశాం. ఏపీ ప్రభుత్వం కర్నూలులో డ్రోన్ హబ్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో ఇది దేశానికే తలమానికంగా తయారవుతుంది. డ్రోన్ హబ్ ద్వారా టెక్నాలజీ విస్తృతమవుతుంది. కొత్త రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఆపరేషన్ సిందూర్‌లో మన డ్రోన్లు చేసిన అద్భుతాలు ప్రపంచాన్ని అబ్బురపరిచాయి. నవరాత్రి మొదటి రోజు నుంచి జీఎస్టీ భారం తగ్గించాం. యువనేత లోకేశ్ నేతృత్వంలో జీఎస్టీ పొదుపు ఉత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమ ప్రచారం ఎంతో విజయవంతంగా జరిగింది. తర్వాత తరం జీఎస్టీ సంస్కరణలు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రూ.8 వేల కోట్ల ప్రయోజనాలు కల్పిస్తున్నాయి. ఇది పండగ సీజన్ ఆనందాన్ని పెంచబోతుంది. ఈ జీఎస్టీ పొదుపు ఉత్సవంలో స్థానిక తయారీ రంగాన్ని ప్రోత్సహించాలి. 'వోకల్ ఫర్ లోకల్' నినాదానికి మద్దతివ్వాలి. ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం పనిచేస్తోంది. సిటిజన్ సెంట్రిక్ డెవలప్‌మెంట్ అనేది మా ప్రభుత్వ విజన్. ఈ లక్ష్యంతో కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నాం.

## స్వ డైమండ్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రీతి జింటా

విజయవాడ



భారతదేశంలోని ప్రముఖ ఫైన్ జువెలరీ బ్రాండ్లలో ఒకటైన స్వ డైమండ్స్, ప్రముఖ భారతీయ నటి ప్రీతి జి జింటాను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా స్వాగతించడం ద్వారా ఒక కొత్త మైలురాయిని చేరుకుంది. ఆమె నిత్యనూతనమైన అందం, ఆత్మవిశ్వాసంతో కూడిన ఉనికితో, స్వ డైమండ్స్ భారతదేశం, యూఏఈ అంతటా తమ ఉనికిని బలోపేతం చేసుకునే దిశగా ఒక సాహసోపేతమైన అడుగు ముందుకు వేసింది. ఈ సందర్భంగా స్వ డైమండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ గఫూర్ అనాదియన్ మాట్లాడుతూ, తమ కొత్త ప్రచారం, యాజ్ రియల్ యాజ్ యూ.. సహజత్వాన్ని వేడుకగా జరుపుకుంటుందని అన్నారు. స్వ డైమండ్స్ కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులైన ప్రీతి జి జింటా, ఈ భాగస్వామ్యంపై తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## క్విక్ కామర్స్‌తో చివరి నిమిషంలో సులభమైన గిఫ్ట్స్, హోస్టింగ్

విజయవాడ

ఇల్లు శుభ్రం చేసుకోవడం, ఇన్బాక్స్ క్లియర్ చేసుకోవడం, గెట్–టుగెదర్‌లు ప్లాన్ చేయడం, కుటుంబాన్ని హోస్ట్ చేయడం.. ఇలా దీపావళికి ముందు రోజులు చాలా బిజీగా ఉంటాం. ఈ హడావిడి మధ్య, క్విక్ కామర్స్ పెద్ద తోడ్పాటునందిస్తూ, దీపావళి వేడుకలను మరింత సులభంగా, ఒత్తిడి లేకుండా మారుస్తోంది. ట్రైన్ ఎక్కే ముందు కొనే ఆఖరి నిమిషం గిఫ్ట్ అయినా, అనుకోకుండా వచ్చిన అతిథుల కోసం స్వీట్ అయినా... ఇక్కడ కొన్ని ఆలోచనాత్మకమైన, పండుగ వాతావరణాన్ని పెంచే ఎంపికలు ఉన్నాయి. ఇవన్నీ కేవలం నిమిషాల్లో అందుబాటులో ఉంటాయి. ఖచ్చితంగా ఆనందాన్ని పంచుతాయి. కాబట్టి, ఈ పండుగ సీజన్‌లో, మీ చివరి నిమిషాన్ని సరైన సమయంగా మార్చుకోండి. క్విక్ కామర్స్ సహాయంతో మీరు కేవలం ఒక బహుమతితో కాకుండా, మరింత ఆనందాన్ని, దీపావళి స్ఫూర్తిని కూడా తీసుకువస్తారు.

## సరికొత్త రికార్డ్ సృష్టించిన అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2025

విజయవాడ

అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2025, భారతదేశం పండుగలను జరుపుకునే, షాపింగ్ చేసే విధానాన్ని మార్చేసింది. ఈ సంవత్సరం, అమెజాన్ ఇండియా 276 కోట్లకు పైగా కస్టమర్ సందర్శనలను నమోదు చేసింది. వీరిలో 70 శాతం మంది టైర్ 2, 3 నగరాల నుండి కావడం విశేషం. 30 రోజుల ఈ వేడుకలో మరో ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉండగా, అమెజాన్ ఇండియా అపూర్వమైన స్పందనను వెల్లడించింది. ఈసారి కాంగ్రా, హరిద్వార్, ముజఫర్‌పూర్, జామ్‌నగర్, డార్జిలింగ్, షిమోగా, సేలం వంటి విభిన్న ప్రాంతాల నుండి దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో విక్రేతలు అమ్మకాలు నమోదు చేశారు. అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సందర్భంగా, ప్రైమ్ సభ్యులు ప్రత్యేక ఆఫర్లు, డీల్స్, అమెజాన్ అత్యంత వేగవంతమైన డెలివరీలను ఆస్వాదించారు.


## గ్లోబల్ బ్రాండ్స్‌లో శాంసంగ్ ఎలక్ట్రానిక్స్‌కు 5వ ర్యాంక్

విజయవాడ




గ్లోబల్ బ్రాండ్ కన్సల్టెన్సీఇంటర్‌బ్రాండ్ ప్రకటించిన 'బెస్ట్ గ్లోబల్ బ్రాండ్స్' జాబితాలో తమకు 5వ ర్యాంక్ లభించినట్లు శాంసంగ్ వెల్లడించింది. వరుసగా ఆరో ఏడాది కూడా ఇదే స్థానాన్ని నిలబెట్టుకోవడం గమనార్హం. ఈ సంవత్సరం జాబితాలో, శాంసంగ్ 90.5 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువను నమోదు చేసింది. 2020 నుండి ప్రపంచ టాప్–5లో స్థానం నిలబెట్టుకున్న ఏకైక ఆసియా కంపెనీగా శాంసంగ్ తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఇంటర్‌బ్రాండ్ ప్రకారం, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ సానుకూల మూల్యాంకనానికి కంపెనీ అన్ని వ్యాపార విభాగాల్లో ఏఐ పోటీతత్వాన్ని బలోపేతం చేసుకోవడం, ఉత్పత్తుల మధ్య ఏకీకరణ ద్వారా వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచడం, ఏఐ సంబంధిత సెమీకండక్టర్లపై ప్రత్యేకంగా పెట్టుబడులు పెట్టడం. వినియోగదారు కేంద్రీకృత బ్రాండ్ వ్యూహాన్ని అమలు చేయడం వంటి అంశాలు దోహదపడ్డాయి.

## సోనీ నుంచి డబ్ల్యూహెచ్-1000ఎక్స్‌ఎం6 వైర్‌లెస్ నాయిస్ క్యాన్సిలింగ్ హెడ్‌ఫోన్‌లు




విజయవాడ

సోనీ ఇండియా, డబ్ల్యూహెచ్–1000ఎక్స్‌ఎం6 వైర్‌లెస్ నాయిస్ క్యాన్సిలింగ్ హెడ్‌ఫోన్‌లను విడుదల చేసినట్లు వెల్లడించింది. ప్రీమియం ఆడియో, వ్యక్తిగత శ్రవణ అనుభవాల కోసం నూతన ప్రమాణాలను నిర్దేశించిన అవార్డు గెలుచుకున్న 1000ఎక్స్ సిరీస్ తాజా ఎడిషన్ ఇది. 1000ఎక్స్ సిరీస్ వారసత్వంపై నిర్మించబడిన ఈ తాజా మోడల్, ప్రీమియం సౌండ్‌ను ఉత్తమ నాయిస్ క్యాన్సిలింగ్‌తో కలిపి, సంగీత ప్రియులు, ఫ్యాషన్ ప్రియులు, ప్రయాణికులు, నిపుణుల కోసం అసమానమైన ఆడియో పరిష్కారాలను సృష్టించడానికి సౌకర్యవంతమైన డిజైన్‌లో తీర్చిదిద్దబడింది. అధునాతన ప్రాసెసర్, అడాప్టివ్ మైక్రోఫోన్ సిస్టమ్ తో శక్తివంతమైనప్పటికీ, డబ్ల్యూహెచ్–1000ఎక్స్‌ఎం6లో నాయిస్ క్యాన్సిలింగ్ రియల్ టైమ్‌లో మెరుగుపరచబడింది.

### నకిలీ మద్యం ఏరులై పారుతుంటే

# మీ ప్రభుత్వానికి తెలియదా...

**బెల్ట్ షాపు పెడితే బెండు తీస్తా అన్నాది మీ నాయకుడు కాదా...**

**జోరుగా కోటా బియ్యం అక్రమ రవాణా : ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆగ్రహం**



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యం పరిశ్రమలు, నకిలీ మద్యం, బెల్ట్ షాపుల ద్వారా జనావాసాల్లో మద్యం ఏరులై పారుతుండటంపై రాష్ట్ర సవాడినేట్ కమిటీ చైర్మన్, మండపేట నియోజకవర్గ వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వర రావు తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. మద్యం పాలసీపై గత 18 నెలల్లో ఏమీ చేయలేదని ఎద్దేవా చేశారు. మద్యం షాపులు ఎమ్మెల్యేల పర్యవేక్షణలోనే పనిచేస్తున్నాయని ఆరోపించారు. మద్యం ఏరులై పారుతుంటే ఎమ్మెల్యేకు కనిపించకపోతే మేమేం చేయగలమని ప్రశ్నించారు. మండపేట మున్సిపాలిటీ దగ్గర కూర్చుంటే మద్యం ఎలా పారుతోందో అవగతమవుతుందని తోట విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెల్ట్ షాపులను రద్దు చేస్తామని చెప్పినా, ఒక్క షాపునూ మూసివేయలేదని ఆరోపించారు. ఊరికి నాలుగైదు బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి బ్రాందీ షాపు నుండి పావలా పైసల వాటా తీసుకుంటూ ఎమ్మెల్యేలు భాగస్వాములుగా ఉన్నారన్నారు. అందుకే బెల్ట్ షాపులను జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం తీరుపై ఆయన ధ్వజమెత్తారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో మద్యం షాపులు ఊరి చివర నిబంధనల ప్రకారం ఉండేవన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం పరిశ్రమలను చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో ఏర్పాటు చేసి, ఆఫ్రికా కంపెనీల ద్వారా నకిలీ మద్యం తయారు చేయించి ఆంధ్రప్రదేశ్‌ను మద్యాంధ్రగా మార్చిందని తోట ఆరోపించారు. ఈ నీచ రాజకీయాలను మాజీ మంత్రి జోగి రమేష్‌పై నెట్టడం సిగ్గుచేటని ఆయన అన్నారు. మండపేట మండలంతో పాటు జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ బియ్యాన్ని 18 నుండి 20 రూపాయలకు కొనుగోలు చేసి, ఎంచుకున్న రైస్ మిల్లర్ల ద్వారా కిలో 40 రూపాయలకు విదేశాలకు అమ్ముతూ ప్రజల సొమ్మును దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆస్తిని దోచుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆయన విమర్శించారు. రేషన్ షాపులపై అధికారులను పంపించి తనిఖీల పేరుతో డీలర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఎమ్మెల్యే జోగేశ్వరరావు ఆదేశాలతో రేషన్ డీలర్లను రప్పించి టిడిపి కండువాలు వేయిస్తున్నారని తోట ఆరోపించారు. మూడు మండలాల్లో రేషన్ షాపులపై కావాలనే కేసులు పెడుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ డీలర్లను ఇబ్బంది పెట్టిన సందర్భం లేదని ఆయన గుర్తు చేశారు. వెంటూరులో వైస్ సర్పంచ్‌గా పనిచేస్తున్న రేషన్ డీలర్‌ను భయపెట్టి పార్టీలో చేర్చుకున్నారని ఆరోపించారు. చేరగానే ఆ షాపుపై కేసులు ఎలా అదృశ్యమయ్యాయని తోట ప్రశ్నించారు.అధికార దుర్వినియోగం సమంజసం కాదని, ప్రభుత్వాలు మారుతూ ఉంటాయని గుర్తు చేస్తూ, చిన్న విషయాలకు అధికార పార్టీ ప్రోత్సాహంతో అధికారులు అత్యుత్సాహం చూపడం సరైనది కాదని తోట అన్నారు.వైసీపీ హయాంలో బస్టాండ్‌లో రిక్షా కార్మికుల కోసం సుమారు 10 లక్షల రూపాయలతో షెల్టర్ ఏర్పాటు చేయగా, రిక్షా స్టాండ్ ను, రిక్షా స్టాండ్ బోర్డును తొలగించిన విషయం తెలియదని ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదమని తోట విమర్శించారు. ఆయన ప్రమేయం లేకుండా అధికారులు షెడ్డును శుభ్రం చేసి మెప్మా బజార్ ఏర్పాటు చేశారా అంటూ ప్రశ్నించారు. ఇది ఆయన దృష్టిలో లేకుండా జరిగిందా అని ఎమ్మెల్యే జోగేశ్వరరావును తోట నిలదీశారు. ఈ సమావేశంలో పట్టణ వైసిపి కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, జడ్పీటీసీ కుడిపూడి రాంబాబు, కౌన్సిలర్స్ మందపల్లి రవి కుమార్, మెండి బాపిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట అయ్యప్ప, పిల్లా వీరబాబు, ఐటీ వింగ్ కన్వీనర్ యారామటి వెంకన్న బాబు, బూత్ కమిటీ కన్వీనర్ పోతుల ప్రసాద్, యాదగాని రామకృష్ణ, గణేష్, మేడిశెట్టి గోవిందు, కోళ్ళ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా

# విపస్యన ధ్యాన సాధన : కలెక్టర్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజంలో మారుతున్న జీవనశైలి ప్రభావం అన్ని వయస్సుల వారి పైనా తీవ్రంగా పడుతోందన్న నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలలో పైలెట్ ప్రాజెక్టుగా విద్యార్థులతో విపస్యన ధ్యాన సాధన చేపట్టి విద్యా ర్థినీ విద్యార్థులలో క్రమ శిక్షణ, చదువుల పట్ల ఆసక్తి ఏకాగ్రత జీవితం పట్ల సరైన అవగాహన మార్పులు తీసుకురావడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాల ప్రిన్సిపాళ్ళు ప్రధానో పాధ్యాయులతో సమావేశం నిర్వహించి మూడు నెలలు పాటు విపశ్యన జ్ఞాన సాధన ఆనా పానా కార్యక్రమాల పురోగ తిపై సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల మానసిక స్థితి విద్య పట్ల ఆసక్తి వంటి పన్నెండు పారామీటర్ల వారీగా ప్రోగ్రెస్ కార్డు రూపొందించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నేటి ఆధునిక యుగంలో చదువు కుంటున్న పిల్లల నుండి పెద్దవారి వరకు ప్రతి ఒక్కరి జీవితంలో మానసిక ఒత్తిడి సాధారణమైన భాగంగా మారిపోయిందన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో విజయం సాధించాలంటే బాల్యం నుంచి ఏకాగ్రత, క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, ఒత్తిడిని జయించే మానసిక బలంతో ముందు కెళ్లాల్సిన అవసరం ఉందన్నారు అలాంటి మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకునే మార్గమే ధ్యానం మెడిటేషన్ అన్నారు. ఇదే నేపథ్యంలో అంతర్జాతీయ దమ్మ నాగార్జున మెడిటేషన్ సెంటర్ నాగార్జున సాగర్ బృంద ఆచార్య నిపుణు లతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 10 నిమిషాల పాటు జ్ఞాన ధ్యానం చేయడం జరుగు తోందన్నారు. జీవితంలో అనేక అద్భుతాలు సృష్టించే ఈ మెడిటేషన్ను ఆచరించడం నిజంగా విద్యార్థులు పూర్వజన్మ సుకృతంగా భావించాలన్నారు ఈ ధ్యాన సాధన ద్వారా ఆరోగ్యం జీవితం పట్ల సరైన అవగా హన వస్తుందన్నారు. బుద్ధుడు బోధించిన ప్రాచీన భారతీయ జ్ఞాన పద్ధతి అన్ని రకాలుగా అద్భుత మైన దివ్య ఔషధమని తెలిపారు. శ్వాస మీద ధ్యాస పెట్టి జీవితం మీద పట్టు ప్రాణాయామ సాధన చేస్తూ అభివృద్ధి పదం వైపు ముందడుగు వేయాలన్నారు. విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచడం ద్వారా వారి వ్యక్తిత్వ వికాసానికి ఉజ్వల భవిష్యత్తుకు దోహద పడేందుకు దూరదృష్టితో ఆలోచన చేసి ఆచరణలోనికి తీసుకురావడం జరిగిందన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు ఏడాది పాటు ఈ జ్ఞాన సాధన చేసే దిశగా శిక్షణ కార్యక్రమాలను తరగతి టీచర్లకు వాలంటీర్లకు పది రోజులు పాటు ఇప్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులతో పిల్లలను జ్ఞాన సాధన మూలంగా వచ్చిన మార్పులను ఆశ్రమ పాఠశాల వారీగా ఆరా తీశారు.అందరూ పిల్లల మాన సిక పరివర్తన, డైలీ ప్రాక్టీస్ విద్య పట్ల ఆసక్తి ఏకాగ్రత ఆహారం వృధా శ్వాస మీద ధ్యాస, గొడ వలు పడడం బేస్ లైన్ విశ్లేషణ చేయడం ద్వారా వివిధ అంశా లలో గతంలో కంటే గణనీయ మైన మార్పు వచ్చిందని వెల్ల డించారు. ముఖ్యంగా ఇంటర్ చదువుతున్న విద్యార్థులలో స్పష్టంగా మాట్లాడడం విద్యను క్రమశిక్షణతో అభ్యసించడం వంటి విప్లవాత్మక మైన మార్పులు చోటు చేసుకు న్నాయన్నారు మరి కొంత కాలం పాటు మెడిటేషన్ అవసరం ధ్యాన సాధన కొరకు కార్యా చరణను సిద్ధం చేస్తామని తెలిపారు. విపష్యన ఆచార్య నిపుణులు ప్రహ్లాద మాట్లాడు తూ విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచడం ద్వారా వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడాలనే లక్ష్యం ధ్యానంతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం, మంచి వ్యక్తిత్వ లక్షణాలు పెరిగి, జీవితంలో మెరుగైన స్థాయికి ఎదగగలుగుతారన్నారు. అంతర్జాతీయ విపశ్యన మెడిటేషన్ సెంటర్ వాలంటీర్ల బృందం సహకారంతో ఈ ధ్యానాన్ని జిల్లాలోని గురు కుల పాఠశాలల్లో వంద రోజు లుగా కొనసాగిస్తున్నారన్నారు విద్యార్థులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 10నిమిషాల పాటు ధ్యానం చేసేలా అవసరమైన ఏర్పాట్లను చేపట్టారు. విపశ్యన సహాయక ఆచార్యుల బృందం ఆయా పాఠశాలల్లో ఆడియో సిస్టమ్ ద్వారా ప్రసారమ య్యే సందేశాల ఆధారంగా విద్యా ర్థులతో మిత్ర మైండ్ ఇన్ ట్రైనింగ్ ఫర్ రైట్ అవేర్నెస్ ధ్యానాన్ని చేయి స్తున్నారన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, సమగ్ర శిక్ష ఏపీసీ జి మమ్మీ, మొబైలేషన్ అధికారి బివివి సుబ్ర హ్మణ్యం, విపశ్యన ఆచార్య ప్రతినిధి అమర్, ప్రధానోపా ధ్యాయులు ప్రిన్సిపాల్ లు తదితరులు పాల్గొన్నారు

# ప్రింటోనిక - శివరామ డిజిటల్ ప్రెస్‌కు అవార్డుల పంట..

**ప్రింట్ వీక్ ఇండియా నేషనల్ అవార్డు అందుకున్న అధినేతలు**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతిష్టాత్మకమైన ప్రింట్ వీక్ ఇండియా - 2025 నేషనల్ అవార్డును అక్టోబర్ 13వ తేదీ సోమవారం వెస్టిన్ ముంబైలో ప్రింటోనిక శివ రామ కలర్ ల్యాబ్ సంస్థల డైరెక్టర్ పులవర్తి అవినాష్, కంపెని టెక్నికల్ హెడ్ ఈలి సతీష్, ప్రింటింగ్ హెడ్ బొమ్మిరెడ్డి నానిలు హెడ్ ఆఫ్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రింట్ వీక్ ఇండియా కల్పేష్ షా, సంజీవ్ ఆర్ఎస్ చేతుల మీదుగా అందుకున్నారు. భారతదేశంలో ప్రముఖ ప్రింటింగ్ కంపెనీలు పాల్గొన్న ఈ పోటీలలో టెక్నాలజీ, ఇన్నోవేషన్, ప్రెజెంటేషన్, క్వాలిటీ స్టాండర్డ్స్ ఆధారంగా చేసుకుని "డిజిటల్ ఫోటో ఆల్బమ్ ప్రింటర్ ఆఫ్ ది ఇయర్" నేషనల్ అవార్డుని ప్రింటోనికా సంస్థ అందుకుంది. వరుసగా 5వ సారి ఈ అవార్డు ప్రింటోనికా సంస్థకు రావడం, సెప్టెంబర్19వ తేదీన ప్రతిష్టాత్మకమైన ఏసియన్ ప్రింట్ అవార్డును బ్యాంకాక్, థాయిలాండ్ లో ప్రింటోనిక - శివరామ కలర్ ల్యాబ్ సంస్థల డైరెక్టర్ పులవర్తి అవినాష్, టెక్నికల్ హెడ్ ఈలి సతీష్, థాయిలాండ్ సింగపూర్ కోనిక మినోల్టా ఎండి కర్ట్ ఆసారి, ఓసాఫూమి కవామురి చేతుల మీదుగా అందుకున్నారు. ఫోటో బుక్, కమర్షియల్ ప్రింటింగ్ కేటగిరిలలో ఇన్నోవేషన్, ప్రెజెంటేషన్, టెక్నాలజీని ఆధారంగా చేసుకుని గోల్డ్, గ్రాండ్ విన్నర్, సిల్వర్, బ్రాంజ్ ఇంటర్నేషనల్ అవార్డులను అందుకున్నారు. ప్రింట్ వీక్, కెనాన్, హెచ్ పి ఇండియా టీం అభినందనలు తెలిపింది. www.printonica.com ద్వారా నేషనల్, ఇంటర్నేషనల్ ఆన్లైన్ ప్రింటింగ్ సేవలను వరల్డ్ క్లాస్ స్టాండర్డు తమ కస్టమర్లకు అంద జేస్తున్నామని, సరికొత్త లేజర్ అడ్వాన్స్ డిజిటల్ ప్రింటింగ్ టెక్నాలజీలో 100 సంవత్సరాలు లైఫ్ టైమ్ ప్రింట్ క్వాలిటీతో లైట్ వెయిట్, వాటర్ ప్రూఫ్ ఫోటో బుక్స్ భారత దేశంలో పలు ఫోటోగ్రఫీ ప్రొఫెషనల్, గ్రాఫిక్ డిజైనర్స్కు క్వాలిటీ ప్రింట్ సేవలందిస్తున్నామని సంస్థ డైరెక్టర్ సత్యవరపు గోకుల మురళి, మేనేజింగ్ డైరెక్టర్ సత్యవరపు గోపాలకృష్ణ,పులవర్తి విశ్వేశ్వరరావు, రంజిత్ కుమార్ తెలియజేసారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీరువాలు బహుకరణ



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసిన ఏం.రామమూర్తి రూ.15 వేల విలువైన ఒక బీరువాను, విరవల్లి పాలెంకు చెందిన దామిశెట్టి స్వామినాయుడు జ్ఞాపకార్థం వారి కుమార్తెలు ఒక బీరువాను ఆఫీసు ప్రయోజనార్ధముగా బహుకరించారు. అదేవిధంగా ఈదరపల్లి కి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి సరేళ్ల నాగ భూషణం ఆర్థిక శాస్త్ర విభాగమునకు ఒక బీరువాను బహుకరించారు. ఈ మూడు కుటుంబాలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరసింహ స్వామి బీరువాలు బహుకరించిన కుటుంబాలకు ధన్యవాదములు తెలియ చేస్తూ ఇంకను ఔత్సాహికులైన దాతలు ముందుకు వచ్చి తమ దాతృత్వాన్ని ప్రకటించాలని ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది కోరుతున్నామని తెలిపారు.

# వైసీపీకి గుడ్ బాయ్ చెప్పిన బూరిగ ఆశీర్వాదం

**ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిక...**





**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం వైసిపికి రాజీనామా చేశారు. తన అనుచరులు 26 మందితో కలసి మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో గురువారం టీడీపీ లో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఏడిద 4వ వార్డు మెంబర్ అల్లి శ్రీను, 5వ వార్డు మెంబర్ కప్పల కుమారి, 9వ వార్డు మెంబర్ బొంతా లక్ష్మి, కప్పల రాజేంద్రప్రసాద్, అందుకూరి సన్ని, బూరిగ శ్రీనివాసరావు, కాకిలేటి ధనరాజ్, యడ్ల వీర్రాజు, పల్లి సూర్యారావు, బూరిగ దొరబాబు, వార అభిరామ్, బూరిగ నాగేశ్వరరావు, విప్పర్తి సంతోష్, బూరిగ సుమన్ కళ్యాణ్, మొగడ సూర్యనారాయణ, బూరిగ రాహుల్, దేగపాటి రాజు, బూరిగ ఆనందరావు, పల్లి సన్ని, బూరిగ బాపనయ్య, బూరిగ మనోహర్ పాల్, వల్లూరి భీమయ్య, బూరిగ రాంబాబు, బూరిగ రాకేష్, కె.కె.శ్రీనివాస్, బూరిగ వినోద్ లు ఉన్నారు. వీరందరికీ ఎమ్మెల్యే వేగుళ్ళ టీడీపీ కండువాను కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. సర్పంచ్ ఆశీర్వాదం మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి కొత్త దిశగా సాగుతోందని తెలిపారు. అంకితభావంతో పనిచేసి టీడీపీని మరింత బలపరచేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ళను గజ మాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండపేట మండల అధ్యక్షులు కర్రి తాతరావు, ఏడిద గ్రామశాఖ అధ్యక్షులు పర్వతిన వీర్రాజు, నీటి సంఘం అధ్యక్షులు కొలిపోటి సత్యనారాయణమూర్తి (బాబు), సొసైటి చైర్మన్ గొడవర్తి ఎర్రబ్బు, ఎంపిపి ఉండమట్ల వాసు, మేకా జేజిబాబు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు ఉండమట్ల సురేష్, పలివెల దానియేలు, చిట్టూరి ప్రసాద్, అందుకూరి పుల్లాజి, పదం ఆనంద్, గుడాల రామనాథం, లంక రాణా, కుర్మాన శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# అందరం సొసైటీని లాభాల్లో నడిపిద్దాం.. : అడపా

**శ్రీరంగపట్నం సొసైటీకి రూ.3.33 కోట్లు లోటు..**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏ నాయకులు ఆరు గ్రామాల రైతుల సహకారంతో నష్టాల్లో నడుస్తున్న శ్రీరంగపట్నం సొసైటీని ప్రగతి పథంలో నడిపిద్దామని శ్రీరంగపట్నం సొసైటీ అధ్యక్షులు అడపా వీరబాబు తెలిపారు. గురువారం శ్రీరంగపట్నం సొసైటీ ఆవరణలో అధ్యక్షులు అడపా ఆధ్వర్యంలో సొసైటీ సర్వజన మహాసభ నిర్వహించారు. సీఈఓ గణపతి సొసైటీ లావాదేవీలను రైతులకు వివరిస్తూ గత సీఈవో మలిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సొసైటీకి సుమారు 3.33 కోట్ల రూపాయల నష్టం వచ్చిందన్నారు. అదేవిధంగా శ్రీరంగపట్నం, కోటి కేశవరంలో గ్రామాల్లో నిర్మించిన గోడౌన్లు వల్ల కోటి 62 లక్షల రూపాయలు నిరుపయోగంగా మారిందన్నారు. అధ్యక్షులు అడపా మాట్లాడుతూ ఎన్డీఏ నాయకులు, ఆరు గ్రామాల రైతుల సహాయ సహకారాలతో రుణాలు రికవరీ చేసి, కొత్త రుణాలు ఇవ్వడం ద్వారా సొసైటీని లాభాల్లో నడిపిద్దామన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. మలిరెడ్డి పై 51 ఎంక్వయిరీ పూర్తయిందని దీనిలో భాగంగా కోర్టు ద్వారా ఆయన చేసిన నష్టాన్ని రికవరీ చేద్దామన్నారు. గత పాలకుల నిర్వాకం, సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యం సొసైటీ నష్టాలకు కారణమైందని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిని తగ్గిస్తారో, జీతాలు తగ్గిస్తారో తేల్చుకొని సొసైటీకి ఆర్థిక భారం తగ్గించాలన్నారు. మొండి బాకీల రికవరీకి బ్యాంకు సిబ్బంది, సొసైటీ సిబ్బంది కఠిన చర్యలు తీసుకొని రుణాలు రికవరీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీసభ్యులు కొయిడాల వెంకటరమణ, దొడ్డి మంగ, తనకాల నాగేశ్వరరావు, అడపా సుధీర్,కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ గజింగం అప్పారావు, సొసైటీ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## దారిద్ర్య నిర్మూలనలో పాలకుల నిర్లిప్తత

పేదరిక నిర్మూలన పేరిట ప్రత్యేకంగా ఏటా ఓ రోజును కేటాయించి జరుపుకొంటూనే ఉన్నాం. అదే అక్టోబర్ 17 అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం. 'అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం' ప్రతి ఏటా అక్టోబర్ 17న నిర్వహించ బడుతోంది. ప్రపంచ వ్యాప్తంగా పేదరికంలో మగ్గుతున్న వారి స్థితిగతులను అర్థం చేసుకుని, పేదరిక నిర్మూలన కోసం కృషి చేసేందుకు ఐక్యరాజ్య సమితి 1990 అక్టోబర్ 17న అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం నిర్వహించాలని అధికారికంగా ప్రకటించింది. హింసకు అత్యంత హీనరూపం పేదరికం అనేది మహాత్మాగాంధీ మాట. దారిద్ర్యం ఒక సామాజిక, ఆర్థిక సమస్య. ఇది దీర్ఘకాలిక సామాజిక సమస్యగా ఉంది. సమాజంలో ఒక వర్గం కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని పేదరికం లేదా దారిద్ర్యం అంటారు. పేదరికంతో బాధపడుతున్న వారిని "పేదలు" అంటారు. పేదలకు ప్రధాన ఆదాయ వనరు ఉపాధి. కాబట్టి, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. సరైన ఉపాధి అవ కాశాలు లేని ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కష్టమైన పని. పేదరిక నిర్మూలన, సామాజిక పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అతిపెద్ద సవాలుగా మారుతున్నాయి'. ప్రజల చేతుల్లో డబ్బు ఉన్నంత మాత్రాన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందినట్లు కాదు, వారికి విద్య, వైద్యం, రుణ సదుపాయం, మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలి. అవన్నీ లేవంటే సమగ్ర అభివృద్ధి జరగడం లేదని భావించాలి. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలన్నది ఒకటి. కానీ, ఆ గడువు పూర్తయ్యే నాటికి కూడా ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువనే ఉంటారని 2019 జూలైలో ఆ సంస్థ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ప్రస్తుత అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు "పేదలకు బాగానే అందు తున్నాయి. కానీ, నిరుపేదలకు అందడం లేదు". కొందరి గుప్పిట్లోనే సంపద 'దారిద్యానికి అంతం పలికి సంపదను సమానంగా పంపిణీ చేద్దాం' పేరిట ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక ఆసక్తికర అంశాలను వెల్లడించింది. 101 దేశాల్లో 23.1 శాతం మంది పేదరికంలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగం 18 ఏళ్లలోపువారే. అధ్యయనం జరిపిన దేశాల్లో 17.5 శాతం వయోజనులు పేదరికంలో మగ్గుతుండగా, 33.8 శాతం చిన్నారులు ఆ దురవస్థలో కూరుకుపోయి ఉన్నారు. 1990 నుంచి 2015 వరకు ప్రపంచంలో అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (రోజుకు 1.90 డాలర్లు (దాదాపు రూ. 135) లేదా అంతకంటే తక్కువ ఆదాయం) వారి సంఖ్య 190 కోట్ల నుంచి 73.5 కోట్లకు తగ్గింది. అంటే, 1990లో మొత్తం జనాభాలో 36 శాతం మంది పేదరికంలో ఉంటే, 2015 నాటికి అది 10 శాతానికి తగ్గింది. 2015 నాటికి అసమానతల వల్ల వృద్ధిలో వెనకబాటు, దారిద్ర్య నిర్మూలనలో సాను కూలంగా పెరిగేటట్లు చేయడం తొలి లక్ష్యం, వయసు, లింగం వైకల్యం, జాతి, పుట్టుక, మతం, ఆర్థిక వంటి వైరు ద్యాలతో నిమిత్తం లేకుండా 2030 నాటికి ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఆదాయం కనీస అవస రానికి అనుగుణంగా ఉండాలనేది భావన. 2012లో అంతర్జాతీయంగా 90 కోట్ల మంది రోజుకు 1.90 డాలర్ల కంటే తక్కువ కోట్లకు పడిపోయింది. ఈ గణాంకాలు ఎలా ఉన్నా, దుర్భర దారిద్యం ప్రపంచ మానవాళిని దారుణంగా వేధిస్తోంది. 'క్రెడిట్ న్యూస్' నివేదిక ప్రకారం కేవలం ఒక శాతం సంపన్నుల చేతిలో ప్రపంచంలోని సగానికిపైగా సంపద కేంద్రీకృతమై ఉంది. శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగాల్లో మానవ మేధ గగన సీమలను చుంబిస్తున్నా సర్వకాల సర్వావస్థల్లో విస్తరిస్తున్న పేదరి కానికి అడ్డుకట్ట వేయడంలో దారుణ వైఫల్యం వెక్కిరిస్తోంది. నేటికీ లక్షల మంది చిన్నారుల బాల్యం దోపిడికి గురవుతోంది. పేదరికంలో మగ్గుతున్న చిన్నారులు తమ హక్కుల్ని, ఆరోగ్యాన్ని, పోషకాల్ని, విద్యావకాశాలను కోల్పోతున్నారు. ఇవాళ అంతర్జాతీయ దారిద్ర్య నిర్మూలన దినోత్సవం జరుపు కొంటున్నాం. ప్రపంచం నుంచి పేదరికాన్ని తరిమి కొట్టడం సహస్రాబ్ది, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకంగా చెప్పుకొన్నారు. కానీ, ఆ లక్ష్యాలు సాకారమయ్యే అవకాశం కనుచూపు మేరలో కనిపించక పోవడమే బాధాకరం. అవమానాల నుంచి, వెలివేతల నుంచి బాధా సర్పదష్టులనూ విముక్తి కలిగించి, అందరి భాగస్వామ్యంతో పేదరికాన్ని పునాదుల నుంచి పరిమార్చడమే నినాదంగా పేదరిక నిర్మూలన దినోత్సవం జరుపుతున్నారు. సర్వత్రా పెనువేగంతో విస్తరిస్తున్న అసమానతలు ఇప్పుడు ప్రపంచానికి అతిపెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. దేశాల మధ్య యుద్ధం కాదు, పేదరికంపై సమరం చేయాలని ఆ మధ్య భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాల్సి ఉంది. అందరికీ ఉపాధి కల్పించినట్లయితే పేదరికం, ఆదాయ అసమానతలను తగ్గించవచ్చు. ప్రభుత్వం, నీతి ఆయోగ్ ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి. భారత దేశంలో వ్యవసాయం 50 శాతం శ్రామికులకు జీవనాధారం కల్పిస్తోంది. ఈ రంగం అనుబంధ వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలను పెద్ద సంఖ్యలో అందించగలదు. 2022 కల్లా రైతుల ఆదాయాలను సమయాల్లోనే కాదు, పంటలు విరగ పండిన సంవత్సరాల్లోనూ రైతులకు అరకొర ధరలైనా దక్కడం లేదు. అన్నదాతల ఆదాయాలు పెరగనంత వరకు పేదరికాన్ని నిర్మూలించలేం. ఇక భారతీయ శ్రామికుల్లో 92 శాతం అసంఘటిత రంగాల్లోనే పని చేస్తున్నారు. వారికి వేతనాలు బహు తక్కువ. పింఛన్ల వంటి సామాజిక భద్రత భృతులేవీ లభించవు.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# వైద్యశాస్త్రంలో అద్భుతం
# అనస్థీషియా ఆవిష్కరణ



ప్రపంచ అనస్థీషియా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 16న నిర్వహించ బడుతుంది. తొలిసారిగా అనస్థీషియా (మత్తుమందు) ఇచ్చి శస్త్రచికిత్స చేసిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ అనస్థీషి యాలజి స్టుల సంఘం ద్వారా ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్16 న జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఆఫ్ అనస్థీషియాల జిస్టుల ద్వారా ప్రతి సంవత్సరం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని జరుపుకునే క్రమంలో 150 కంటే ఎక్కువ దేశాల నుండి అనస్థీషియా లజిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 134 కంటే ఎక్కువ సంఘాలు పాల్గొంటాయి. పూర్వకాలంలో శస్త్ర చికిత్స అనంతరం పుట్టే నొప్పిని తగ్గించేదిగా ఆల్కహాల్ (మదిర) ను గుర్తించి శస్త్ర చికిత్స చేయించుకునే రోగికి ...6వ శతాబ్దానికి చెందిన ఆయుర్వేదానికి చెందిన శస్త్ర చికిత్సకుడు, అపర ధన్వంతరి సుశ్రుతుడు సురాపానం చేయించే వాడు. భరించలేని చాలా నొప్పికి ఉప శమనంగా వైద్యులు, నర్సులు కాకుండా ఇతర మనుషులు గట్టిగా పట్టుకుంటే శస్త్ర చికిత్స చేసేవారు. అమెరికాలోని మసెచ్యూసెట్ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16వ తేదీన విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు గిల్బర్ట్ అబోట్ అనే రోగిపై ఈథర్ వాయువును ప్రయోగించారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మసాచుసెట్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16న గిల్బర్ట్ అంబార్టు గొంతుకు శస్త్రచికిత్స చేసేందుకు... విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు ప్రముఖ దంత వైద్యుడు జాన్‌కొలిన్స్‌తో కలిసి ఈథర్ మత్తు మందు ఇవ్వగా, హార్వర్డ్ మెడికల్ స్కూల్ మొదటి డీన్ అయిన జాన్ కాలిన్స్ వారెన్, అబాట్ మెడలోని కణితి భాగాన్ని నొప్పిలేకుండా తొలగించగా, అలా దిగ్విజ యంగా ఆపరేషన్ చేశారు. ఈథర్. సల్ఫూరిక్ యాసిడ్, ఆల్కహాల్ మిశ్రమాన్ని సంశ్లేషణను ఇందుకు ఉపయోగిం చారు. 1860ల నాటికి మత్తు మందు విస్తృతంగా వాడకంలోకి వచ్చింది. 1860ల్లో యాంటీ సెప్టిక్ పద్ధతుల కనిపెట్టిన తర్వాత ఆపరేషన్లు మరింత సులువుగా మారాయి. ఈ పరిణా మం వైద్యశాస్త్రంలో అద్భుతం ఆవిష్కరించడమే గాకుండా మత్తు వైద్య విభాగంలో విప్లవాత్మ కమైన మార్పులకు నాంది పలికింది. ఇది వైద్య చరిత్రలోని అత్యంత ముఖ్యమైన సంఘటనలలో ఒకటిగా నిలిచి పోయింది. ఆ విజయాన్ని పురస్కరించుకుని అప్పటి నుంచి ఏటా అదే రోజున ప్రపంచ అనస్తీషియా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. సాధారణ మత్తు (అనస్థీషియా) ను నియంత్రితంగా స్పృహను కోల్పోయేలా చెయ్యడానికి ఉపయోగిస్తారు, దీనిని శస్త్రచికిత్సలు నిర్వహించవలసిన అవసరం ఉన్నపుడు ఉపయోగిస్తారు. అనస్థీషియా వైద్య ప్రయోజనాల కోసం ఇవ్వబడేది, ఇది తాత్కా లికంగా స్పర్శను అలాగే స్పృహను కోల్పోయేలా చేస్తుంది. ఆపరేషన్ సమయంలో అనస్థీషియా ఉపయో గించడం వల్ల రోగి నిద్రాణ స్థితిలో ఉంటాడు. నరాల ద్వారా సంకేతాలు బదిలీకావడాన్ని అనస్తీటిక్స్ నిరోధిస్తాయి, తద్వారా మెదడు నొప్పిని గుర్తించే అనుభూతిని నిరోధిస్తాయి. ఆపరేషన్ సమయం, శరీర భాగం, వైద్య పరిస్థితి, రోగి వయస్సు తదిత రాలను బట్టి మత్తు ఇచ్చే విధానాన్ని ఎంపిక చేసుకుంటారు. సాధారణ అనస్థీషియాలో... రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు, ఏమీ అనుభూతి చెందరు. స్థానిక అనస్థీషి యా లో... రోగి శస్త్రచికిత్స సమయంలో మెలకువగా ఉంటాడు, నిర్ణీత ప్రాంతాన్ని తిమ్మిరి చేయడానికి మందులు ఇంజెక్ట్ చేయ బడతాయి. ప్రాంతీయ అనస్థీషియాలో... రోగులు మేల్కొని ఉంటారు. శరీర భాగాలు తిమ్మిరిగా ఉంటాయి. మానిటర్డ్ అనస్థీషియా కేర్ అనేది స్థానిక అనస్థీషియాతో పాటు మత్తు, అనల్జీసియాతో పాటుగా డయాగ్నస్టిక్ లేదా థెరప్యూటిక్ విధానాల కోసం సురక్షితమైన విధానంగా మత్తు, రోగి యొక్క ఆందోళనను తగ్గించే చర్యలు, సమర్థవంత మైన నొప్పి నియంత్రణకు ఉపకరిస్తుంది. బాయల్స్ అనే అనస్థీషియా మిషన్ కనిపెట్ట బడ్డాక, ఈ మిషన్ అనస్థీషియా విభాగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకు వచ్చింది. దీని ద్వారా ఏకకాలంలో ఒకటి కంటే ఎక్కువ అనస్థీషియా వాయువులను నిర్దిష్టమైన ప్రమాణంలో రోగి శరీరంలోకి పంపించడానికి అవకాశం ఉంటుంది. మత్తుమందు డాక్టర్లు ఉపయోగించే అనేక పరికరాలు రోగి పల్స్, బీపీ, ఆక్సిజన్ స్థాయిలు, కార్బన్‌డైయాక్సైడ్లలను నిరంతరం పర్యవేక్షిం చడానికి సాయం చేస్తున్నాయి. రోగులకు ఆపరేషన్లు నిర్వహిం చడంలో అనస్థీషియా వైద్యులే కీలక పాత్ర పోషిస్తారు. చిన్న శస్త్ర చికిత్సలు మొదలు కొని అతి క్లిష్టమైన మెదడు, గుండె, ఊపిరి తిత్తులు, కాలేయం, మూత్ర పిండాలు, అవయవాల మార్పిడి, కీళ్ల మార్పిడిని సునాయసంగా చేస్తున్నారు. అంటే ఐసీయూ, ప్రకృతి వైపరీత్యాలు, దీర్ఘకాలిక నొప్పుల నివారణలోనూ అనస్థీషియా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. రోగులకు శస్త్ర చికిత్సకు ముందు సంరక్షణకు అనస్థీటిస్టులు బాధ్యత వహిస్తారు. ఆపరేషన్ థియేటర్లలో రోగికి మత్తు ఇవ్వడమే గాక అత్యవసర విభాగాల్లో వెంటిలేటర్ ద్వారా కృత్రిమ శ్వాస అందించడం, ఆఖరి క్షణాల్లో రోగులకు శ్వాస, రక్త ప్రసరణ పునరుద్ధరించడం లో మత్తు వైద్యసేవలు ప్రధాన భూమిక పోషించడం ద్వారా క్రిటికల్ కేర్ విభాగంలో కీలకంగా మారింది. ప్రమాదాలు సంభవిం చి నప్పుడు ట్రామాకేర్ లోనూ, ప్రకృతి విలయాల్లోనూ, మాస్ క్యాజువాలిటిల్లో ముఖ్య భూమిక పోషించడం ద్వారా వైద్యరంగంలో అనస్థీషియా వైద్యులు కీలకంగా మారారు.

# పోషకాహార లోపంతోనే అనారోగ్యం

ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని యొక్క విలువ తెలుస్తుంది. ఆహారం పారేయడానికి ఒక్క నిమిషం చాలు, కాని ఆ ఆహారాన్ని పండించడానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృధా చేస్తారు. దీనికి సంబందించే అంటే ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈరోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆహార దినోత్సవం జరుపు కుంటారు. 1945 అక్టోబర్ 16న ఐరాస ఆహార మరియు వ్యవసాయక సంస్థ స్థాపించ బడింది. అయితే ఈ కార్యక్రమాన్ని మొదటిసారి 1981లో జరుపు కున్నారు. ఈ ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని మనం చెయ్యాల్సిందల్లా ఒక్కటే ఆహారాన్ని వృధా చేయరాదు. ప్రజల్లో ఈ విషయంలో చైతన్యం నింపాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి 1945 అక్టోబర్ 16న 'ఆహార, వ్యవసాయ సంస్థ' ను ప్రారంభిం చారు. ఈ సంస్థను ఆంగ్లంలో %ఫీూూ% అంటారు. అంటే ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్. ఈ సంస్థ గౌరవార్థం ఈ సంస్థ ఏర్పడిన అక్టోబరు 16 తేదిని ప్రపంచ ఆహార దినోత్సవంగా నిర్ణయించారు. అప్పటి నుంచి ఇదే రోజున ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రతి ఏటా 150 కంటే ఎక్కువ దేశాలలో ఆహార దినం పాటిస్తున్నారు. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే... అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకుంటే... ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగు తామనో, లావు అయి పోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్తలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురు కుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఈ రోజు ప్రపంచ ఆహార దినోత్సవం. ఈ సందర్భంగా ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఈ ఆహార దినోత్సవం సందర్భంగా ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు



గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి. భారతీయులు రోజూ కనీసం 400గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటు లోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి, లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో విలసిల్లింది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన మనదేశం స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, పాలకుల పేదరిక నిర్మూలనా పథకాలు, లక్షల, కోట్ల పంచ వర్ష ప్రణాళికలు ఈ ఏడు దశాబ్దాల్లో పేదరికం ఆకలి తీర్చలేదు. పేదలు దరిద్రులుగా, ధనికులు బిలియనీర్లు, ట్రిలియనీర్లు కావటానికి ఉపయోగపడ్డాయి తప్ప, సగటు మనిషి ఆకలి తీర్చటంలో విఫలమయ్యాయి. దేశ స్థూల జాతీయాదాయం చూపి చంకలు గుద్దుకుంటున్న పాలకులు జాతీయాదాయంతో పాటు, జాతులకు ఆహార భద్రత కల్పించటంలో విఫలమయ్యారు. దీనికి ఉదాహరణ పనికి ఆహార పథకంలో అవినీతి, పేదలకిచ్చే సబ్సిడి ఆహార భద్రత కార్డుల్లో అవినీతి, ఆహార అవసరాలు తీర్చుట గురించి అవకాశం కల్పించినా రైస్‌మిల్లర్ల మాయాజాలం వెరసి అవినీతి ఎందెందు వెతికినా అందందు కలదన్నట్టు అవినీతి బీజాలు మహా వృక్షాలై పాలకుల ప్రజాస్వామ్య వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఒక సమ్రగ విధానమంటూ లేకపోవటంతో వ్యవసాయాన్ని సమాధిచేసి, ఉన్న వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ప్రపంచ వేదికల్లో గొప్పలకు పోయే మన పాలకుల ఏలికలు వాస్తవ పునాదులపై నిలబడి, మాటల్లో కాకుండా ఆచరణతో కూడిన ఆహార భద్రత పరిష్కారానికి పూనుకోవాలి. అదే జాతీయ ప్రయోజనాలకు,జాతి ప్రయోజనాలకు శ్రేయస్కారం.



### జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై

# అవగాహన అవసరం




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జీఎస్టీ సంస్కరణల ప్రతిఫలాలు ప్రతి ఒక్కరికి చేరువయ్యేలా విస్తృతమైన ప్రచారం చేస్తున్నట్లు స్టేట్ జీఎస్టి అసిస్టెంట్ కమిషనర్ పి.సత్యనారాయణ, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటుచేసిన జీఎస్టీ తగ్గింపు అవగాహన సమావేశంలో ఇరువురు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక దేశం ఒక పన్ను నినాదంతో ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టి తగ్గింపు సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ముఖ్యంగా అన్ని వర్గాల ప్రజలు,వ్యాపారస్తులుకు మేలు జరిగేలా జీఎస్టి సంస్కరణలు చేశారన్నారు. గతంలో 4 స్లాబులుగా ఉన్న జీఎస్టీ ను 2 స్లాబ్ లుగా సంస్కరించి అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా జీఎస్టి ఉందన్నారు. సూపర్ జీఎస్టి -సూపర్ సేవింగ్స్ పట్ల అన్ని వర్గాల ప్రజలకు,వ్యాపారస్తులకు అవగాహన కల్పించే నిమిత్తం ప్రభుత్వం అవగాహన సదస్సులు, ఇంటింట ప్రచారం, ర్యాలీలు నిర్వహిస్తుందన్నారు. అంతిమంగా జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు కలిగే లాభాలను,చేకూరే ప్రయోజనాలను తెలియజేయడమే ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. జీఎస్టీ సంస్కరణలు దేశ చరిత్రలో ఒక నూతన అధ్యయమని పేర్కొన్నారు. విద్యా,వైద్యం కు సంబంధించిన వస్తువులపై పూర్తి రాయితీ ఇచ్చిందన్నారు. భవన నిర్మాణ రంగం, వ్యవసాయ యంత్రాలు, ఆక్వా కల్చర్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే ప్రతి వస్తువుపై జీఎస్టీ తగ్గించి నూతన జీఎస్టి 2.0 అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఉండవిల్లి శివ,ఆటో యూనియన్ల అధ్యక్షుడు కంచుమర్తి బాబురావు, కూటమి పార్టీ నాయకులు కడియాల రాఘవన్, మేడిశెట్టి శేషారావు, మేడిశెట్టి సూర్యనారాయణ, దొమ్మలపాటి విజయలక్ష్మి, ఆటో యూనియన్ నాయకులు,ఓనర్లు, డ్రైవర్లు,మినీ గూడ్స్ వెహికల్స్ నాయకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార వర్గాల ప్రతినిధులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో కోటి సంతకాలు సేకరణ




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజి ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలన్న తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తూ,ప్రజా ఉద్యమ కార్యాచరణను ప్రకటించిన విష్యం తెలిసిందే. అయితే ఈ నేపథ్యంలో రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో రామచంద్రపురం టౌన్ గుబ్బలవారి పేట 27వ వార్డులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా పలువురు దగ్గర నుండి కోటి సంతకాలు సేకరణలో భాగంగా పలువురుతో సంతకాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాథం శెట్టి శ్రీధర్, వైఎస్ఆర్ సీపీ అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుబ్బల గణ, దంగేటి వీర భద్రరావు, నున్నబోయిన శ్రీరాములు, రెడ్డి రాజు, మరియు రామచంద్రపురం మండల కన్వీనర్ పోలినాటి ప్రసాద్, సోషల్ మీడియా అధ్యక్షులు పాటి ప్రసాద్,కురుపూడి భీమన్న,దంగేటి సూరిబాబు, అనుసూరి శ్రీనివాస్ మరియు వార్డు కమిటీ సభ్యులు, అనుబంధ విభాగ అధ్యక్షులు, కౌన్సిలర్స్, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# నందూరి ఫణి కుమార్‌కు ఘన సన్మానం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ కృతివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ మరియు ఎకనామిక్స్ విభాగాల ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0 ఉత్సవాల్లో భాగంగా స్థానిక మోక్ష ఇండస్ట్రీస్ వ్యవస్థాపకులు నందూరి ఫణి కుమార్ ఇంటరాక్షన్ విత్ ఎమ్ఎస్ఎమ్ఈ అబౌట్ జీఎస్టీ 2.0 కార్యక్రమానికి ముఖ్య అధితిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఫణి కుమార్ మాట్లాడుతూ విద్యార్థిని,విద్యార్థులకు జీఎస్టి 2.0 అమలు వలన సూక్ష్మ,చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలకు కలుగుతున్నటువంటి ప్రయోజనాలను విఫలంగా తెలియజేసారు. విద్యార్థులు అందరూ కూడా జీఎస్టీ 2.0 రాకముందు వచ్చిన తర్వాత వస్తువుల యొక్క ధరలలో వచ్చిన మార్పులను పరిశీలించాలని కోరారు. అలానే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్ రామకృష్ణ పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఉద్యోగమే కాకుండా వ్యవస్థాపకులుగా కూడా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అధితిగా పాల్గొన్న ఫణి కుమార్‌కు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ఆర్ వెంకటేశ్వర్లు మరియు ఎకనామిక్స్ విభాగాధిపతి బి.రవి కుమారు, కామర్స్ అధ్యాపకులు జి.సత్య దుర్గారావు, జే.రాజేషు పాల్గొన్నారు.

# బాణాసంచా అమ్మకాలకు అనుమతులు తప్పనిసరి

### చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా



**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా విక్రయం కోసం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా తెలిపారు. అక్రమంగా అనుమతులు లేకుండా బాణ సంచా విక్రయం జరిపితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. బాణసంచా నమ్మకం దారులు ముందుగానే అనుమతులు పొందడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా చట్టబద్ధంగా విక్రయాలు జరపవచ్చునని అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా పేర్కొన్నారు.

# సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలి

**మాటలతో కాలం గడిపేలా అధికారుల తీరు ఉండకూడదు - కనీస సౌకర్యాలైన త్రాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల వెలుతురు పై నిర్లక్ష్యం తగదు**

**నాలుగు సార్లు అధికారమిచ్చిన నియోజకవర్గ ప్రజలకు పూర్తి స్థాయిలో త్రాగునీరు అందించలేనందుకు బాధపడుతున్నాను.**

రాయవరం మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ళ...




**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఉద్యోగులు తోచిన సమాధానం చెప్పి తప్పించుకునేలా కాకుండా, వారి సమస్యలను పరిష్కరించే దిశగా సహకరించాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో గల స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశం సజావుగా సాగింది. స్థానిక ఎంపీడీవో కీర్తి స్పందన ఆద్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షులు నౌడు వెంకటరమణ అధ్యక్షత వహించగా, మండపేట నియోజకవర్గ శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో తొలుత బడ్జెట్ వివరాలపై మండల పరిపాలన అధికారి వై.ఎన్.ఎన్. గోపాల్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి సవరణ బడ్జెట్ గానూ రూ.9,76,54,748లు రాబడిగా చూపుతూ, రూ.9,76,49,160లు వ్యయంగా వర్ణిస్తూ, రూ.5,558లు మిగులుగా బడ్జెట్ చూపించగా, 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ, రూ.10,71,58,276 రాబడి గానూ, రూ.10,71,51,559 ఖర్చుగానను, రూ.6717 లు మిగులు బడ్జెట్‌గా అంచనా వేశామని తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ,తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించి, వాటి వివరాలను వెల్లడించారు. వీటిపై ప్రజా ప్రతినిధులు పంచాయతీలలో ఉన్న పలు సమస్యలను లేవనెత్తి అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారుల పని తీరుపై ఎమ్మెల్యే వేగుళ్ళ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించడం సరికాదని, సమస్యలను పరిష్కరించాలని కోరిన వారికి అర్థంకాని తోచిన సమాధానం చెప్పి తప్పించుకోకుండా, ఆ సమస్య పరిష్కార దిశగా సాగాలని, చెల్లూరు పంచాయితీ పరిధిలో ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి వినతిపత్రం ఇచ్చి, నెలలు గడిచినా ఎందుకు పరిష్కరించలేదని ఎమ్మెల్యే నిలదీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నదురుబాద పంచాయతీ పరిధిలో త్రాగునీటి కుళాయి నీటితో, డ్రైనేజీ మురికినీరు కలిసి పోతుందని కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తెలపగా, నియోజకవర్గంలోని ద్వారపూడి, కపిలేశ్వరపురం పలుచోట్ల ఉన్న మంచినీటి సమస్యలను గుర్తుచేస్తూ, సమస్యలకు ప్రజా ప్రతినిధులు సైతం అలవాటు పడిపోయారని,తనను కలిసినా వీటిపై మాట్లాడడం లేదని, ప్రజలకు ముఖ్యంగా త్రాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల వెలుతురు ఇవ్వడం ప్రథమమని ఆ దిశగా ప్రజాప్రతి నిధులు కదలాలని ప్రతిపక్ష మైనా, మిత్ర పక్షమైనా, అధికారి పార్టీ కార్యకర్తలైనా ప్రజా సమస్యలపై దృష్టి నిలపాలని సూచించారు. తనను నాలుగు సార్లు గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కనీస వసతులు కల్పించడం తన బాధ్యత అని తెలిపారు. అధికారులు ఆగిపోయిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కాగా ఈకార్యక్రమానికి పలు శాఖలు గైర్హాజరు కాగా, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి పట్ల తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే వేగుళ్ళ స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో మండల తహశీల్దార్ భాస్కర్ బాబు, మండల పరిపాలన అధికారి వై.ఎన్.ఎన్. గోపాల్, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, సెక్రటరీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులలో

# ప్రతిభకు కొదవలేదు

**విద్యార్థులలో క్రీడా ప్రతిభను వెలికి తీసే బాధ్యత పీఈటిలపై ఉంది**

**వ్యాయామ ఉపాధ్యాయులుగా విద్యార్థులలో ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాలి**

**కోనసీమ క్రీడోత్సవం 2.0 పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి**

**సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాఠశాల స్థాయి నుంచే ఉత్తమ క్రీడాకారులను గుర్తించి, విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీసే గొప్ప భాధ్యత ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లపై ఉందని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు పేర్కొన్నారు. రాయవరం మండల విద్యాశాఖ కార్యాలయం లో బుధవారం నూతనంగా విధుల్లో చేరిన, వ్యాయామ ఉపాధ్యాయులకు డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించగా, ఈ సమావేశానికి ఏఎంవో పి.రాంబాబు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల్లో ప్రతిభకు కొదవలేదని, ప్రతి సంవత్సరం క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పోటీలు విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా ఎస్‌జీఎఫ్ పోటీలు మండల స్థాయిలో చివరి దశకు చేరుకున్నాయని అన్నారు. డివిజన్, జిల్లా స్థాయి పోటీలను సమర్ధవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందని, అయితే ఏ రాష్ట్రంలో లేని విధంగా గతేడాది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కోనసీమ క్రీడోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించినట్లు వివరించారు. ప్రాథమిక స్థాయిలో 3,4,5 తరగతుల విద్యార్థులకు కూడా తొలిసారిగా పోటీలను నిర్వహించిన ఘనత మన జిల్లాకే దక్కుతుందన్నారు. ఈ ఏడాది కూడా కోనసీమ క్రీడోత్సవం 2.0 నిర్వహించే అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాలని ఎఎంవో పి.రాంబాబు సూచించారు. ఈ సమావేశంలో ఎంఈవో-2 వైవివి సూర్యనారాయణ, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసమే

# బీబీసీ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు..

**బీబీసీ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకుడు రత్నప్రసాద్..**

**ఈనెల 23 నుంచి డీఎస్సీ టెట్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడి..**




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ ప్రాంతంలో ఉత్తమ విద్యాబోధనతో పాటు పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు బీబీసీ ఇనిస్టిట్యూట్ కృషిచేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు సరెళ్ల రత్నప్రసాద్ అన్నారు. అమలాపురంలోని గొల్లగూడెంలో ఉన్న బీబీసీ ఇనిస్టిట్యూట్ వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షలకు అభ్యర్థులు శిక్షణ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, పోటీపరీక్షల అభ్యర్థులు ఎంతో వ్యయ ప్రయాసలతో అనేక ఇబ్బందులు పడేవారని దీనిని దృష్టిలో పెట్టకునే కోనసీమప్రాంత వాసిగా కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో బీబీసీ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేశానన్నారు. అందరికీ అందుబాటులో బీబీసీ ఇనిస్టిట్యూట్ రాకతో పోటీ పరీక్షల అభ్యర్థులకు ఆర్దిక భారం తగ్గడంతో పాటు అత్యున్నత స్థాయి సదుపాయాలతో సీనియర్ ఫ్యాకల్టీల ద్వారా సమగ్ర శిక్షణ కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. బీబీసీ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసిన తరువాత కేవలం ఏడాది వ్యవధిలోపే ఇంతవరకు 11 మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు బ్యాంకు పరీక్షలు, నలుగురు డీఎస్సీ అభ్యర్థులు, ఇతర పోటీ పరీక్షల్లో మరో అయిదుగురు క్వాలిఫై అయ్యి ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. తాజాగా ఇనిస్టిట్యూట్‌లో డీఎస్సీ అభ్యర్థులకోసం టెట్ బ్యాచ్ ను ప్రారంభించామని, ఈ శిక్షణ తరగతులు అక్టోబర్ 23నుంచి ప్రారంభం కానున్నట్లు రత్నప్రసాద్ వెల్లడించారు. ఈశిక్షణ ఇచ్చేందుకు అవనిగడ్డ నుంచి కె.సత్యానంద రెడ్డి, ఏ.నారాయణరావు తదితర సీనియర్ ఫ్యాకల్టీలు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. బీబీసీ ఇనిస్టిట్యూట్‌లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, రోజూవారీ టెస్ట్‌లు, సకాలంలో సిలబస్ పూర్తిచేయడంతోపాటు అభ్యశించేందుకు ఏసీ స్టడీ హాల్ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోటీ పరీక్షల్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా కీర్తి పతాక ఎగిరేలా బీబీసీ ఇనిస్టిట్యూట్ నిరంతరం కృషిచేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. దీనికి అందరి సహకారం అభ్యర్థిస్తున్నట్లు రత్న ప్రసాద్ ఆకాంక్షించారు.

# జీఎస్టీ ఫలాలు అందరికీ మేలు...

### సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పేద, మధ్యతరగతి వర్గాలకు, వ్యవసాయ, విద్యా, వ్యాపార రంగాలకు లబ్దిచేకూరుస్తూ ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీఎస్టీ ఫలాలు అందరికీ అందే విధంగా జీఎస్టీ పై అవగాహన కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరిట కార్యచరణ చేపట్టిందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణంలో పెద్ద కాలువ వంతెన వద్ద మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ లక్ష్మి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే వేగుళ్ళ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తొలుత ర్యాలీని పెద్ద కాలువ వంతెన వద్ద ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రారభించారు. అక్కడ నుండి కలువపువ్వు సెంటర్ వరకు ర్యాలి జరిగింది. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ ప్రయోజనాలను రాష్ట్రంలోని ఇంటింటికీ తీసుకెళ్లేలా 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రమంతటా జీఎస్టీ 2.0 సంస్కరణలపై విస్తృత ప్రచారం చేయటం జరుగుతుందన్నారు. ప్రజలంతా జీఎస్టీ పై అవగాహన పెంచుకోవాలని, తద్వారా ఇంటింటికీ జీఎస్టీ ఫలాలు అందుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ తిరుమలరావు, మున్సిపల్ కమీషనర్ టి.వి.రంగారావు, ఎంపిడిఒ సత్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, సి.టి.ఒ సిబ్బంది, ఆర్.టి.ఒ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారి, మున్సిపల్ కమిషనర్ తనిఖీలు

ప్రముఖ రెస్టారెంట్ బిర్యానీలో మండ్రగప్ప

బిర్యానీ తిన్న యువకుడు మృతి మాధ్యమాలలో చక్కర్లు

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశాలతో ఎట్టకేలకు కదిలిన ఫుడ్ సేఫ్టీ యంత్రాంగం

ఎటువంటి యంత్ర సామగ్రిలు లేకుండానే సాధారణ తనిఖీలు

తూతూ మంత్రంగానే తనిఖీలు జరిపారంటూ ప్రజలు ఆరోపణ





**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో ప్రముఖ రెస్టారెంట్ బిర్యాని పార్సెల్ లో మండ్రగప్ప తిని యువకుడు మృతి అంటూ మాధ్యమాలలో చక్కర్లు కొడుతున్న ప్రచారాన్నికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్ రామయ్య అమలాపురం మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ గురువారం నాడు అమలాపురం పట్టణంలో గల జీకే గ్రాండ్ రెస్టారెంట్, విష్ణు శ్రీ రెస్టారెంట్లలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్ రామయ్య మాట్లాడుతూ హోటళ్లలో పరిశుభ్రత వంటశాలలో ఉపయోగించే నూనెలు నిలవ ఉన్న ఉత్పత్తుల గడువు తేదీ వంటస్థల స్థితిని పరిశీలించినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ వాడుతున్న నాణ్యత లేని ప్లాస్టిక్ కవర్లను గుర్తించి వాటి వినియోగంపై కేవలం చిన్నపాటి ఫైన్ విధించి వదిలేశారు ఈ తనిఖీలు సాధారణ తనిఖీలు మాత్రమేనని ఇకమీదట ప్రతి మూడు నెలలకు తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ తనిఖీలు కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా ఆహార భద్రత ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని నూనె, నీటి ఆహార నమోనాలు సేకరించి ల్యాబ్ టెస్టులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు ఈ తనిఖీలలో అధికారులు ఎటువంటి ఆధునిక ఫుడ్ టెస్ట్ పరికరాలు ఆయిల్ టెస్ట్ పరికరాలు లేకుండా నామమాత్రంగానే తనిఖీలు చేశారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్న రెస్టారెంట్లు హెూటల్స్ పై ఫుడ్ సేఫ్టీ అధికారులు మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని అధికారులను వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

### గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే

# కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కావాల్సిన చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా రావులపాలెం సీఆర్సీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి,తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం,జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్,ఆర్డీఓ పి శ్రీకర్, డి.ఎస్.పి సుంకర మురళీమోహన్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. 400మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు చెందిన మహిళలకు సామూహిక సీమంతాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సిఆర్సి సభ్యులను అభినందించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళలు సమతుల్యమైన పోషక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మన ఇంటి పరిసరాల్లో సేంద్రియ విధానంలో ఆకుకూరలు పండించి వినియోగించుకుంటే ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవని సూచించారు.కిషోర బాలికల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సేవాభావంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

# కమిషనర్ కలిసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘాల ప్రతినిధులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనాని మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘాల నాయకులు.ఈ సందర్భంగా నూతన కమిషనర్ మాట్లాడుతూ చారిత్రాత్మకంగ ప్రసిద్ధి చెందిన పవిత్ర గోదావరి ఒడ్డున ఉన్న రాజమహేంద్రవరం కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించడం చాలా ఆనందకరం,అదేవిదంగా నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని విభాగాలను అభివృద్ధి చేయుచూ రాష్ట్రస్థాయిలో మొదట స్థానంగా ఉండడానికి మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బందితో పాటు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘాల అధ్యక్షులు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్,జిల్లా ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల అధ్యక్షులు కోరుకొండ చిరంజీవి,కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్ నిర్వహణ కార్యదర్శి రత్నం ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దారా యేసురత్నం, బీసీ వెల్ఫేర్ మాజీ జిల్లా అధ్యక్షులు ఎంపీడీ కృపావరం తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియపరిచారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన పూర్వ విద్యార్థి తల్లిదండ్రులకు సన్మానం




**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ భాస్కర విద్యాదానికేతన్ పూర్వ విద్యార్థి గుండిపోగు సంతోష్‌కి ఎంబీబీఎస్ సీట్ వచ్చిన సందర్భంగా వారి తల్లితండ్రులు సంతోష్‌ను భాస్కరా విద్యానికేతన్ ప్రిన్సిపాల్ సిబ్బంది చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వేణుగోపాల్ మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు వారి యొక్క లక్ష్యాల కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ మొదలుపెట్టి వారి యొక్క కలలను సాకారం చేసుకుంటారని తెలియజేశారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులైన రాంబాబు మాట్లాడుతూ పిల్లలకు భవిష్యత్తులో ఏ విధంగా చదివితే వారి యొక్క లక్ష్యాలను చేరుకొనడానికి దిశా నిర్దేశం చేస్తూ విద్య యొక్క ఔన్నత్యాన్ని తెలియజేస్తూ పిల్లలకు అమూల్యమైన సందేశం ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# జీఎస్టీ 2.0తో రవాణా రంగంలో పెను మార్పులు

## ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రకటన




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జీఎస్టీ 2.0 విధానంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా రంగంలో పెను మార్పులు చోటు చేసుకుంటాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రకటించారు. జీఎస్టీ 2.0 విధానం అమలుతో అన్ని రకాల వాహన వినియోగదారులకు కూడా అనేక ప్రయోజనాలు కలుగు తున్నాయని పేర్కొన్నారు. వాహన విడి భాగాలు, భీమా, వాహనాల కొనుగోలు వంటి రంగాల్లో ధరలు తగ్గడంతో ఆటోమొబైల్ రంగం మరింత అభివృద్ధి దిశగా సాగుతోందని అన్నారు. జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించేందుకు 17 రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్న “జీఎస్టీ సూపర్ సేవింగ్స్” ప్రచారంలో భాగంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రక్కులతో ర్యాలీని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భారీ ర్యాలీని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. తాను శిరస్సుకు శిరస్త్రాణాన్ని ధరించి స్వయంగా హెూండా స్కూటీని నడుపుతూ వాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహనా సమావేశం వేదిక వద్ద ప్రదర్శించిన వివిధ వస్తువుల ఉత్పత్తి సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శనా శాలలను ఆమె ప్రారంభించారు. అనంతరం సభికులను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. కార్లు, బస్సులు, ట్రక్కులు, ఎలక్ట్రికల్ వాహనాలు, ఇతర ద్విచక్ర వాహనాల అమ్మకపు ధరలు తగ్గడంతో ప్రజలకు ప్రత్యక్ష లాభాలు చేకూరుతున్నాయని, జీఎస్టీ 2.0 వలన రవాణా రంగంలో పెను మార్పులు చోటు చేసుకుంటాయని ఎమ్మెల్యే తెలిపారు. ట్రాన్స్పోర్ట్ ఖర్చులు తగ్గడం ద్వారా వినియోగదారులు, వ్యాపారులు, రైతులు సమానంగా లాభపడతారని పేర్కొన్నారు. అదే విధంగా, ఎలక్ట్రిక్ వాహనాలపై ఐదు శాతం రాయితీ ఇవ్వడంతో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతుందని అన్నారు. ర్యాలీ సందర్భంగా రవాణా శాఖ అధికారులు, స్థానిక నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు. గ్రామంలో కరపత్రాలు పంచుతూ ప్రజలకు జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. పలువురు నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

# కిర్లంపూడి సొసైటీకి విద్యుత్తు సౌకర్యం కట్...!



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామేశ్వరం వెళ్లినా శనేశ్వరం తప్ప లేదన్న ట్లుగా తయారైంది కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) దుస్థితి. వందల కోట్ల రూపా యలు టర్నోవర్ కలిగిన ఈ సంఘంలో గత కొద్ది మాసాల క్రితం భారీ కుంభకోణం చోటు చేసుకోవడం తో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి గత పది నెలలుగా జీతాలు లేక కడుపు నిండని పరిస్థితి ఈ సొసైటీలో నెలకొంది. అవేమీ పట్టని సెంట్రల్ బ్యాంక్ జిల్లా ఉన్నతాధికా రులు చివరికి సొసైటీకి చెందిన భవనానికి కూడా విద్యుత్ బిల్లులు సక్రమంగా చెల్లిం చకపోవడం వల్ల గురువారం ఉదయం ఈ భవనంలో విద్యుత్ సరఫరాని విద్యుత్ శాఖ అధికారులు నిలిపివేసిన పరిస్థితి దాపురిం చింది. ఇక్కడ విచిత్రం ఏమిటంటే కోట్ల రూపాయలను దారి మళ్లించి దోచుకుపో యిన బడాబాబులు, అందుకు సహకరిం చిన అధికారులు రోజుకో కారులో చక్కర్ల కొడుతూ ఎంజాయ్ చేస్తుంటే, సొసైటీ పనితీరును చక్కదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న సిబ్బందికి మాత్రం జీతాలు లేక ఆకలితో అలమటించడం ఆఖరకు సొసైటీలో కూర్చునేందుకు కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోవడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా సొసైటీ రైతులు ఖాతాదారులు గ్రామ ప్రజలు కిర్లంపూడి సొసైటీలో చోటుచేసుకున్న కుంభకోణంపై ఎదురొడ్డి పోరాడకపోతే ఈ గ్రామంలో ఒకప్పుడు సొసైటీ ఉండేదట అని చెప్పుకోవాల్సి వస్తుంది.

### కోనసీమ క్రీడోత్సవాలు

# క్రీడా స్ఫూర్తిని చాటేలా నిర్వహించాలి

## జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించిన కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థినీ విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని రగిలించి శారీరక ఆరోగ్యా న్ని ప్రోత్సహిం చేందుకు కోనసీమ క్రీడోత్సవాలు క్రీడా స్ఫూర్తిని చాటేలా నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించా రు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు విద్యాశాఖ అధికారులు మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి నవంబర్ మొదటి వారంలో ప్రాథమిక స్థాయి క్రీడా పోటీలను మండల స్థాయిలోనే పూర్తి చేయాలని, 6 వ తరగతి నుండి ఇంటర్ వరకు క్రీడా పోటీలను జిల్లాస్థాయిలో నవంబరు 12, 13 ,14 తేదీలలో స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియం నందు నిర్వహించాలని ఆదేశిం చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో ప్రాథ మిక, ఉన్నత స్థాయి పాఠశాల విద్యార్థుల క్రీడోత్సవాలలో అండర్ 14 అండర్ 17 విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకొని క్రీడా ప్రతిభను చాటుకోవాలన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడడమే కాకుండా, సమూహంలో పని చేయ డం, సహనశీలత, నాయక త్వ లక్షణాలు వంటి నైపు ణ్యాలను అభివృద్ధి చేసు కునే అవకాశాలు ఉన్నా యన్నారు.శారీరక ఆరోగ్యా న్ని ప్రోత్సహించడం పాఠ శాలల మధ్య స్నేహ సం బంధాలను మెరుగు పరచ డం,స్థానిక ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కోనసీమ ప్రాంతంలోని ప్రభుత్వ, ఉన్నత పాఠ శాలలు6,7,8 తరగతులు జూనియర్ బ్యాచ్ గాను 10 ఇంటర్ తరగతులు సీనియ ర్ బ్యాచ్ గాను విభజించ డం జరుగుతుందన్నారు వివిధ రకాల కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు అన్ని రకాల పోటీలు నిష్పక్షపాతంగా నిర్వహిం చాలన్నారు.ప్రాంతీయ స్థాయి ఈవెంట్ కావడంతో, విద్యార్థుల అభిరుచి, కలిసి కట్టుగా పని చేయగల సామ ర్థ్యం, వారి ప్రతిభ వెలు గులోకి వస్తుందన్నారు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఈ క్రీడోత్సవాలలో కలిపి నిర్వహించాలన్నారు మార్గదర్శకాల ప్రకారం, కేవలం ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యార్థులుగా ఉన్నవారికే అర్హత ఉంటుం దన్నారు. మండల స్థాయి పోటీలు విద్యార్థులను ఎంపిక చేయడానికి మొదట మండల స్థాయిలో క్రీడలు పోటీలు నిర్వహించి బహు మతులు ప్రధానం చేయా లన్నారు. అండర్ 14 మరియు అండర్ 17 కేట గిరీల్లో అథ్లెటిక్స్, బ్యాడ్మిం టన్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ పవర్ లిఫ్టింగ్ వంటి పోటీలు నిర్వహిస్తారన్నారు ఈ క్రీడా పోటీలకు భోజనం వసతులు క్రీడా పరికరాలు కొరకు నిధులు కలెక్టరేట్ నుండి సమకూర్చడం జరు గుతుందన్నారు. క్రీడా పోటీలు అత్యంత పారద ర్శకంగా నిర్వహించేందుకు అనుభవజ్ఞులైన హెచ్ఆర్లు నియమించడంతోపాటు లాజిస్టిక్స్ సమకూర్చు కోవాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, సమగ్ర శిక్ష ఏపీసి జి.మమ్మీ, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి జివిస్ సుబ్రహ్మణ్యం, ఉప విద్యాశాఖ అధికారి బీవీ సుబ్రహ్మణ్యం వ్యాయామ ఉపాధ్యాయులు భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

## మెడికల్ కళాశాల ఖర్చు పెట్టుబడిగా భావించకూడదు.. అభివృద్ధిగా భావించాలి : ఎం.వి.రమణయ్య




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ – ప్రభావం అనే అంశం పై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించటం జరిగింది.ఈ సదస్సు మోడల్ కాలేని ఎల్.ఐ.సి యూనియన్ ఆఫీస్ లో 200 మంది విద్యార్థులతో జరిగింది. ఈ సదస్సుల్లో ముఖ్య వక్తగా ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్.వి. రమణయ్య పాల్గొని మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు పి.పి.పి విధానంలో ప్రైవేట్ చేయటం పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య విద్యను, ఉన్నత వైద్యాన్ని దూరం చేయటమని అన్నారు. అలాగే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలి అంటే విద్య, వైద్యం అభివృద్ధి చెందాలని, ఇవి అందించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదే అని అన్నారు. ప్రభుత్వం వైద్య రంగంలో పెట్టె ఖర్చుని పెట్టుబడిగా కాకుండా రాష్ట్ర అభివృద్ధికి చేసే పనిగా భావించాలని అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ఈ కూటమి యోగ డే నిర్వహించి ఒక్క రోజు కోసమే వందల కోట్లు ఖర్చు పెట్టిన ఈ కూటమి ప్రభుత్వం వైద్య విద్య మీద ఎన్ని కోట్లు పెట్టాలి దాన్నీ పెంచాలి గాని ఉన్న మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయటం ఎవరికోసం ఈ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం ఈ కొత్త కాలేజీల్లో 50శాతం సీటులను సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుగా భర్తీ చేయాలని జీవో నెంబర్ 107, 108 ఇచ్చినప్పుడు మేనేజ్మెంట్ కోటా సీటుకు 12 లక్షలు, ఎన్.ఆర్.ఐ కోటా సీటుకు 20 లక్షలు వసూలు చేస్తున్నారని నాటి ప్రతిపక్షంలో తెలుగుదేశం జనసేన పార్టీలో వ్యతిరేకించాయి. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నాయని ఆందోళన చేపట్టారు. అధికారంలోకి వచ్చిన 100 రోజులు లోపల జీవులను రద్దు చేస్తామని ప్రకటించారు కానీ అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్న పట్టించుకోకుండా కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తూ రాష్ట్ర ప్రజలను ఈ కూటం ప్రభుత్వం మోసం చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం సీట్లను అమ్మకానికి పెడితే, ఈ ప్రభుత్వం కాలేజీలను దానికి అనుబంధంగా ఉన్న వైద్యశాలను కూడా అమ్మకానికి పెట్టింది దీనితో వైద్య విద్య చదువుకోవచ్చు అని ఆశపడి కష్టపడి ఇంటర్మీడియట్ చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మధ్యతరగతి పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుంది అన్నారు. ఈ సదస్సులో ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు వై. భాస్కర్, ఎన్. రాజా మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయటం తక్షణమే ఆపాలని లేని పక్షంలో విద్యార్థులందరిని కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలియజేసారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ ఆపాలని అనే డిమాండ్ తో విద్యార్థిలోకం కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ సభ్యులు కె. జ్యోతిర్మయి, డి. సాహితి, టి. సౌమ్య, కార్తిక్, హేమంత్ ఎస్.ఎఫ్.ఐ నాయకులు శ్రీవల్లి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.





# రాజమండ్రిలో బట్ట బయలైన అధికార పార్టీ మద్యం సిండికేట్

- పట్టణ పార్టీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో సిండికేట్ చర్చలు
- ఎక్సైజ్ అధికారులనూ భాగస్వామ్యం చేస్తున్న అధికార పార్టీ నేతలు
- ఆడియో సాక్షిగా అధికార పార్టీ నేతల దందా బట్టబయలు చేసిన మాజీ ఎంపీ మార్గాని భరత్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒకవైపు నకిలీ మద్యం, మరోవైపు లిక్కర్ సిండికేట్ వ్యవహారాలతో అధికార పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తోందని మాజీ ఎంపీ మార్గాని భరత్ మండిపడ్డారు. రాజమండ్రి వైయస్సార్సీపీ కార్యాలయంలో మీడియా తో మాట్లాడుతూ... రాజమండ్రి ఎమ్మెల్యే వాసు ఆధ్వర్యంలో లిక్కర్ సిండికేట్ బరితెగించి అక్రమాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి అర్బన్, రూరల్ పరిధిలో ఉన్న 39 మద్యం షాపుల సిండికేట్ కు సంబంధించిన ఆడియో సాక్షిగా అధికార పార్టీ నేతల అక్రమాలను భరత్ బయటపెట్టారు. రేట్లు పెంపుదల, బెల్టు షాపుల ఏర్పాటుతో పాటు ఎక్సైజ్ అధికారుల మామూళ్లు గురించి నిస్సిగ్గుగా చర్చిస్తున్న టీడీపీ రాజమండ్రి పట్టణ అధ్యక్షుడితో పాటు అతని వెనుకున్న ఎమ్మెల్యేను కూడా పార్టీ నుంచి బహిష్కరించాలని భరత్ డిమాండ్ చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

**అధికార పార్టీ అక్రమాలకు వేదికగా రాజమండ్రి**

తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజమండ్రి అక్రమాలకు వేదికగా మారుతుంది. లేని మద్యం స్కామ్‌ని తీసుకొచ్చిన చంద్రబాబు ప్రభుత్వం... వైయస్సార్సీపీ ఎంపీ మిధున్ రెడ్డిని అరెస్టు చేసి 71 రోజులు జైల్లో పెట్టింది. రాజమండ్రి ఈవీఎం ఎమ్మెల్యే కనుసన్నల్లో రాజమండ్రి లోనూ, మరో ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి నియోజకవర్గం రాజమండ్రి రూరల్‌లో 39 మద్యం షాపులకు సంబంధించి సిండికేట్ మీటింగ్ కు సిద్దం అయ్యారు. దీనికి సంబంధించి రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రధాన అనుచరుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు ఫోన్ సంభాషణ ద్వారా.. అధికార పార్టీ నేతలు సిగ్గులేని తనం బయటపడింది.

**అక్రమాలకు బాండు పేపర్లు...**

మద్యం రేట్లు పెంచుకోవడం, బెల్టు షాపులు ఏర్పాటు, సిండికేట్ వ్యాపారం ఎలా చేయాలన్న విషయాలతో పాటు ఈ దందాలో ఎక్సైజ్ అధికారులను కూడా ఎలా భాగస్వామ్యం చేయాలని చర్చించుకున్న ఆడియో బయటపడింది. దీనికి సంబంధించి రూ.100 బాండ్ పేపరు మీద సంతకాలు చేద్దామంటూ నిస్సిగ్గుగా ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసుకుంటున్నారు. ఏపీ ఎక్సైజ్ యాక్ట్ 37 ఏ, 39 బై 1, 2 సెక్షన్లు ప్రకారం వీరిని నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలి. మజ్జి రాంబాబుతో పాటు అతని వెనుక కచ్చితంగా రాజమండ్రి ఎమ్మెల్యే ఉన్నాడు. ఆతనిని కూడా అరెస్టు చేయాలి. దీంతో పాటు ప్రభుత్వ అధికారులకు లంచాలిద్దామంటూ నేరుగా చెబుతున్నాడు. దీనికి బీ ఎన్ ఎస్ 274, 276 సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ఎమ్మెల్యే అండతోనే సిండికేట్ మంతనాలు...**

కూటమి పెద్దలు చెప్పేవి శ్రీరంగ నీతులు, చేసేవన్నీ నీచమైన పనులు. సిండికేట్ నిర్వహణకు ఎంత పక్కాగా ప్రణాళిక సిద్ధం చేశారంటే... ఎక్సైజ్ అధికారులు ఎవరిమీద కేసు పెట్టాలో కూడా డ్రా తీసి వీళ్లే నిర్ణయిస్తామని చెబుతున్నారు. డ్రా లో కేసు వచ్చిన షాపు కేసుకి సంబంధించి కట్టాల్సిన ఫైన్ మాత్రం సిండికేట్ అందరూ భరించేలా ఒప్పందం చేసుకుంటున్నారు. రెండు సార్లు ఒకే షాపు మీద కేసులు వస్తే... ఆ షాపు క్లోజ్ అవుతుంది కాబట్టి వంతుల వారీగా ఏ మద్యం షాపు మీద కేసు నమోదు చేయాలన్నది కూడా సిండికేటే నిర్ణయిస్తుంది. అంటే ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి అండ లేకుండా అధికారులను సైతం ప్రభావితం చేయడం వీరికి సాధ్యమా? జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను సూటిగా ప్రశ్నిస్తున్నాను. మీకు చిత్తశుద్ధి ఉంటే మీ పార్టీ రాజమండ్రి సిటీ అధ్యక్షుడు తప్పు చేశాడని ఏ విధంగా అయితే పార్టీ నుంచి బహిష్కరించారో.. అదే విధంగా మీ భాగస్వామి చంద్రబాబు పార్టీకి చెందిన రాజమండ్రి సిటీ అధ్యక్షుడిని కూడా బహిష్కరించాలి. లేని లిక్కర్ కేసులో మా పార్టీ ఎంపీ మిధున్ రెడ్డిని అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఇవాళ మీ పార్టీ నేతలు బహిరంగంగా దొరికిపోయారు దీనికేం సమాధానం చెప్తారు ? అధికార పార్టీ లిక్కర్ సిండికేట్ కోసం అన్ని అక్రమాలకు గేట్లు బార్లా తెరిచారు. ఇదంతా రాజమండ్రి ఎమ్మెల్యే కనుసన్నల్లోనే జరుగుతుంది. చంద్రబాబు రాజమండ్రి ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలి.

**మద్యం అసలా, నకిలీయా తేల్చాల్సింది ప్రభుత్వమే..**

రాష్ట్రంలో నకిలీ మద్యం ప్రజల ప్రాణాలను హరిస్తుంది. నకిలీ మద్యం తయారీలో చంద్రబాబుకి సైతం భాగస్వామ్యం ఉంది. లేకపోతే ఇంత విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నా కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదు. ఇంత పెద్ద ఎత్తున స్కామ్ కు పాల్పడుతున్న వీళ్లందరినీ అండమాన్ లోనై, తీహార్ జైలుకో పంపించాలి. కూటమి నేతలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తూ... మరలా ప్రతిపక్ష పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. ఒకవైపు నకిలీ మద్యాన్ని ఏరులై పారిస్తూ... మద్యం కొనుగోలు చేసే ముందు ఫోన్ లో స్కాన్ చేసి అది అసలా ? నకిలీయా ? అని టెస్ట్ చేయమంటున్నారు. రూ.100 చీప్ లిక్కర్ కొనే వారి దగ్గర స్మార్ట్ ఫోన్ ఉంటుందా ? మద్యం షాపుల్లో అమ్మే మందు అసలా, నకిలీయా అని తేల్చాల్సింది ప్రభుత్వం. ప్రభుత్వం ఆ పని చేయకుండా గాడిదలు కాస్తుందా ? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఒక్క బెల్టుషాపు లేదు, 8 గంటల దాటిన తర్వాత షాపులు కచ్చితంగా మూసివేసేలా చర్యలు తీసుకుంటే... టీడీపీ హయాంలోని రాష్ట్రంలో బెల్టు షాపులు ద్వారా మద్యం ఏరులై పారుతుంది.

**పీ-4 అటకెక్కి, పీ-3(పీపీపీ) పేరుతో మెడికల్ కాలేజీల అమ్మకం..**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజల పక్షాన మా పోరాటం కొనసాగుతుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, నకిలీ మద్యం తయారీ తో పాటు సూపర్ సిక్స్ హామీల వైఫల్యంపైనా మా పోరాటం కొనసాగుతుంది. చివరకు ఈ ప్రభుత్వం పథకాలు కూడా చోరీ చేస్తూ... వైయస్.జగన్ హయాంలో ఇచ్చిన పథకాలకు పేరు మార్చి.. అది తమ మనసులో పుట్టిన పథకం అని ప్రచారం చేసుకుంటున్నారు. అయినా ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయడం లేదు. నిన్నటి వరకు సంపద సృష్టిస్తాను, పేదరికాన్ని నిర్మూలిస్తానని పీ -4 పేరుతో ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు పీ పీ పీ పేరుతో పీ-3 చేస్తూ ప్రభుత్వ మెడికల్ కాలేజీల అమ్మకానికి పెట్టాడు. తన పరిపాలన కాలంలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మించని చంద్రబాబు... ఒకే దఫా ఏకంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి వైయస్.జగన్ శ్రీకారం చుడితే వాటిని ఎలా అమ్మకానికి పెడతారు.

**వైయస్.జగన్ హాయంలోనే డేటా సెంటర్...**

విశాఖలో ఏర్పాటు చేస్తున్నది గూగుల్ ఆదానీ ఎయిర్ టెల్ డేటాసెంటర్. దీనితో పాటు ఐటీ పార్కు తీసుకురావాలి, స్కిల్ యూనివర్సిటీ తీసుకురావాలని వైయస్.జగన్ విశాఖలో 130 ఎకరాల స్థలం ఇచ్చి ఏంఓయూ చేసుకున్నారు. గతంలో రూ.23 వేల కోట్ల పెట్టుబడులతో 25 వేల ఉద్యోగాలతో 2021లో విశాఖపట్నంలో జరిగిన ఇంటర్నేషనల్ ఎక్స్ పోలో ఆదానీ డేటా సెంటర్ తో ఎంఓయూ చేసుకుని, 2023 మే నెలలో శంకుస్థాపన కూడా చేశారు. వైయస్.జగన్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను మేం ప్రజలకు పూర్తిగా చెప్పలేకపోయాం. కానీ చంద్రబాబు మాత్రం ప్రజలను బురిడీ కొట్టించడంలో ముందుంటారు. ఒక బిల్డింగ్ కట్టి హైటెక్ సిటీ నేనే కట్టానని చెప్పుకోవడం వారికి అలవాటు. వైయస్.జగన్ హయాంలో రాష్ట్రంలో అత్యంత విప్లవాత్మమైన అభివృద్ధి పనులు చేపట్టారు. రాజమండ్రి వేదికగా టీడీపీ నేతల లిక్కర్ సిండికేట్ పై కచ్చితంగా న్యాయ పోరాటం చేస్తాం. పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. ఆడియో ఆధారంగా నిందితులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్న భరత్.. సిండికేట్ నిర్వహిస్తున్న అధికార పార్టీ నేతల వ్యవహారంపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయడంతో పాటు వారి వెనుక ఉన్న స్థానిక ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## గ్రావెల్ అక్రమ తవ్వకాలపై

# గనుల శాఖ అధికారులు ఆకస్మిక దాడులు

జెసిపిని స్వాధీనం చేసుకున్న ఫణిభూషణ్ రెడ్డి





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని రాఘవాపురం పరిధిలో గ్రావెల్ అక్రమ త్రవ్వకాలపై జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించి జెసిపిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా మైన్స్ అధికారి ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని రాఘవపురం గ్రామంలో గనులుశాఖ అధికారులు అకస్మిక తనిఖీ నిర్వహించగా గ్రావెల్ అక్రమ త్రవ్వకాలు ప్రాంతంలో గుంతలు, త్రవ్వకాలకు ఉపయోగించిన టాటా హిటాచి జెసిపి యంత్రాన్ని స్వాధీనం చేసుకొని, ఆపరేటర్ ప్రసాద్ పై కేసు నమోదు చేశారు. ఎటువంటి శాఖాపరమైన అనుమతులు లేకపోవడంతో గ్రావెల్ అక్రమ త్రవ్వకంగా గుర్తించి,సర్వే నంబర్లు 44/2, 44/3 లోని ప్రాంతంలో త్రవ్వకాలు జరిపిన ప్రాంతంలో సుమారు 19,300 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా త్రవ్వబడినట్లు నిర్ధారించారు. అనుమతి లేని ప్రాంతాలలో త్రవ్వకాలు నిర్వహించినట్లయితే సంబంధితులపై గనులు, భూగర్భశాఖచే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి ఫణిభూషణ్ రెడ్డి హెచ్చరించారు. కేవలం అనుమతి పొందిన గనులలోనే త్రవ్వకాలు, రవాణా చేయాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి ఫణి భూషణ్ రెడ్డి, సర్వేయర్ పి.శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది శ్రీనివాస్, వీఆర్‌ఏ మురళీ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ సోము వీర్రాజును కలిసిన

# ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు

### ఉపాధ్యాయ సమస్యలపై వినతిపత్రం అందజేత



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బుధవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ మండలి సభ్యులు సోము వీర్రాజు పుట్టినరోజు శుభసందర్భంగా క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఎండిఎస్ రెడ్డి, ఉపాధ్యక్షులు పల్లాల దివ్యపు రెడ్డి శుభాకాంక్షలు తెలిపి అభినందనలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలు తెలియజేసి వినతి పత్రాన్ని అందజేయడం సమర్పించారు. సోము వీర్రాజు సానుకూలంగా స్పందిస్తూ శాసన మండలి టీచర్స్ సమస్యలు ఉన్నాయి. వీటిపై మండలిలో నేను ప్రస్తావిస్తాను, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని తెలియజేసారు.

# జీఎస్టీ సంబరాలు చేసుకోవడానికి ఏమి చేశారని..?

### మోదీ దృష్టిలో ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు లేరు పాలెగాళ్ళు..

### రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధినేత మేడా శ్రీనివాస్ విమర్శ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్రం లో మోదీ సర్కార్‌కు ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు కూటమి సర్కార్ కు ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా !అనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించి నట్టు "జి. ఎస్.టి. " సంబరాలు ఏమిటి..! మోదీ రాజకీయ ప్రచారం కోసం చేసిన వందల కోట్ల ఖర్చు ఆంధ్ర రాష్ట్రంలో అనేక అవసరాలు తీరతాయని గ్రహించలేరా! మతి చెలించిన చంద్రబాబు కూటమి సర్కార్ ఆంధ్ర రాష్ట్ర వెన్నుముక ను విరిచేస్తుంది. మోదీ దృష్టిలో ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు లేరు పాలెగాళ్ళు మాత్రమే వున్నారు అనే అహంతో ఆంధ్రప్రదేశ్‌లో మోదీ ఉపన్యాసాలు చెల్లుతున్నాయి. ఆంధ్ర పౌరుషం లేని పాలకులు ఆంధ్రప్రదేశ్‌కు అవసరమా ! అవినీతి కుంబకోణాలకు వ్యసన పరులు ఢిల్లీ పాలకులకు బానిసలు నేడు ఆంధ్రప్రదేశ్ ప్రధాన పాలకులుగా చెల్లుబాటు అవుతున్నారు. ఎన్నాళ్ళు సాగునో ఈ వైభోగం వేచి చూడాలి అని మేడా ఓ ప్రకటనలో విమర్శించారు.

## ఆదిత్య విద్యార్థిని బి.జ్ఞానరమషర్మిలకు

# కథారచనలో ప్రథమ స్థానం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువ జన సంక్షేమ శాఖ సెట్రాజ్, కాకినాడ, జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు-2025లో భాగంగా కథారచనల విభాగంలో ప్రథమ బీ.ఎస్సీ డేటా సైన్స్ కు చదువు తున్న బి.జ్ఞానరమషర్మిల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందింది. తూర్పుగోదావరి జిల్లా సెట్రాజు యువజన ఉత్సవాల్లో అక్టోబర్ 14వ తేదీన ఆమెకు ఈ పురస్కారం లభించింది. జిల్లా స్థాయిలో బహుమతి పొందినందుకు ప్రిన్సిపాల్ ఎస్ కె.ఎన్.రెహమాన్,వైస్ ప్రిన్సిపాల్ కె.ఆనందరావు, కంప్యూటర్ సైన్స్ ఫ్యాకల్టీ డి.ధరణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జి.వి.ఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బిహెచ్‌వి.రమాదేవి, పోలు కొండ సాయి, ఆకుల శిరీష తదితరులు అభినందించారు. విషయం తెలిసి, డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ సిహెచ్ ఫణి కుమార్ షర్మిలకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

## మండలంలో పలువురికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను

# అందజేసిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో పలువురికి వైద్యం అనంతరం రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సిఫారసుతో మంజూరైన చెక్కులను పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన బాదంపూడి వీర వెంకటరావుకు రూ.25,000/లు, ఎ.కాశియ్యకు రూ.32,100/-లు, బొబ్బిలంక గ్రామానికి చెందిన అత్తిలి వీరబాబుకు రూ.46,084/లు, ఉండేస్వరపురం గ్రామానికి చెందిన వనమా వెంకన్న బాబుకు రూ.26,629/ల చెక్కులను వారి ఇంటికి వెళ్లి జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 19న ఘంటశాల, బాలు పాటల కలయికతో "ఆపాత మధురాలు"

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సొగ్గాడు శోభన్ బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శోభన్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు దొండపాటి సుబ్రహ్మణ్యం నిర్వాహణలో ఈనెల 19వ తేదీన పద్మశ్రీ ఘంటశాల, పద్మభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటల కలయికతో "ఆపాత మధురాలు" సినీ సంగీత విభావరి జరుగుతుంది. ఆరోజు సాయంత్రం 4.30 గంటల నుంచి విక్రమహల్ లో ప్రఖ్యాత ఘంటశాల గాయకులు పి.వి.రమణ, కాకినాడ సింగర్ చే సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు దొండపాటి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సంగీత విభావరిలో పలువురు గాయనీ గాయకులు పాల్గొని పాటలు పాడతారు. ఆత్మీయ అతిధులుగా శోభన్ బాబు ఫ్యాన్స్ సేవా సమితి గౌరవాధ్యక్షులు అల్లు బాబి,కళారత్న పి.వి.ఎస్. కృష్ణారావు, రాయుడు చంద్రకుమార్, బర్రే సుబ్రహ్మణ్యం, మైలవరపు నాగేంద్రప్రసాద్, డి.ఎస్.ప్రభాకరరావు,పాటల అభిమాని కేశవ్ సత్యనారాయణ,టి.వెంకట రవి,కళాభిమాని కసిరెడ్డి రాంబాబు,ఆకుల రామచంద్ర రావు, యేరుకొండ వెంకటేష్ హాజరవుతారు. అందరూ ఆహ్వానీతులేనని దొండపాటి సుబ్రహ్మణ్యం తెలిపారు.

### ప్రతిష్టాత్మకంగా సిఆర్పిఎఫ్

# ఆరవ వార్షికోత్సవ వేడుక



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్ర అధ్యక్షుడు పీఎం రాజు ఆధ్వర్యంలో క్రైస్తవ హక్కులు పరిరక్షణ ధళం 6వ వార్షికోత్సవ వేడుక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి పట్టణం, కొంత మూరు క్రీస్తు సంఘం ప్రార్థన మందిరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాజమండ్రి సిటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సిఆర్పిఎఫ్ అనేది ఎవరి కోసమో పోటీగా వచ్చిన ఆర్గనైజేషన్ కాదని, తమ హక్కుల కోసం పోరాడుతున్న ఆర్గనైజేషన్ అని, తమకు చెందవలసిన హక్కుల కోసం పోరాడటం అనేది శుభపరిణామం అని తెలియ చేసి, క్రైస్తవ సమస్యల పరిష్కారం చేయడానికి తమ వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ అండ్ చైర్మన్ బ్రదర్ జి.పాల్ ప్రసాద్, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శైలస్ కె.శ్రీనివాస్, నేషనల్ జనరల్ సెక్రటరి ఎమ్.లాజరస్, నేషనల్ ట్రెజరర్ విజయకుమార్, నేషనల్ లీడర్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పి.ఎర్నెస్ట్ మోజెస్, స్టేట్ అడ్వైసర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.స్వరూప్, రాష్ట్ర జనరల్ సెక్రటరి విజయకాంత్, తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టరేట్లో ఎంఎస్ఎంఈ డిప్యూటీ డైరెక్టర్ వెంకట కృష్ణ ఆధ్వర్యంలో

# వెండర్ డెవలప్మెంట్ కార్యక్రమం విజయవంతం

### ముగింపు కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు




అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లో రెండు రోజుల పాటు జరిగిన విక్రేత అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని ఎంఎస్ఎంఇ డిప్యూటీ డైరెక్టర్ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కోనసీమ జిల్లాలో ఉపాధి అవకాశాలు, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల ప్రాధాన్యం, సాంకేతిక అవగాహన వంటి అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ అమలాపురం అభివృద్ధికి పరిశ్రమలు, పర్యాటక రంగం (టూరిజం) కీలక పాత్ర పోషిస్తాయని, వీటి ద్వారా ప్రాంతీయ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మరింత బలపడతాయని తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఇ సంస్థలు పరిశ్రమకవేత్తలను ప్రోత్సహించి, ఆర్థికాభివృద్ధితో పాటు ఉద్యోగ కల్పనకు దోహదపడతాయని ఆయన అన్నారు. రెండు రోజుల సాంకేతిక శిక్షణ, అవగాహన సదస్సుల ద్వారా నూతన పరిశ్రమకవేత్తలు, ఆవిష్కరణాత్మక ఆలోచనలతో ముందుకు రావాలని సంస్థ డీడీ వెంకటకృష్ణ పిలుపునిచ్చారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రిఫరెండం..

### అసలు ఈ మాటే వినపడదేం..?




తెలంగాణలో ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాక మొదలైంది. ఇది బీఆర్ఎస్ సిటింగ్ స్థానం ఎన్నికలు.. ప్రభుత్వాల పాలనకు పరీక్షలు..! ప్రతిపక్షాల పోరాటానికి పరీక్షలు..! తమ విధానాలతో, పాలనా తీరుతో ప్రభుత్వాలు ఈ పరీక్షకు వెళ్తుంటాయి. విపక్షాలేమో ప్రభుత్వాల తీరును ఎండగడుతూ ఎన్నికలను ఎదుర్కొంటాయి. ఎవరికైనా అధికారమే ఆఖరి గోల్. ఇలాంటి సమయంలో అనూహ్యంగా మధ్యలో వచ్చి పడే (ఉప) ఎన్నికలను రిఫరెండంగా భావిస్తాయి. తమ పనితీరుపై నమ్మకం ఉంటే ముందుగానే ప్రభుత్వంలోనివారు ఈ ఎన్నికలు మా పాలనకు రిఫరెండం అని ప్రకటిస్తుంటారు. సర్కారు వైఫల్యం తీవ్రంగా ఉందనకుంటే ప్రతిపక్షాలే మధ్యలో జరిగే ఎన్నికలను రిఫరెండంగా తీసుకోవాలని సవాల్ చేస్తుంటాయి. బీఆర్ఎస్ కంచుకోట లాంటి చోట తెలంగాణలో ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాక మొదలైంది. ఇది బీఆర్ఎస్ సిటింగ్ స్థానం. దాదాపు 2014 నుంచి జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే ఉన్నట్లు లెక్క. ఒకసారి టీడీపీ తరఫున, రెండుసార్లు బీఆర్ఎస్ నుంచి గెలిచి హ్యాట్రిక్ కొట్టారు దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్. ఈ లెక్కన చూసుకుంటే జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ కంచుకోట. ఇప్పుడు గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతను అభ్యర్థిగా నిలబెట్టి అటు మహిళా, ఇటు ఎమ్మెల్యే అకాల మరణం తాలూకు సెంటిమెంట్ రెండు అంశాలతోనూ బీఆర్ఎస్ ఉప ఎన్నికను ఎదుర్కొంటోంది. ఈసారైనా గెలవాలని... ఇక తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ విషయానికి వస్తే ఆ పార్టీ 2009 తర్వాత జూబ్లీహిల్స్ లో ఆ పార్టీకి గెలుపు దక్కలేదు. దివంగత పీజేఆర్ హయాంలో ఉమ్మడి ఖైరతాబాద్ లో భాగమైన జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ 2014 నుంచి వరుసగా మూడుసార్లు పరాజయం పాలైంది. 2014లో అధికారంలో ఉండి కూడా (ఉమ్మడి ఏపీ విభజన సమయం) మూడో స్థానంలో నిలిచింది. ఇప్పుడు మాత్రం నేరుగా అధికారంలో ఉండి ఉప ఎన్నికలో తమ ప్రభుత్వ పాలనకు పరీక్ష వంటి సందర్భంలో ఉంది. అటు నుంచి ఇటు నుంచి సవాల్ లేదే? సాధారణంగా ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు ఉప ఎన్నికలను ప్రభుత్వాల పాలనకు రిఫరెండంగా భావించాలని సవాల్ చేస్తుంటాయి. దీనిని కొన్నిసార్లు (తమ సిటింగ్ స్థానం అయితే) ప్రభుత్వాలు సైతం స్వీకరిస్తుంటాయి. కానీ, సిటింగ్ సీటును నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో ఉన్న బీఆర్ఎస్ మాత్రం ప్రభుత్వానికి రిఫరెండం సవాల్ విసరలేదు. ఇటు తెలంగాణ అధికార పక్షం కాంగ్రెస్ కూడా ఈ ఉప ఎన్నిక తమ ప్రభుత్వ పాలనకు రిఫరెండం అని ముందుకురావడం లేదు. ముందు ముందు ఉంటుందేమో? సహజంగా ఉప ఎన్నికల్లో అధికార పక్షానికి కాస్త మొగ్గు ఉంటుంది. ఎమ్మెల్యే అకాల మరణంతో కాబట్టి ఈవిధంగా బీఆర్ఎస్ పట్ల సానుభూతి కనిపిస్తుంది. అయినప్పటికీ ఇప్పటివరకు అధికార, విపక్షం ఏదీ రిఫరెండం సవాల్ విసరలేదు. పోలింగ్ కు ఇంకా 25 రోజుల సమయం ఉంది కాబట్టి ప్రచారం వేడెక్కే కొద్దీ ఏదో ఒకవైపు నుంచి సవాల్ బయటకు వస్తుందేమో చూడాలి.

# మోడీ టూర్‌లోనూ వైసీపీ ఫేక్ పైత్యం..

**రంగంలోకి ఇంటెలిజెన్స్...**



ఒక దేశ ప్రధాని విషయంలో కూడా ఫేక్ ప్రచారం చేస్తారా అన్నదే కూటమి ప్రభుత్వం పెద్దలు అంటున్న మాటగా ఉంది. ప్రధాని నరేంద్ర మోడీ కర్నూల్ జిల్లా పర్యటనకు గురువారం వచ్చారు. అయితే మోడీ పర్యటనను కూడా తనదైన ఫేక్ ప్రచారానికి వైసీపీ వాడుకుందని టీడీపీ మండిపడుతోంది. వైసీపీ తీరు మీద పసుపు శ్రేణులు ఫైర్ అవుతున్నాయి. ఇక ప్రధాని పర్యటన మీద వైసీపీ చేసిన ఫేక్ ప్రచారం విషయంలో ఇప్పటికే కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీసే పనిలో పడ్డాయని అంటున్నారు. ఇది సీరియస్ విషయమని ఏపీలో కూటమి ప్రభుత్వం భావిస్తోంది. దీని వెనక ఎవరేమిటి అన్నది వెలికి తీయాలని పట్టుదలగా ఉందని అంటున్నారు.

**ఇంతకీ జరిగిందేంటి :** ప్రధాని మోడీ గురువారం అంతా ఏపీలోనే గడిపారు. ఆయన ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీశైలంలో పూజలు నిర్వహించారు. అంతే కాదు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. అయితే ప్రధాని పర్యటన సందర్భంగా టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రోటోకాల్ ని పాటించింది అని గుర్తు చేస్తున్నారు విపక్షాలను కూడా ఆహ్వానించింది. దాంతో వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు ప్రధాని మోడీకి స్వాగతం పలికే అవకాశం కలిగింది. వినతి పత్రం ఇవ్వకుండానే : ఇక ప్రధాని మోడీకి వినతిపత్రం ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా వైసీపీ నేతలు ఫేక్ ప్రచారానికి తెర తీయడం పట్ల కూటమి పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీలో మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తున్నారని చెబుతూ ప్రధానికి ఈ విషయంలో వినతిపత్రం ఇచ్చినట్లుగా వైసీపీ ప్రచారం చేసుకుంటోందని ఆరోపిస్తున్నారు. అంతే కాదు వాల్మీకీలను ఎస్టీలలో చేర్చాలని వినతిపత్రం ఇచ్చినట్లుగా ఆ విషయంలో నిర్ణయం తీసుకోవాలని ప్రధానిని కోరినట్లుగా అసత్య ప్రచారానికి పాల్పడుతోందని కూడా కూటమి నేతలు ఆరోపిస్తునారు. ఇచ్చిన గౌరవం ఇలాగనా : వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్ళలో ఎక్కడా ప్రోటోకాల్ కనీస మాత్రంగా పాటించలేదని టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నారు. ఆనాడు ప్రధాని వచ్చినా ప్రతిపక్షాలను ఆహ్వానించలేదని కూడా చెబుతున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాత్రం తాము విపక్షాలను ఆహ్వానించడమే కాకుండా అన్ని అభివృద్ధి కార్యక్రమాలలో పార్టీలకు అతీతంగా గౌరవిస్తున్నామని భాగస్వామ్యం చేస్తున్నామని చెబుతున్నారు. అయితే తాము ఇచ్చిన ఈ గౌరవాన్ని వైసీపీ నేతలు అయితే ఏ మాత్రం నిలబెట్టుకోలేక పోతున్నారు అని వారు ఫైర్ అవుతున్నారు. సాక్ష్యాత్తూ ప్రధానితో : ఒక దేశ ప్రధాని విషయంలో కూడా ఫేక్ ప్రచారం చేస్తారా అన్నదే కూటమి ప్రభుత్వం పెద్దలు అంటున్న మాటగా ఉంది. ఇవ్వని వినతి పత్రాన్ని చెప్పని మాటలను కూడా చేర్చి జనాలలో తప్పుడు ప్రచారం చేసుకోవడమేంటని వారు మండిపోతున్నారు. ఇదే తీరును వైసీపీ ఎపుడూ చేస్తూ వస్తోందని ఆ పార్టీ తీరుతెన్నులు ఏ విధంగానూ మారేది లేదని పదే పదే నాయకులు రుజువు చేస్తున్నారు అని అంటున్నాఉర్. కేంద్ర ఇంటెలిజెన్స్ ఆరా : ఇదిలా ఉంటే ప్రధానికి ఆహ్వానం పలికే కార్యక్రమంలో కూటమి నుంచి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారని అయితే వారు వినతిపత్రాలు ఏవీ ఇవ్వలేదని అంటున్నారు. దాంతో కేంద్ర ఇంటలిజెన్స్ వర్గాలు ఆరా తీసే పనిలో పడ్డాయి. ఈ రకమైన ప్రచారం ఏ విధంగా చేస్తున్నారు అన్నది కూడా వారు ఇపుడు పరిశీలిస్తున్నారు. ఒక దేశ ప్రధాని విషయంలో ఏమి జరిగినా పక్కాగా ఉంటుంది. ఎవరు కలిశారు, ఏ రకమైన వినతి చేశారు అన్నీ రికార్డు అవుతాయి. ఇది సీరియస్ మ్యాటర్ : అలాంటివి తెలిసి కూడా వైసీపీ ఈ తీరున ఫేక్ ప్రచారానికి తెర తీయడం పైగా మెడికల్ వార్ ని కూడా ఇందులో చేర్చి రాజకీయ పబ్బాన్ని గడుపుకోవాలని చూడడం అంటే ఇది సీరియస్ మ్యాటర్ అని కూటమి పెద్దలు భావిస్తున్నారు. దాంతో ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేసిన వారి మీద కూడా ఏమి చేయాలన్న దాని మీద ఆలోచిస్తున్నారు అంటున్నారు. మొత్తానికి ప్రధాని మోడీ టూర్ సూపర్ డూపర్ సక్సెస్ అయిన వేళ వైసీపీ పనిగట్టుకుని సాగిస్తున్న ఈ ఫేక్ ప్రచారం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ కావడంతో కూటమి నేతలు కౌంటర్ యాక్షన్ కి సిద్ధపడుతున్నారని అంటున్నారు.

### వెంకటేశ్, రానా, సురేష్ బాబులకు

# నాంపల్లి కోర్టు బిగ్ షాక్



హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో ఉన్న దక్కన్ కిచెన్ హోటల్ కూల్చివేత కేసు మరోసారి సంచలనం సృష్టిస్తోంది. ఈ కీలకమైన కేసులో దగ్గుబాటి కుటుంబానికి చెందిన ప్రముఖులు సీనియర్ నటుడు వెంకటేష్, హీరో రానా దగ్గుబాటి, నిర్మాత సురేష్ బాబు, అభిరామ్ దగ్గుబాటికు నాంపల్లి కోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. కోర్టు ఆదేశాల ప్రకారం.. వీరు నవంబర్ 14న తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరై పర్సనల్ బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. ఇంతకు ముందు విచారణకు హాజరు కాకపోవడంపై కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. భూమి వివాదం నేపథ్యం : కోర్టు ఆదేశాలను లెక్క చేయకపోవడమే కారణం ఈ కేసు మూలం ఫిల్మ్‌నగర్‌లోని భూమి యాజమాన్యం వివాదం. నందకుమార్ అనే వ్యక్తి, దక్కన్ కిచెన్ స్థలంపై తమకు హక్కు ఉందంటూ 2022లో సిటీ సివిల్ కోర్టులో కేసు వేశారు. అప్పట్లో హైకోర్టు కూడా స్థల విస్తరణ, నిర్మాణాలపై తాత్కాలిక నిషేధం జారీ చేసింది. అయితే ఆ ఆదేశాలను పట్టించుకోకుండా జిహెచ్ఎంసి అధికారులు బౌన్సర్ల సహాయంతో హోటల్‌ను పాక్షికంగా కూల్చివేయడం, అనంతరం 2024 జనవరిలో దగ్గుబాటి కుటుంబం పూర్తిగా కూల్చివేయడం ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. దీంతో నందకుమార్ నాంపల్లి కోర్టును ఆశ్రయించగా, కోర్టు ఫిల్మ్‌నగర్ పోలీసులను ఐపీసీ సెక్షన్లు 448, 452, 458, 120బీ కింద కేసు నమోదు చేయాలని ఆదేశించింది. లి కోర్టు ఆగ్రహం: "తప్పనిసరిగా హాజరు కావాలి" విచారణకు పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికీ, వెంకటేష్-రానా హాజరుకాకపోవడంతో కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈసారి స్పష్టంగా హెచ్చరిస్తూ "పర్సనల్ బాండ్ సమర్పించేందుకు నవంబర్ 14న తప్పనిసరిగా హాజరు కావాలి" అని నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

సినీ వర్గాల్లో చర్చనీయాంశం దగ్గుబాటి ఫ్యామిలీకి తెలుగు చిత్రపరిశ్రమలో ఉన్న ప్రత్యేక స్థానం దృష్ట్యా, ఈ న్యాయపరమైన పరిణామం సినీ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశం అయింది. రామానాయుడు వారసత్వాన్ని కొనసాగిస్తూ వెంకటేష్, సురేష్ బాబు బలమైన స్థానం సంపాదించగా, రానా కూడా తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. టాలీవుడ్ లో దగ్గుబాటి కుటుంబానికి మంచి పేరు ప్రఖ్యాతలున్నాయి. ఈ అగ్ర కుటుంబం చుట్టూ ఇప్పుడీ దక్కన్ కిచెన్ కేసు న్యాయపరమైన చిక్కులను పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'ఇబ్బందులున్నా.. ఏమున్నా'...

# కూటమి విషయంలో పవన్ కోరిక ఇదే!



అవును... 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరుతో కర్నూలులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కర్నూలులో నేడు కీలకమైన కార్యక్రమం జరిగిన సంగతి తెలిసిందే. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరైన ఈ కార్యక్రమం కర్నూలు జిల్లాలోని నన్నూరు వద్ద సుమారు 450 ఎకరాల మైదానంలో జరిగింది. 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరుతో నిర్వహించిన ఈ సభలో మోడీతో పాటు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నిర్మించిన, నిర్మించబోతున్న రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు వర్చువల్ గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అంతకంటే ముందు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా మోడీని కొనియాడుతూ, కూటమి ఐక్యత విషయంలో తన కోరికను మరోసారి వ్యక్తపరిచారు. అవును... 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరుతో కర్నూలులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం 15 ఏళ్లకు తక్కువకాకుండా బలంగా ఉండాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆకాక్షించారు. దీని కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తట్టుకొని నిలబడతామని అన్నారు. ఇబ్బందులు ఉన్నా.. ఏమున్నా తట్టుకుని నిలబడాలని ఈ సందర్భంగా సూచించిన పవన్ కల్యాణ్.. ఒక తరం కోసం ఆలోచించే నాయకులు సీఎం చంద్రబాబు అని.. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయకత్వంలో అందరం సమష్టిగా పనిచేస్తామని.. తద్వారా వచ్చే తరం ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. 'ప్రధాని మోడీ కర్మయోగి'!: ప్రధాని నరేంద్ర మోడీని కర్మయోగిగా చూస్తామని.. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్నారు కాబట్టే మోడీని కర్మయోగి అంటామని చెప్పిన పవన్ కల్యాణ్.. ఆయన ప్రభుత్వాన్ని మాత్రమే కాదు, రెండు తరాలను నడుపుతున్నారని అన్నారు. ఎవరిపైనా ఆధారపడకుండా, దేశం తలెత్తి చూసే విధంగా ఆత్మనిర్భర్ భారత్ తీసుకువచ్చారని ప్రశంసించారు. ఇదే క్రమంలో... దేశ జెండా ఎంత పౌరుషంగా ఉంటుందో అదేవిధంగా భారత దేశాన్ని ప్రపంచపటంలో నిలబెట్టారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొనియాడారు. దేశంలో పన్నులు ఎప్పుడూ పెరగడమే తప్ప తగ్గవని, అలాంటి పన్నుల భారాన్ని తగ్గించారని.. ఫలితంగా ప్రతీ కుటుంబానికి ఏడాదికి రూ.20వేలు ఆదా చేసుకునే అవకాశం కల్పించారని తెలిపారు.

# ఏపీకి గూగుల్ అందుకే వెళ్లింది...

## కర్ణాటక మంత్రి వ్యాఖ్యలు!

టెక్ దిగ్గజం గూగుల్.. విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అక్టోబర్ 14న ఢిల్లీలో అవగాహన (ఎంఓయూ) ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఏపీని టెక్నాలజీ హబ్ గా తీర్చిదిద్దే విషయంలో దీన్ని కీలక ముందడుగుగా భావిస్తున్నారు. అయితే ఈ విషయం కర్ణాటకలో పొలిటికల్ వార్ కి తెరలేపింది. దీంతో అక్కడి ఐటీ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు!



అవును... విశాఖకు గూగుల్ తరలివచ్చే విషయం కర్ణాటక రాజకీ యాల్లో కొత్త రచ్చకు తెరలేపిందనే చెప్పాలి. గూగుల్‌తో ఏపీలోని కూటమి ప్రభుత్వ ఎంఓయూ కుదురుచుకున్న వేళ.. ఇది కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వ ఫెయిల్యూర్‌గా అక్కడి ప్రతిపక్షాలు అభివర్ణిస్తు న్నాయి. ఇందులో భాగంగా... "కర్ణాటకకు నష్టం.. ఆంధ్రకు లాభం!" అని మొదలుపెట్టి కీలక వ్యాఖ్యలు చేశారు చిక్కబళ్లాపుర ఎంపీ కే సుధాకర్. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆయన... ఒకప్పుడు ప్రపంచ టెక్ దిగ్గజాలకు ఇష్టమైన గమ్యస్థానంగా ఉన్న బెంగళూరు, కర్ణాటక.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ఉదాసీనత, అహంకారం, విధాన పక్ష వాతం కారణంగా తమ స్థానాన్ని కోల్పో తున్నాయని అన్నారు. ఆంధ్ర ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షిస్తుండగా.. కర్ణాటక అవకాశాలు, ఉద్యోగాలు వేరే చోటికి తరలిపోవడాన్ని చూస్తోందని అన్నారు. స్పందించిన కర్ణాటక ఐటీ మంత్రి!: ఈ వ్యవహారంపై కర్ణాటక ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పందించారు. ఈ సంద ర్భంగా గూగుల్ కు ఆంధ్రప్రదేశ్ అందించే ప్రోత్సాహకాలను ప్రస్తావించారు. వాటిలో రూ.22,000 కోట్ల సబ్సిడీలు, 25% రాయితీ భూమి, 25% ఫ్రీ వాటర్ సబ్సిడీ, ఉచిత విద్యుత్ వంటివాటితో పాటు పూర్తి స్టేట్ జీఎస్టీ రీయింబర్స్ మెంట్ ఉన్నాయని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రమైనా ఇన్ని ఆఫర్స్ ఇస్తుందా అని ఆయన ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

మరోవైపు... ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు, విమర్శిస్తున్నట్లు.. ఐటీ కంపెనీలు కర్ణాటక నుండి తరలిపోతుంటే, 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్' ఈ సంవత్సరం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి ఉండేది కాదని కర్ణాటక హెూం మంత్రి జి. పరమేశ్వర వ్యాఖ్యానించారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు!: ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ... ఆంధ్ర మంత్రి నారా లోకేష్ లేదా మరెవరి వ్యాఖ్యలకు తాను స్పందించదలచుకోలేదని మొదలుపెట్టి... మౌలిక సదుపాయాలు, మానవ వనరుల నుండి.. ఆవిష్కరణ, స్టార్టప్ ల వరకు.. బెంగళూరులో అన్నీ ఉన్నాయని.. సుమారు 2 లక్షల మంది విదేశీ యులు సహా దాదాపు 25 లక్షల మంది ఇక్కడ పనిచేస్తున్నారని తెలిపారు. ఇదే సమయంలో... కేంద్రానికి బెంగళూరు 39-40% ఆదాయం అందిస్తుందని.. అద్దె కార్యాలయాల నుండి పనిచేస్తున్న అనేక విదేశీ కంపెనీలు ఇప్పుడు తమ సొంత క్యాంపస్ లను ఏర్పాటు చేస్తున్నాయని అన్నారు. అదే బెంగళూరు శక్తి అని.. దేశంలో ఏ రాష్ట్రం దీనికి సాటిరాదని ఆయన నొక్కి చెప్పారు.

టీడీపీలో హాట్ టాపిక్

# బాలయ్యకు మంత్రి పదవి ఇస్తే..!



టిడిపి సీనియర్ నాయకుడు, నటసింహం నందమూరి బాలకృష్ణ హిందూపురం ఎమ్మెల్యేగా మూడుసార్లు విజయం దక్కించుకున్నారు. 2019లో భారీ ఎత్తున వైసిపి ప్రభావం కనిపించినప్పటికీ ఆయన హిందూపురంలో విజయం దక్కించుకుని పార్టీని నిలబెట్టారు. ఇప్పుడు ఆయనకు సంబంధించిన కీలక విషయం ఆసక్తిగా మారింది. తాజాగా బాలయ్య తన సొంత నియోజకవర్గంలో గత నాలుగు రోజుల నుంచి పర్యటిస్తున్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తున్నారు.

ఈ క్రమంలో ఆయన అభిమానులతో పాటు పార్టీ నాయకులు నుంచి కూడా బాలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్ తెరమీదకు వచ్చింది. 40 సంవత్సరాలుగా ఆయన రాజకీయాల్లో ఉన్నారని ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని చాలామంది నాయకులు ఆయన అభిమానులు కార్యకర్తలు కూడా ప్లకార్డులు పట్టుకుని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపద్యంలో బాలయ్యకు మంత్రి పదవి ఇస్తే ఏం జరుగుతుంది? అనే విషయం టిడిపిలో ఆసక్తికర చర్చకు దారి తీసింది. వాస్తవానికి బాలయ్యకు మంత్రి పదవి ఇవ్వడం పెద్ద విషయమేమీ కాదు. చంద్రబాబు తలుచుకుంటే ఇవ్వచ్చు. కానీ ఒకే కుటుంబం నుంచి ఇంతమందికి పదవులు ఇవ్వడం సరికాదన్నది చంద్రబాబు ఆలోచనగా ఉంది. పైగా సినీ రంగంలో ఇప్పుడు బాలయ్య ప్రస్థానం జోరుగా సాగుతోంది. చేతిలో నాలుగైదు సినిమాలు కూడా ఉన్నాయని సమాచారం. మంత్రి పదవి అంటే లేనిపోని విమర్శలు తెచ్చుకోవడం తప్ప మరొకటి కాదన్నది చంద్రబాబు ఆలోచన. పైగా బాలకృష్ణకు కూడా మంత్రి పదవిపై పెద్ద ఇంట్రెస్ట్ అయితే లేదు.

ఎందుకంటే ఆయన అధికార పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్నారు. పైగా సీఎం చంద్రబాబు స్వయంగా వియ్యంకుడు. ఆయన అల్లుడే మంత్రిగా ఉన్నారు. పదవులతో ఆయనకు వచ్చేది కూడా ఏమీ ఉండదు. బాలయ్యకు పెద్దగా ఇంట్రెస్ట్ లేకపోయినా అభిమానులు పార్టీ కార్యకర్తలు మాత్రం బలంగా ఆయనను మంత్రిగా చూడాలని కోరుకుంటున్న మాట వాస్తవం. ఈ విషయంలో టిడిపిలో ఆసక్తికర చర్చ అయితే నడుస్తోంది. ఆయన, ఇప్పటికే దూకుడుగా ఉంటారని మంత్రి పదవి ఇస్తే మరింత దూకుడు పెంచుతారని ఒక నాయకుడు అంతర్గతంగా వ్యాఖ్యానించారు. అయితే బాలయ్య వ్యక్తిగత స్వభావమే అటువంటిది కాబట్టి ఆయనను పెద్దగా తప్పుపట్టాల్సిన అవసరం లేదన్నది మిగిలిన వారి మాట. ఏదేమైనా ఇది కేవలం చర్చకు మాత్రమే పరిమితం. భవిష్యత్తులో అయినా ఇప్పుడైనా బాలయ్యకు మంత్రి పదవి ఇచ్చే ఆలోచన ఉన్నప్పటికీ అది సాకారం కావడం

# లోకేష్.. మీ నాన్నలా తయారవుతున్నావే : ప్రధాని కామెంట్స్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఏపీలోని కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి నారా లోకేష్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నువ్వు కూడా మీ నాన్నలా తయారువుతున్నావే!" అని వ్యాఖ్యానించారు. తొలుత ఢిల్లీ నుంచి కర్నూలు జిల్లాలోని ఓవర్వకల్లు విమానాశ్రయానికి వచ్చిన ప్రధానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ కూడా విమానాశ్రయానికి చేరుకుని ప్రధానికి స్వాగతం పలికారు. అయితే.. సీఎం , డిప్యూటీ సీఎం, బీజేపీ చీఫ్ మాధవ్‌కు వెనుకాల నిలబడ్డ నారా లోకేష్‌ను ప్రధాని స్వయంగా దగ్గరకు తీసుకున్నారు. చేతిలో చేయి వేసి షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన నారా లోకేష్ వెయిట్ బాగా తగ్గుతున్నారని వ్యాఖ్యానించారు. గతంలో చూసినప్పటికీ.. ఇప్పటికీ.. స్మార్ట్‌గా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా పక్కనే ఉన్న సీఎం చంద్రబాబు జోక్యం చేసుకుని.. ప్రతిరోజూ.. వర్కవుట్‌లు చేస్తున్నార ని వివరించారు. మీ నుంచి స్ఫూర్తి పొంది.. యోగా, ప్రాణాయామం వంటివి ప్రాక్టీస్ చేస్తున్నారని తెలిపారు. అంతేకాదు.. నీరు ఎక్కువగా తీసుకుని.. తృణధాన్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. మొత్తంగా నారా లోకేష్



గురించి రెండు నిమిషాల్లో వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మాట్లాడుతూ.. ఇలానే చేస్తే.. త్వరలోనే నువ్వు కూడా మీ నాన్నలాగా తయారవడం ఖాయం.. అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. అనంతరం.. ప్రత్యేక హెలికాప్టర్‌లో శ్రీశైలానికి వెళ్లారు.

# త్రిశంకు స్వర్గంలో త్రిమూర్తులు : ఎవరు వారు ..!




ఈ మాట టిడిపిలో ఇప్పుడు తరచుగా వినిపిస్తోంది. ఆ పార్టీ తరఫున గతంలో మంచి పేరు సంపాదించుకున్న ముగ్గురు కీలక నాయకులు ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో వేలాడుతున్నారనేది నాయకులు చెబుతున్న మాట. గత ఎన్నికల సమయంలో పార్టీ టికెట్టు త్యాగం చేసిన ఈ ముగ్గురు ఉన్నత సామాజిక వర్గానికి చెందిన నాయకులు. పైగా నియోజకవర్గంలో బలమైన కేడర్ కూడా ఉంది. దాదాపు వివాద రహితులు గానే పేరు తెచ్చుకున్నారు. అయితే ఎన్నికలలో టికెట్టు త్యాగం చేసిన తర్వాత పార్టీ నుంచి వారికి సరైన మద్దతు లభించడం లేదనేది వాస్తవం. పదవులు ఇస్తామని అప్పట్లో సీఎం చంద్రబాబు చెప్పినప్పటికీ వారి ఆశలు ఆకాంక్షలు నెరవేరడం లేదు. దీనికి కారణాలు ఏవైనప్పటికీ ప్రస్తుతం మాత్రం వారి పరిస్థితి అగమ్య గోచరంగానే మారింది. వీరిలో పిఠాపురం నుంచి టికెట్ త్యాగం చేసి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ని గెలిపించిన వర్మ పరిస్థితి అందరికి తెలిసిందే. ఆయన టిడిపిలోనే కొనసాగుతున్నప్పటికీ ప్రాధాన్యం లేకుండా పోయిందన్నది వాస్తవం. వచ్చే ఎన్నికల్లో కూడా ఆయనకు టికెట్ దక్కే అవకాశాలు లేవని కూడా ప్రచారం జరుగుతోంది. మరోవైపు చంద్రబాబు కూడా ఆయనను పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో త్రిశంకు స్వర్గంలో వర్మ రాజకీయాలు వేలాడుతున్నాయని అంటున్నారు. ఇక, ఉమ్మడి కృష్ణా జిల్లాలోని మైలవరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఆయన కూడా గత ఎన్నికల్లో టికెట్ త్యాగం చేశారు. వైసీపీ నుంచి వచ్చిన వసంత కృష్ణ ప్రసాద్ కి టికెట్ ఇచ్చి.. ఆయన ను గెలిపించే ప్రయత్నం కూడా చేశారు. అయితే వసంత గెలిచిన తర్వాత పార్టీలో దేవినేని ఉమా మూడో స్థానానికి పడిపోయారు. గత ఎన్నికల సమయంలో పార్టీ అధికారంలోకి రాగానే కీలక పదవి ఇస్తామని హామీ ఇచ్చారని ప్రచారం జరిగింది. కానీ, ఇప్పటివరకు దేవినేని ఉమా గురించి అటు చంద్రబాబు గాని ఇటు ఇతర నాయకులు గాని ఎక్కడ ప్రస్తావించడం లేదు. దీంతో ఈయన రాజకీయాలు కూడా త్రిశంకు స్వర్గంలో వేలాడుతున్నాయనే మాట వినిపిస్తోంది. ఇక గుంటూరు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన కొమ్మలపాటి శ్రీధర్ పరిస్థితి కూడా దాదాపు ఇలానే ఉంది. 2009, 2014 ఎన్నికల్లో పెదకూరపాడు నియోజకవర్గం నుంచి టిడిపి తరఫున వరుస విజయాలు దక్కించుకున్నారు. గత ఎన్నికల్లో భాష్యం ప్రవీణ్ కోసం టికెట్ త్యాగం చేశారు. అయితే పార్టీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీ పదవి ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు అయిపోయిన ఇప్పటివరకు కొమ్మాలపాటి శ్రీధర్ విషయం అలానే పెండింగ్లో ఉంది. దీంతో ఈయన పరిస్థితి కూడా ఇలానే ఉంది అని పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇలాంటి నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది ఉన్నప్పటికీ వివాద రహితులుగా ఉన్న ఇలాంటి వారిని పార్టీ కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నది సీనియర్లు చెబుతున్న మాట. ఎన్ని వత్తిడిలు వచ్చినా ఎన్ని ఇబ్బందులు వచ్చినా తట్టుకొని పార్టీ కోసం పని చేశారని అంటున్నారు. పార్టీ తరఫున గెలిచారని.. ఇలాంటి వారిని వదులుకోకూడదనేది సీనియర్ల హితవు. మరి చంద్రబాబు ఏం చేస్తారనేది చూడాలి.

# మోదీ పాలనలో.. దేశం అస్తవ్యస్తం

హైదరాబాద్

కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానపరమైన వైఫల్యాలు, అలసత్వంతో దేశంలో నిరుద్యోగం తీవ్రమవుతున్నది. ఐటీ ఉద్యోగాల కోత కొనసాగుతున్నది. ఎన్డీయే ప్రభుత్వం పెడుతున్న కొత్త కొర్రీలతో పింఛన్‌దారులు లబోదిబోమంటున్నారు. దౌత్య సంబంధాలు విఫలమవ్వడంతో ఎగుతులు పడిపోయి వాణిజ్యలోటు అంతకంతకూ పెరుగుతున్నది. మొత్తంగా నరేంద్ర మోదీ పాలనలో దేశ ప్రగతి అధోగతిపాలవుతున్నది. ఈ మేరకు తాజాగా విడుదలైన నివేదికలను బట్టి అర్థమవుతున్నది.

**నిరుద్యోగం పైపైకి**

దేశంలో నిరుద్యోగ తీవ్రత మరింత పెరిగింది. ఆగస్టులో 5.1 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు సెప్టెంబర్‌లో 5.2 శాతానికి పెరిగింది. 15–29 ఏండ్ల మధ్య వయసున్న యువతలో నిరుద్యోగిత రేటు 14.6 శాతం నుంచి 15 శాతానికి ఎగబాకింది. పురుషుల్లో నిరుద్యోగిత రేటు 5 శాతం నుంచి 5.1 శాతానికి పెరగ్గా, మహిళల్లో ఇది 5.2 శాతం నుంచి 5.5 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు 4.3 శాతం నుంచి 4.6 శాతానికి పెరగ్గా, పట్టణ ప్రాంతాల్లో ఇది 6.7 శాతం నుంచి 6.8 శాతానికి ఎగబాకింది. ఈ మేరకు పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) తాజా నివేదికలో వెల్లడైంది. ఆర్హతకు తగిన ఉద్యోగం కోసం యువత ఏండ్లుగా ఎదురుచూస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుంచి తగిన సహాయ, సహకారాలు అందట్లేదని విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగం పెచ్చరిల్లిందనడానికి తాజా గణాంకాలే నిదర్శనమని చెప్తున్నారు.

**50 వేల మంది టెకీలపై వేటు**

కృత్రిమ మేధ (ఏఐ) రాకతో టెక్ ఇండస్ట్రీలో ప్రారంభమైన కుదుపులు ఈ ఏడాది కూడా కొనసాగే అవకాశం కనిపిస్తున్నది. 2023, 2024లో దాదాపు 25 వేల మంది టెకీలు భారత్‌లో ఉద్యోగాలు కోల్పోయారు. ఈ ఏడాది ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నది. రానున్న 90 రోజుల్లో 50 వేల టెకీలకు ఉద్వాసన ఉండనున్నట్టు సమాచారం. ఉద్యోగులను వదిలించుకునేందుకు ఐటీ కంపెనీలు రకరకాల కారణాలు వెతుకుతున్నాయి. అందులో 'నాసిరకం పనితీరు' కూడా ఒకటి. ఈ కారణంగా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వకపోవడమో, లేదంటే స్వచ్ఛందంగా రాజీనామా చేయాలనో ఉద్యోగులను కోరుతున్నాయి.

ఈ ఏడాది చాలా కంపెనీలు తమ ఉద్యోగులను రహస్యంగా పెద్ద సంఖ్యలో తొలగించినట్టు హెచ్ఎఫ్ఎస్ రిసెర్చ్ సీఈవో ఫిల్ ఫెర్స్ట్ పేర్కొన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఉద్యోగాలు కోల్పోయే వారి సంఖ్య 55 వేల నుంచి 60 వేల వరకు ఉంటుందని టీమ్‌లీజ్ డిజిటల్ సీఈవో నీతిశర్మ అంచనా వేశారు. అతిపెద్ద కంపెనీలైన టీసీఎస్, యాక్సెంచర్ ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉద్యోగులకు లేఆఫ్ ప్రకటించాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి మరో 12 వేల మంది ఉద్యోగులను వదిలించుకోవాలని టీసీఎస్ ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. అంటే కంపెనీ మొత్తం వర్క్‌ఫోర్స్‌లో ఇది దాదాపు 2శాతం. యాక్సెంచర్ ఈ ఏడాది జూన్–ఆగస్టు మధ్య ప్రపంచవ్యాప్తంగా దాదాపు 11 వేల మందిని ఇంటికి పంపింది.

**పింఛన్ దారులు లబోదిబో**

పింఛన్‌దారులు, ఉద్యోగులకు సంబంధించి ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) తాజాగా ప్రకటించిన సవరణలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పింఛన్‌దారులకు, ఉద్యోగాలు కోల్పోయినవారికి ఈపీఎఫ్‌వో కొత్త రూల్స్ ఇబ్బందికరంగా మారినట్టు ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. పింఛన్ విత్‌డ్రా కాలపరిమితిలో సవరణలతో వేతనజీవులకు కొత్త ఇబ్బందులు కలుగవచ్చని, ఈపీఎఫ్‌వో బాధ్యత నుంచి తప్పించుకొనేందుకే కేంద్రం 100 శాతం విత్‌డ్రాను తెరమీదకు తీసుకొచ్చిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వడ్డీ భారం తగ్గించుకొనేందుకే ఇలా చేసిందని చెప్తున్నారు. మొత్తంగా మన పింఛన్ విధానం వేతనజీవుల పాలిట క్రూరమైన చర్యగా అభివర్ణిస్తున్నారు. దీన్ని ధ్రువపరుస్తూ.. గ్లోబల్ పెన్షన్ ఇండెక్స్–2025 ర్యాంకుల్లో భారత్ అట్టడుగున నిలిచింది. కవరేజీ, సమర్థత, నియంత్రణ అనే మూడు విషయాల్లో మన దేశీయ పింఛన్ వ్యవస్థ పేలవమైన ప్రదర్శనను కనబర్చింది. దీంతో నిరుడు మన పింఛన్ వ్యవస్థకు 44 మార్కులు ఉంటే ప్రస్తుతం అది 43.8కి పడిపోయి.. గ్రేడ్ డీ ర్యాంకుకు పరిమితమైంది. ఈ మేరకు మెర్సెర్ సీఎఫ్ఏ ఇన్‌స్టిట్యూట్ గ్లోబల్ పెన్షన్ ఇండెక్స్–2025 వెల్లడించింది. ఇక, అమెరికా, జపాన్, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి ఓఈసీడీ సభ్య దేశాల (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) పెన్షన్ ఆస్తులు (వివిధ స్టాక్స్‌లో పెట్టుబడులు) ఆయా దేశాల జీడీపీలో 80 శాతం మేర ఉంటే, భారత్‌లో మాత్రం ఇది 21 శాతం మాత్రమే ఉన్నట్టు ఆర్థిక సర్వే 2024–25 పేర్కొంది.

**వాణిజ్యలోటు కూడా**

దేశంలో ఎగమతులు, దిగుమతులు మధ్య వ్యత్యాసానికి సూచికగా ఉండే వాణిజ్య లోటు గత నెలలో 13 నెలల గరిష్ఠాన్ని తాకింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం సెప్టెంబర్‌లో వాణిజ్య లోటు 32.15 బిలియన్ డాలర్లకు చేరుకొన్నది. గడిచిన 13 నెలల వ్యవధిలో ఇదే అత్యధికం. బంగారం, వెండి, ఎరువుల దిగుమతులు పెరుగడమే దీనికి కారణమని మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ గణాంకాలను బట్టి అర్థమవుతున్నది. అమెరికా సుంకాల మోత కూడా ఎగుమతులపై ప్రభావాన్ని చూపించిందని, మోదీ దౌత్య వైఫల్యమే దీనికి కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, శక్తిమంతమైన పాస్‌పోర్టు ఇండెక్స్‌లో భారత్ 80వ ర్యాంకు నుంచి 85వ ర్యాంకుకు పడిపోయింది

**ఎగుమతికి టారిఫ్ దెబ్బ**

అమెరికాకు భారతీయ వస్తూత్పత్తుల ఎగుమతులు భారీగా క్షీణించాయి. ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగస్టులో విధించిన టారిఫ్‌లు.. సెప్టెంబర్‌లో స్పష్టమైన ప్రభావం చూపాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఆలస్యానికి గాను ఆగస్టు 7 నుంచి 25 శాతం ప్రతీకార సుంకాలను అమల్లోకి తెచ్చిన ట్రంప్.. తన మాట వినకుండా రష్యా నుంచి భారీగా ముడి చమురు దిగుమతుల్ని కొనసాగిస్తున్నందుకు గాను అదే నెల 27 నుంచి మరో 25 శాతం జరిమానా సుంకాలను వర్తింపజేశారు. దీంతో అమెరికాలో దిగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులపై 50 శాతం సుంకాల భారం పడింది. ఈ నేపథ్యంలోనే అమెరికాకు భారత్ నుంచి ఎగుమతులు గడిచిన నాలుగు నెలల్లో 37.5 శాతం మేర పతనమయ్యాయి. ఈ ఏడాది మేలో 8.8 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు సెప్టెంబర్‌లో 5.5 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు చెప్తున్నాయి.

**భారీగా పెరిగిన బంగారం స్మగ్లింగ్**

ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు, ఆర్థి మాంద్యం భయాలు వెరసి బంగారం ధరలు గత కొన్ని రోజులుగా రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. తులం బంగారం రూ.1.30 లక్షలకు చేరువైంది. అయితే, 8,133 టన్నుల మేర గోల్డ్ రిజర్వులు ఉన్న అమెరికా తదితర దేశాలకు ఈ పరిణామం ఉపయుక్తంగా మారగా, కేవలం 880 టన్నుల నిల్వలు మాత్రమే ఉన్న భారత్ తదితర దేశాలకు ఇది ఇబ్బందిగా మారింది. డిమాండ్‌కు సరిపడా పుత్తడి సరఫరాకు భారత్ దిగుమతులపై ఆధారపడాల్సి వస్తున్నది. ఇదే క్రమంలో పన్నుల నుంచి తప్పించుకొనేందుకు బంగారం స్మగ్లింగ్ ఘటనలు భారీగా పెరిగాయని కస్టమ్స్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు తెలిపారు. ఇదే సమయంలో గోల్డ్ నిల్వలపై కేంద్రానికి ముందుచూపు లేకపోవడంతో సామాన్యులకు బంగారం కొనుగోలు కలగానే మారినట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**సమస్యలు పక్కనబెట్టి.. హిందీ కోసం**

నిరుద్యోగం, ఉద్యోగాల కోత, ఆర్థిక సంక్షోభంతో ఒకవైపు దేశవ్యాప్తంగా సవాలక్ష సమస్యలు ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోని కేంద్రప్రభుత్వం హిందీ భాషను అంతటా రుద్దాలన్న తన ప్రయత్నాలను మాత్రం వదులుకోవట్లేదు. ఆదివాసీ పిల్లలు చదువుకొనే ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో హిందీ బోధనకు సంబంధించి కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. హిందీ భాషను బోధించే బాధ్యత కేవలం ఆ భాష ఉపాధ్యాయుడిది మాత్రమే కాదని, సంబంధిత పాఠశాలలో పని చేస్తున్న లెక్కలు, సైన్స్, సాంఘిక శాస్త్రాల ఉపాధ్యాయులు కూడా హిందీని బోధించాల్సిందేనని తేల్చి చెప్పింది. దీంతో కేంద్రం ఏకపక్ష చర్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# మావోయిస్టు అగ్రనేత ఆశన్న లొంగుబాటు

బీజాపూర్:

మావోయిస్టు ఉద్యమానికి పెను విఘాతం తగిలింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, అగ్రనేత తక్కళ్ళపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు అధికారిక వర్గాలు ప్రకటించాయి. మరో కీలక నేత మల్లోజుల వేణుగోపాల్ రావు (అభయ్) లొంగిపోయిన 24 గంటల్లోపే ఈ పరిణామం చోటుచేసుకోవడం సంచలనం సృష్టిస్తోంది. ఈ వరుస లొంగుబాట్లు మావోయిస్టు పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బుధవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట అభయ్ లొంగిపోగా, అదే రోజు ఛత్తీస్‌గఢ్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో ఏకంగా 78 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారు. సుక్మా జిల్లాలో 27 మంది, కాంకేర్ జిల్లాలో 50 మంది అజ్ఞాతం వీడారు. వీరిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన కీలక నేతలు రాజమన్ మండావి, రాజు సలామ్ కూడా ఉన్నారు. కాంకేర్‌లో లొంగిపోయిన వారు ఏకే 47 రైఫిల్స్‌తో సహా 17 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఆశన్న లొంగుబాటుకు ముందు నుంచే శాంతి చర్చల వైపు మొగ్గు చూపుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. నార్త్ వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా ఆయన పలు లేఖలు విడుదల చేశారు. ఒక యూట్యూబర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా "తుపాకీ కన్నా చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన అభయ్ బాటలో నడిచినట్లు తెలుస్తోంది.

**తెలుగు రాష్ట్రాల్లో కీలక దాడుల సూత్రధారి**

తెలంగాణలోని ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేటకు చెందిన ఆశన్న, 1989లో అజ్ఞాతంలోకి వెళ్లారు. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన అనేక కీలక దాడుల్లో ఆయనకు ప్రమేయం ఉంది. 1999లో హైదరాబాద్‌లో ఐపీఎస్ అధికారి ఉమేశ్ చంద్ర హత్య, 2000లో ఘట్‌కేసర్ వద్ద మాజీ హోంమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి హత్య కేసుల్లో ఆయన నిందితుడు. 2003లో తిరుపతి అలిపిరి వద్ద అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుపై జరిగిన క్లైమోర్ మైన్స్ దాడికి నాయకత్వం వహించింది కూడా ఆశన్న బృందమే.

**రెండు రోజుల్లో 258 మంది లొంగుబాటు**

దేశంలో నక్సలిజానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో కేంద్ర ప్రభుత్వానికి భారీ విజయం లభించింది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కేవలం రెండు రోజుల వ్యవధిలో 258 మంది నక్సలైట్లు



లొంగిపోయారు. ఈ కీలక పరిణామంపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గురువారం తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా ప్రకటన చేశారు. హింసా మార్గాన్ని వీడి, భారత రాజ్యాంగంపై విశ్వాసం ప్రకటిస్తూ ఇంత పెద్ద సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడం గమనార్హం.

ఈ లొంగుబాట్ల వివరాలను అమిత్ షా స్వయంగా వెల్లడించారు. "ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం 27 మంది, గురువారం 170 మంది ఆయుధాలు వీడారు. అదేవిధంగా, మహారాష్ట్రలో బుధవారం 61 మంది లొంగిపోయారు. దీంతో మొత్తం 258 మంది జనజీవన స్రవంతిలో కలిశారు" అని ఆయన తెలిపారు. ఈ పరిణామం నక్సలిజంపై పోరాటంలో ఒక ప్రధాన విజయమని ఆయన అభివర్ణించారు. హింసను విడనాడిన వారికి ఆయన అభినందనలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నిరంతర చర్యల వల్లే నక్సలిజం ఇప్పుడు చివరి శ్వాస తీసుకుంటోందని అమిత్ షా వ్యాఖ్యానించారు. నక్సలైట్ల విషయంలో తమ ప్రభుత్వ విధానం చాలా స్పష్టంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. "లొంగిపోవాలనుకునే వారికి ఎల్లప్పుడూ స్వాగతం ఉంటుంది. కానీ ఆయుధాలు పట్టుకుని తిరిగేవారిపై మా భద్రతా బలగాలు కఠిన చర్యలు తీసుకుంటాయి" అని హెచ్చరించారు. ఇంకా మిగిలి ఉన్న నక్సలైట్లు కూడా హింసను వీడి శాంతియుత మార్గాన్ని ఎంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

**లొంగిపోయేందుకు వస్తున్న.. 140 మంది మావోయిస్టులు**

మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. ఆ పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ అభయ్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట బుధవారం లొంగిపోగా... అదే బాటలో మరో అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న కూడా ఇవాళ లొంగిపోయారు. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్‌లో కీలక నేతలు రూపేష్, రనిత సహా 140 మంది మావోయిస్టులు లొంగిపోయేందుకు సిద్ధమయ్యారు. రేపు(శుక్రవారం, అక్టోబర్ 17న జగదల్‌పూర్‌లో ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయ్, హోం మంత్రి విజయ్ శర్మ ఎదుట లొంగిపోనున్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు రూపేష్, మాడ్ డివిజన్ కార్యదర్శి రనిత, ఇద్దరు సభ్యులు, 15 మంది %ణంజ% సభ్యులు సహా మొత్తం 140 మంది మావోయిస్టులు లొంగిపోవడానికి భైరామ్‌గఢ్ వైపు వెళుతున్నారు. వారు ఇంద్రావతి నది అవతలి వైపుకు చేరుకుంటారు. నక్సలైట్లందరూ లొంగిపోవడానికి 70కి పైగా ఆయుధాలను తీసుకువస్తున్నట్లు సమాచారం. భైరామ్‌గఢ్ నుండి ఇంద్రావతి నదిపై ఉన్న ఉస్పారి ఘాట్ వరకు భద్రతా దళాలు గట్టి భద్రతను మోహరించాయి. దంతేవాడ, బీజాపూర్ సరిహద్దుల్లోని అడవుల నుంచి మావోయిస్టులు ఈ నదిని దాటి జగదల్‌పూర్‌కు చేరుకుంటున్నారు. ఉస్పారి ఘాట్ మార్గంలో బయటి వ్యక్తులెవరినీ ప్రయాణించడానికి అనుమతించడం లేదు.

రూపేష్.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ మావోయిస్టు నేత. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (%ణఖ్గజ%) లోని మాడ్ డివిజన్‌లో లాజిస్టిక్స్, కమ్యూనికేషన్, శిక్షణ బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర కమిటీ మరియు స్థానిక జోనల్ నిర్మాణం మధ్య సంబంధాల వారధిగా పనిచేశారు. రనిత.. %ణఖ్గజ% మాడ్ డివిజన్ ఇన్‌చార్జ్‌గా పనిచేసిన సీనియర్ మహిళా కమాండర్. బస్తర్ జిల్లాల్లో విస్తృతంగా కార్యకలాపాలు నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వరుస ఆపరేషన్‌లతో మావోయిస్టులకు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. లొంగుపోక తప్పడం లేదు. కేంద్రంతో చర్చలు జరపాలని పదే పదే యత్నించినా అది విఫలం కావడంతో ఇక లొంగుబాటు ఒక్కటే సరైన మార్గమని ఎంచుకున్న వందల సంఖ్యలో మావోయిస్టులు.. జన జీవన స్రవంతిలోకి వచ్చేస్తున్నారు. గత రెండు రోజులుగా అగ్రనేతలతో సహా 283 మంది మావోయిస్టులు తాము చేతపట్టిన తుపాకులను, నమ్ముకున్న అడవుల్ని వదిలి సాధారణ జీవితం గడపడానికి సిద్ధమవుతున్నారు.

## ట్రంప్-మోదీ మధ్య సంభాషణ జరగనేలేదు



రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంగీకరించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై భారత్ స్పందించింది. ఇటువంటి ఫోన్ సంభాషణ ఇరువురు దేశాధినేతల మధ్య జరగలేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పష్టం చేశారు. ఈ విషయంపై భారత్ ఇదివరకే ఒక స్పష్టతనిచ్చిందని ఆయన తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేసేందుకు నరేంద్ర మోదీ అంగీకరించారని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం కాగా, భారత్ ఈ వ్యాఖ్యలను ఖండించింది. ఇదివరకే కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశ ప్రజల ప్రయోజనాలు తమకు ముఖ్యమని, వీటి ఆధారంగానే దిగుమతులు ఉంటాయని స్పష్టం చేసింది. అమెరికా నుంచి చమురు దిగుమతులు పెంచడానికి గత కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నామని, గత దశాబ్ద కాలంలో ఈ విషయంలో చాలా పురోగతి కనిపించిందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఆఫ్ఘనిస్థాన్–పాకిస్థాన్ మధ్య జరుగుతున్న ఘర్షణలపై కూడా భారత్ స్పందించింది. ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ కేంద్రంగా మారిందని ఆరోపించింది. ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహిస్తోందని మండిపడింది. తమ అంతర్గత వైఫల్యాలకు పొరుగు దేశాలను నిందించడం పాకిస్థాన్‌కు అలవాటుగా మారిందని విమర్శించింది. ఆ రెండు దేశాల మధ్య ఘర్షణల నేపథ్యంలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని భారత్ పేర్కొంది.

## దీపావళికి ముందే ఢిల్లీలో డేంజర్ బెల్స్



దీపావళి పండగ ఇంకా రాకముందే దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యపు పొగ కమ్మేసింది. గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గురువారం ఉదయం నాటికి ఢిల్లీ–జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) వ్యాప్తంగా వాయు కాలుష్యం 'చాలా ప్రమాదకరం' కేటగిరీకి చేరింది. ఈ పరిస్థితి తీవ్రమైన ప్రజారోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 301 నుంచి 400 మధ్య ఉంటే దానిని 'చాలా ప్రమాదకరం'గా పరిగణిస్తారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ 300 మార్కును దాటింది. ఘజియాబాద్‌లోని లోనిలో అత్యధికంగా 339గా నమోదు కాగా, నోయిడా సెక్టార్ 125లో 358కి చేరింది. అదేవిధంగా, ఢిల్లీలోని ఆనంద్ విహార్ (335), వజీర్‌పూర్ (337) ప్రాంతాల్లో కూడా పరిస్థితి తీవ్రంగా ఉంది. విషమిస్తున్న వాయు కాలుష్యాన్ని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు ఇప్పటికే రంగంలోకి దిగారు. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) తొలి దశను అమలు చేశారు. దీని కింద, నిర్మాణ, కూల్చివేత పనులను నిలిపివేయడం, డీజిల్ జనరేటర్ల వాడకంపై నిషేధం వంటి ఆంక్షలు విధించారు. కాలుష్యం మరింత పెరిగితే రెండో దశ కింద మరిన్ని కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాతావరణంలో ఓజోన్, పీఎం10 రేణువుల సాంద్రత పెరగడమే ఈ కాలుష్యానికి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. గాలి వేగం తక్కువగా ఉండటం, ఉష్ణోగ్రతల్లో మార్పుల వల్ల కాలుష్య కారకాలు గాలిలోనే నిలిచిపోతున్నాయని వారు విశ్లేషిస్తున్నారు. ఈ తరహా గాలిని పీల్చడం వల్ల పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారికి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రజలు వీలైనంత వరకు బయటకు వెళ్లవద్దని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే మాస్కులు ధరించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇళ్లలో ఎయిర్ ప్యూరిఫైయర్లు వాడటం మంచిదని చెబుతున్నారు. కాలుష్య నియంత్రణ చర్యలకు ప్రజలు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## హెచ్-4 వీసాదారులకు భారీ ఊరట

అమెరికాలో నివసిస్తున్న వేలాది భారతీయ టెక్ నిపుణుల కుటుంబాలకు శుభవార్త అందింది. హెచ్–1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు (హెచ్–4 వీసా హోల్డర్లు) అమెరికాలో ఉద్యోగాలు చేసుకునే హక్కును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి యూఎస్ సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో దాదాపు దశాబ్ద కాలంగా కొనసాగుతున్న న్యాయపోరాటానికి తెరపడినట్లయింది. ఈ నిర్ణయంతో వేలాది భారతీయ కుటుంబాల్లో నెలకొన్న అనిశ్చితి తొలగిపోయి, వారిలో ఆనందం వెల్లివిరిసింది. హెచ్–1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు ఉద్యోగాలు చేసుకునేందుకు అనుమతించే 'హెచ్–4 ఈఏడీ' (ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్) విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ 'సేవ్ జాబ్స్ యూఎస్ఏ' అనే సంస్థ చాలా కాలంగా న్యాయపోరాటం చేస్తోంది. ఈ విధానం వల్ల అమెరికన్ల ఉద్యోగావకాశాలు దెబ్బతింటున్నాయని ఆ సంస్థ వాదిస్తోంది. అయితే, ఈ పిటిషన్‌పై విచారణ జరపడానికి సుప్రీంకోర్టు ఆసక్తి చూపలేదు. ఫలితంగా కింది కోర్టు ఇచ్చిన తీర్పు అమల్లో ఉంటుంది. అంటే హెచ్–4 వీసాదారుల ఉద్యోగ హక్కు ఇకపై కూడా కొనసాగుతుంది. 2015లో నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకుని, ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న హెచ్–1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు ఇది ఒక వరంలా మారింది. ఈ సదుపాయం లేకపోతే గ్రీన్ కార్డ్ వచ్చేంత వరకు వారు ఖాళీగా ఉండాల్సి వచ్చేది. హెచ్–4 వీసాదారుల్లో అత్యధికులు ఉన్నత విద్యావంతులు, నైపుణ్యం కలిగిన భారతీయ మహిళలే కావడం గమనార్హం. ఈఏడీ విధానం వల్ల వారు అమెరికాలో తమ కెరీర్‌లను కొనసాగించగలుగుతున్నారు. అనేక మంది పెద్ద కంపెనీలలో ఉన్నత స్థానాల్లో స్థిరపడగా, మరికొందరు సొంతంగా వ్యాపారాలు కూడా ప్రారంభించారు. గతంలో డొనాల్డ్ ట్రంప్ హయాంలో ఈ విధానాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. దీంతో చాలా కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు నిర్ణయంతో చట్టపరమైన అడ్డంకులు తొలగిపోయినప్పటికీ, భవిష్యత్తులో రాజకీయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం లేకపోలేదని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా ప్రస్తుతానికి ఈ నిర్ణయం అమెరికాలోని భారతీయ వృత్తి నిపుణులకు, వారి కుటుంబాలకు గొప్ప స్థైర్యాన్ని ఇచ్చింది. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు చేస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

## బిజినెస్ వాయిస్

### 13 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు

సెప్టెంబరులో మన దేశ ఎగుమతులు 6.74% వృద్ధితో 36.38 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు ఏడాది క్రితం 58.74 బి.డాలర్ల నుంచి 16.6% పెరిగి 68.53 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫలితంగా వాణిజ్యలోటు 32.15 బిలియన్ డాలర్లకు చేరింది.



ఇది 13 నెలల గరిష్ఠస్థాయి. పసిడి, వెండి, ఎరువుల బిల్లు భారం పెరగడం ఇందుకు కారణమని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్-సెప్టెంబరు నెలల్లో మొత్తం ఎగుమతులు 3.02% పెరిగి 220.12 బి.డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు 4.53% అధికమై 375.11 బి.డాలర్లకు చేరాయి. ఫలితంగా వాణిజ్యలోటు 154.99 బి.డాలర్లుగా నమోదైంది. పసిడి ధర పెరిగినా..: పసిడి దిగుమతులు గత నెలలో 9.6 బి.డాలర్లకు పెరిగాయి. 2024 సెప్టెంబరులో ఇవి 5.14 బి.డాలర్లుగా ఉన్నాయి. 2024-25 ఏప్రిల్-సెప్టెంబరులో 29.04 బి.డాలర్ల పసిడి దిగుమతి కాగా, 2025-26 ఇదే కాలంలో ఈ విలువ మాత్రం 26.51 బి.డాలర్లకు తగ్గింది. పెట్రోలియం వస్తువుల దిగుమతులు 35.65 బి.డాలర్ల నుంచి 30.63 బి.డాలర్లకు తగ్గాయి.

### 25% తగ్గిన యాక్సిస్ బ్యాంక్ లాభం




యాక్సిస్ బ్యాంక్, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.5,528 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభంతో పోలిస్తే ఇది 25% తక్కువ. పంట రుణాల కోసం రూ.1,231 కోట్ల కేటాయింపులు చేయాలన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశం వల్ల ఈసారి లాభం తగ్గినట్లు బ్యాంక్ తెలిపింది. స్టాండలోన్ ప్రాతిపదికనా బ్యాంక్ నికర లాభం రూ.6,918 కోట్ల నుంచి రూ.5,090 కోట్లకు తగ్గింది. 12% రుణ వృద్ధి నమోదు చేసినా, నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) 2 శాతమే పెరిగి రూ.13,475 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్‌ఐఎం) 3.99% నుంచి 3.73 శాతానికి తగ్గింది. కేటాయింపులు రూ.2,204 కోట్ల నుంచి రూ.3,547 కోట్లకు పెరిగాయి. స్థూలంగా మొండి బకాయిలు రూ.4,443 కోట్ల నుంచి రూ.5,696 కోట్లకు చేరాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.57% నుంచి 1.46 శాతానికి తగ్గింది.

# ఎల్ఐసీ తక్కువ ప్రీమియంతో రెండు కొత్త స్కీమ్స్ ప్రారంభం




ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) మరో రెండు కొత్త పాలసీలను తీసుకువచ్చింది. జన సురక్ష, బీమా లక్ష్మి పేరుతో ఈ స్కీమ్స్ తీసుకురాగా నేటి నుండే వీటికి అప్లై చేసుకోవచ్చు.వీటిలో తక్కువ ఆదాయం ఉన్నవారి కోసం జర సురక్ష, మహిళల కోసం బీమా లక్ష్మి స్కీమ్స్ ఉన్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలకు బీమా కల్పించాలనే ఉద్దేశ్యంతో జన సురక్ష స్కీమ్ తీసుకువచ్చింది. ఇదినాన్ లింక్డ్, నాన్ ఇన్సూరెన్స్ స్కీమ్ మార్కెట్ లో వచ్చే లాభ నష్టాలతో దీనికి సంబంధం ఉండదు. ఇందులో ప్రిమియం తక్కువగా ఉంటుంది. ఈ స్కీమ్‌కు స్త్రీ, పురుషులు ఎవరైనా అప్లై చేసుకోవచ్చు. దీనికి అప్లై చేసుకుం దుకు అర్హత వయస్సు 18 నుండి 55 ఏళ్ల మధ్య ఉండాలి. పాలసీ టర్మ్ 12 నుండి 20 ఏళ్ల వరకు ఉంటుంది. ఇందులో రూ.1లక్ష నుండి రూ.2 లక్షల వరకు కవరేజ్ లభిస్తుంది. మెడికల్ అవసరాల కోసం ఈ పాలసీ పనిచేయదు. ఇక బీమా లక్ష్మి స్కీమ్‌ను కేవలం మహిళల కోసమే తీసుకువచ్చారు. ఇందులో బీమా మరియు పొదుపు రెండు కలిపి ఉంటాయి. దీనికి కూడా మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం ఉండదు. ఇందులో మూడు రకాల ఆప్షన్స్ ఉంటాయి. వాటిని బట్టి పాలసీని ఎంచుకోవచ్చు. పాలసీ వ్యవధి 25ఏళ్లు కాగా 7 నుండి 15ఏళ్ల వరకు చెల్లింపుల వ్యవధి ఎంచుకునే అవకాశం ఉంది. పాలసీ తీసుకునేందుకు కనీస వయసు 18ఏళ్లు కాగా గరిష్ఠ వయసు 50ఏళ్లుగా ఉంది. ఇందులో కనీస బీమా రూ.2 లక్షలు కాగా గరిష్ఠంపై పరిమితి లేదు. ఇక ఈ పాలసీలో మూడు ఆప్షన్స్ ఉన్నాయి. ఆప్షన్ 1, పాలసీ చెల్లింపు వ్యవధి పూర్తైన తరవాత 50 శాతం మొత్తాన్ని వెనక్కి ఇస్తారు. ఆప్షన్ 2, ప్రతి 2ఏళ్లకు హామీ మొత్తంలో నుండి 7.7శాతం చొప్పున 12 సార్లు చెల్లిస్తారు. ఆప్షన్ 3లో ప్రతి నాలుగేళ్లకు హామీ మొత్తంలో 15 శాతం చొప్పున 6సార్లు వెనక్కి తీసుకోవచ్చు. ప్రీమియం చెల్లింపుపై ఏడాదికి 7శాతం చొప్పున గ్యారెంటీడ్ అడిషన్ చేరుస్తారు. మెచ్యూరిటీ సమయంలో బీమా హామీ మొత్తంతో కలిపి గ్యారెంటీడ్ అడిషన్‌ను చెల్లిస్తారు. అంతే కాకుండా పాలసీ మధ్యలో పాలసీదారుడికి ఏమైనా జరిగితే వార్షిక ప్రీమియంకు 10 రెట్లు లేదా బీమా హామీ మొత్తంలో ఏది ఎక్కువ ఉంటే అది చెల్లిస్తారు. ఇందులో వీలును బట్టి నెలకోసారి, త్రైమాసికానికి, ఆరు నెలలకు, ఏడాదికి వీలును బట్టి ప్రీమియం చెల్లింపు వ్యవధి ఎంచుకోవచ్చు.

# లేఆఫ్‌ల వేళ ఉద్యోగులకు ఇన్ఫోసిస్ బంపర్ ఆఫర్

ఓవైపు టెక్ సంస్థల్లో లేఆఫ్‌లు కొనసాగుతోన్న వేళ.. దేశీయ సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఇన్ఫోసిస్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ సంస్థలో లాటరల్ హైరింగ్ నియామకాల బాధ్యతను ఉద్యోగులకే అప్పగించింది. కొత్త టాలెంట్ వెతికి వారిని కంపెనీకి రిఫర్ చేస్తే రూ.50వేల వరకు ప్రోత్సాహకాలు ఇస్తామని బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఈ మేరకు తమ ఉద్యోగులకు ఇన్ఫోసిస్ (%×అటశీంఎం%) ఇంటర్నల్ మెయిల్‌లో సందేశం పంపింది. ఇంజినీరింగ్, క్వాలిటీ ఇంజినీరింగ్, స్ట్రాటజిక్ టెక్నాలజీ గ్రూప్, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ ఇంటిగ్రేషన్ అండ్ సర్వీసెస్ విభాగాల్లో ఇన్ఫీ ఈ నియామకాలు చేపట్టనుంది. దేశవ్యాప్తంగా తమ అన్ని బ్రాంచీల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు రిక్రూట్‌మెంట్ చేపట్టింది. పొజిషన్ బట్టి రెండు నుంచి 15 ఏళ్ల అనుభవం ఉన్న ఉద్యోగులను తీసుకోనుంది. ఆయా విభాగాల్లో అర్హత కలిగిన అభ్యర్థులను ఉద్యోగులు కంపెనీకి సిఫార్సు చేయొచ్చని ఇన్ఫీ తమ మెయిల్‌లో వెల్లడించింది. ఉద్యోగులు రిఫర్ చేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయితే.. ఆ ఉద్యోగులకు ప్రోత్సాహకం దక్కనుంది. లెవల్-3 నియామకాలకు రూ.10వేలు, లెవల్-4 జాబ్‌లకు రూ.25వేలు, లెవల్-5లో రూ.35వేలు, లెవల్-6 ఉద్యోగా లకు రిఫర్ చేసిన వారికి రూ.50వేలు బోనస్ ఇస్తామని కంపెనీ వెల్లడించింది. అయితే, ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థి గత ఆరు నెలల్లో ఇన్ఫీ ఎంపిక ప్రక్రియకు హాజరుకాని వారై ఉండాలని షరతు పెట్టింది. ఇటీవల టీసీఎస్ భారీస్థాయిలో లేఆఫ్‌లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ ఇన్ఫీ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇక, ఇన్ఫోసిస్ తమ రెండో త్రైమాసిక ఫలితాలను గురువారం (అక్టోబరు 16న) ప్రకటించనుంది. మరోవైపు ఉద్యోగి పనితీరు పైనా కంపెనీ సమీక్ష ప్రారంభించింది. దీంతో త్వరలోనే కంపెనీలో వేతన పెంపు ఉండొచ్చనే సంకేతాలు కన్పిస్తున్నాయి.




# వైభవ్ సూర్యవంశీ గురించి ఆ మాట అస్సలు నమ్మను

భారత్‌తో పాటు ప్రపంచ క్రికెట్ వర్గాల్లో వైభవ్ సూర్యవంశీ పేరు ఓ సంచలనం. పదమూడేళ్ల వయసులోనే ఐపీఎల్ వేలంలో ఏకంగా రూ. 1.10 కోట్లకు అమ్ముడు పోయిన ఈ బిహారీ పిల్లాడు.. పద్నాలుగేళ్ల వయసులోనే క్యాచ్ రిచ్ లీగ్‌లో ఎంట్రీ ఇచ్చాడు. ఐపీఎల్-2025లో రాజస్తాన్ రాయల్స్ కు ప్రాతినిథ్యం వహించిన వైభవ్.. కేవలం 35 బంతుల్లోనే శతక్కొట్టి అతిపిన్న వయసులో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఆ తర్వాత భారత అండర్-19 క్రికెట్ జట్టు తరఫున ఇంగ్లండ్, ఆస్ట్రేలియా గడ్డపై ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ సత్తా చాటాడు.

**బిహార్ జట్టు వైస్ కెప్టెన్‌గా ప్రమోషన్**

ఇక వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం రంజీ ట్రోఫీ 2025-26 సీజన్‌తో బిజీగా ఉన్నాడు. బిహార్ జట్టు వైస్ కెప్టెన్‌గా ప్రమోషన్ కొట్టేసిన వైభవ్.. ప్లేట్ గ్రూప్‌లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్ జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో విఫలమయ్యాడు.

**టీ20 తరహాలో చెలరేగి.. నిరాశపరిచి**

రంజీలోనూ టీ20 తరహా విధ్వంసకర బ్యాటింగ్‌కు దిగిన వైభవ్.. అరుణాచల్ ప్రదేశ్ బౌలర్ యాబ్ నియా బౌలింగ్‌లో ఒక సిక్స్, రెండు ఫోర్లు బాది.. ఆ వెంటనే క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. తద్వారా ఐదు బంతుల్లో 14 పరుగులు చేసి నిష్క్రమించాడు.



**ఆశ్చర్యపోయా**

ఈ నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ గురించి ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హెడెన్ గతంలో చేసిన వ్యాఖ్యలు తాజాగా తెరమీదకు వచ్చాయి. టీమిండియా మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి ఈ విషయం గురించి మాట్లాడుతూ.. “ఆరోజు నిజంగా నేను ఆశ్చర్యపోయా. జైపూర్‌లో కామెంట్రీ చేస్తున్నా. నాలుగో ఓవర్లో లైవ్‌లోకి వెళ్లా. అయితే, ఆ సమయంలో మాకు ఓ కామెంటేటర్ తక్కువగా ఉన్నారు. తొమ్మిది, పదో ఓవర్.. అప్పుడే వైభవ్ సెంచరీ చేశాడు. తనదైన శైలిలో శతక్కొట్టేశాడు. మొహమ్మద్ సిరాజ్, ఇషాంత్ శర్మ వంటి మేటి బౌలర్లను చితక్కొడుతూ.. ఎక్స్‌ట్రా కవర్, మిడ్ వికెట్ మీదుగా షాట్లు బాదాడు.

**అతడి వయసు పద్నాలుగే అంటే నమ్మను**

ఆ సమయంలో హైడోస్ (మాథ్యూ హెడెన్) అక్కడే ఉన్నాడు. అప్పుడు తను.. ‘ఓహ్.. అతడి వయసు పద్నాలుగే అంటే నేను అస్సలు నమ్మను’ అంటూ ఎగ్జైట్ అయ్యాడు. ఇందుకు నేను బదులిస్తూ.. ‘కమాన్.. కామ్‌డౌన్’ అన్నాను” అంటూ విల్లో టాక్ షోలో రవిశాస్త్రి పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నాడు. కాగా ఐపీఎల్-2025లో గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్ సందర్భంగా వైభవ్ ఫాస్టెస్ట్ సెంచరీ బాదిన విషయం తెలిసిందే.

# విధ్వంసకర వీరుడికే ప్రతిష్టాత్మక అవార్డు.. సహచరుడు పోటీ పడినా..!

టీమిండియా నయా విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ ప్రతిష్టాత్మక ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు గెలుచుకున్నాడు. సెప్టెంబర్ నెలకు గానూ అభిషేక్ ఈ అవార్డును కైవసం చేసుకున్నాడు. ఈ అవార్డు కోసం అభిషేక్‌తో పాటు మరో టీమిండియా ఆటగాడు కుల్దీప్ యాదవ్, జింబాబ్వే బ్యాటర్ బ్రియాన్ బెన్నెట్ పోటీ పడ్డారు. ఓటింగ్ అనంతరం అభిషేక్ విజేతగా ఆవిర్భవించాడు. అభిషేక్ ఈ అవార్డు గెలుచుకోవడం ఇది మొదటిసారి. భారత్ తరఫున ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు గెలుచుకున్న 10వ ఆటగాడు అభిషేక్. అభిషేక్‌కు ముందు శుభ్‌మన్ గిల్ (4 సార్లు), బుమ్రా (2), శ్రేయస్ అయ్యర్ (2), పంత్, అశ్విన్, భువనేశ్వర్ కుమార్, విరాట్ కోహ్లి, యశస్వి జైస్వాల్, సిరాజ్ ఈ అవార్డు గెలుచుకున్నారు. అభిషేక్ సెప్టెంబర్ నెలలో విశేషంగా రాణించినందుకు ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు దక్కింది. టీ20 ఆసియా కప్‌లో అతను 7 మ్యాచ్‌ల్లో 200 స్ట్రైక్ రేట్‌తో, 44.85 సగటున 314 పరుగులు చేశాడు. అభిషేక్ ప్రదర్శనల కారణంగా భారత్ ఆసియా కప్‌ను సునాయాసంగా గెలుచుకుంది. అభిషేక్ ప్రస్తుతం అంతర్జాతీయ టీ20ల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ఆసియా కప్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచి, ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ అవార్డు గెలుచుకున్న అభిషేక్.. ఆ ప్రదర్శనల తర్వాత ఐసీసీ టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు.

**మహిళల విభాగంలో మంధన**

మహిళల విభాగంలో సెప్టెంబర్ నెల ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు టీమిండియాకే చెందిన స్మృతి మంధనకు దక్కింది. గత నెలలో ఆసీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో (58, 117, 125) విశేషంగా రాణించినందుకు ఆమె ఈ అవార్డును కైవసం? చేసుకుంది. ఈ అవార్డు కోసం మంధనతో పాకిస్తాన్‌కు చెందిన సిద్రా అమీన్, సౌతాఫ్రికాకు చెందిన తజ్మిన్ బ్రిట్స్ పోటీ పడ్డారు. తిరుగులేని ప్రదర్శన కారణంగా మంధననే ఈ అవార్డు వరించింది.




## క్రీడా వాయిస్

# ఆస్ట్రేలియాతో తొలి వన్డే.. అరుదైన ఘనత అందుకోనున్న రోహిత్ శర్మ




ఇంటర్నెట్ డెస్క్: ఆస్ట్రేలియాతో వైట్ బాల్ సిరీస్‌లో తలపడేందుకు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. కంగారులతో అక్టోబర్ 19 నుంచి మూడు వన్డే సిరీస్‌లు, ఇదేనెల 29 నుంచి ఐదు టీ20లు ఆడనుంది. ఇప్పటికే వన్డే జట్టు ఆస్ట్రేలియాకు చేరుకుంది. పెర్త్‌లో తొలి వన్డే జరగనుంది. ఈ మ్యాచ్‌లో భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అరుదైన ఘనత అందుకోనున్నాడు. హిట్‌మ్యాన్‌కు అంతర్జాతీయ కెరీర్‌లో ఇది 500వ మ్యాచ్. ఇప్పటివరకు భారత్ తరఫున నలుగురు మాత్రమే ఈ ఫీట్ సాధించారు. సచిన్ తెందూల్కర్ (664), విరాట్ కోహ్లీ (550, ఎంఎస్ ధోనీ (535), రాహుల్ ద్రవిడ్ (504) ఐదు వందలకు పైగా మ్యాచ్‌లు ఆడారు. తాజాగా ఈ జాబితాలో రోహిత్ చేరబోతున్నాడు. ఇప్పటివరకు ఇతను 67 టెస్టులు, 273 వన్డేలు, 159 టీ20లు ఆడాడు.

వన్డేలకు రిటైర్మెంట్ అంటూ రూమర్స్.. విరాట్ కోహ్లీ పోస్టు వైరల్

ఆస్ట్రేలియా, భారత్ వన్డే సిరీస్ షెడ్యూల్..

తొలి వన్డే.. అక్టోబర్ 19 (పెర్త్)
రెండో వన్డే.. అక్టోబర్ 23 (అడిలైడ్)
మూడో వన్డే.. అక్టోబర్ 25 (సిడ్నీ)

వన్డే మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు మొదలవుతాయి.

ఆసీస్‌తో వన్డేలకు భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సిరాజ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్.

# అదిరిపోయే యాక్షన్ సీన్లతో 'కాంతార చాప్టర్ 1' కొత్త ట్రైలర్




రిషబ్ శెట్టి తెరకెక్కించిన కాంతార చాప్టర్ 1 బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. అక్టోబర్ 2న విడుదలైన ఈ చిత్రం ఇప్పటి వరకు రూ. 680 కోట్లకు పైగా వసూళ్లను సాధించి పలు రికార్డులను బద్దలు కొడుతోంది. ఇప్పటికీ అత్యధిక థియేటర్స్‌లో రన్ అవుతున్న ఈ చిత్రం నుంచి కొత్త ట్రైలర్ ని రిలీజ్ చేశారు మేకర్స్. దీపావళి కానుకగా గురువారం విడుదలైన ఈ కొత్త ట్రైలర్ సినిమాలోని కీలక సన్నివేశాలన్నింటిని చూపించారు. యాక్షన్ సీన్లను హైలెట్ చేస్తూ ఈ ట్రైలర్‌ని కట్ చేశారు. రిషబ్ శెట్టి స్వీయదర్శకత్వంలో హీరోగా నటించి ఈ చిత్రంలో యువరాణి పాత్రలో రుక్మిణి వసంత్ కనిపించింది. గుల్షన్ దేవయ్య కీలక పాత్ర పోషించాడు. హెూంబలే ఫిలింస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించింది.




## 'కె-ర్యాంప్' టీజర్, ట్రైలర్‌తో డీజే మిక్స్

తన సినిమాలను ప్రేక్షకులకు రీచ్ చేసేందుకు సాధ్యమైనంత కొత్తగా ప్రయత్నిస్తుంటారు యంగ్ హీరో కిరణ్ అబ్బవరం. ఆయన తన లేటెస్ట్ మూవీ కె-ర్యాంప్‌పై కూడా ఆడియెన్స్ లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తున్నారు. గతంలో తన సినిమా 'ఎస్ఆర్ కల్యాణమండపం'కు డీజే మిక్స్ చేసి ఆ కంటెంట్ ను వైరల్ చేశారు. ఇప్పుడు '%ఖ%-ర్యాంప్' టీజర్, ట్రైలర్ తో డీజే మిక్స్ చేసి యూత్ ఆడియెన్స్ ను అట్రాక్ట్ చేస్తున్నారు. ఈ డీజే మిక్స్ "%ఖ%-ర్యాంప్" మీద ఒక వైబ్ క్రియేట్ చేస్తోంది. టీజర్, ట్రైలర్ లో పేలిన డైలాగ్స్ అన్నీ ఈ డీజే మిక్స్ లో యాడ్ చేయడం కొత్త ఫీల్ కలిగిస్తోంది. జైన్స్ నాని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్ గా నటిస్తోంది. దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.



# విజయ్ దేవరకొండ సూపర్ లైనప్.. 'మనం' దర్శకుడితో రౌడీ హీరో క్రేజీ ప్రాజెక్ట్

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ ఇటీవల 'కింగ్‌డమ్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా ఇచ్చిన సక్సెస్‌తో విజయ్ తన కెరీర్‌ను మరింత స్పీడ్ పెంచాడు. ప్రస్తుతం అతను తన కొత్త ప్రాజెక్టులతో బిజీగా దూసుకుపోతున్నాడు. ఇప్పటికే శ్యామ్ సింగ రాయ్ దర్శకుడు రాహుల్ సంక్రిత్యన్‌తో కలిసి ఒక సినిమా చేస్తుండగా..ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత రవి కిరణ్ కోల దర్శకత్వంలో మరో ఆసక్తికరమైన చిత్రంలో నటించబోతున్నాడు. ఈ రెండు సినిమాలు ఇప్పటికే టాలీవుడ్ సర్కిల్స్‌లో బజ్ క్రియేట్ చేస్తున్నాయి. అయితే ఇవి కాకుండా మరో సూపర్ క్రేజీ కాంబినేషన్ గురించి లేటెస్ట్ బజ్ వినిపిస్తోంది 'మనం', 'గ్యాంగ్ లీడర్', '24' వంటి సూపర్ హిట్ మూవీస్‌తో తన మార్క్ చూపిన స్టార్ డైరెక్టర్ విక్రమ్ కే కుమార్ తన తదుపరి ప్రాజెక్ట్‌ను విజయ్ దేవరకొండతో చేయబోతున్నట్లు సమాచారం. ఈ కాంబో గురించి టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి బజ్ నెలకొంది. విక్రమ్ కే కుమార్ స్టోరీటెల్లింగ్ స్టైల్ ఎమోషనల్ డ్రామా, సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ మిక్స్ విజయ్ దేవరకొండ ఎనర్జిటిక్ యాక్టింగ్‌తో కలిస్తే ఏం మ్యాజిక్ జరుగుతుందో అని ఫ్యాన్స్ ఊహిస్తున్నారు. ఇది విజయ్ కెరీర్‌లో మరో మైలురాయి కావచ్చని అంచనా వేస్తున్నారు. కాగా ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# హీరోయిన్‌గా చాన్స్ అందుకున్న సంయుక్త!

బింబిసారా, సార్, విరూపాక్ష వంటి సినిమాలతో ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న హీరోయిన్ సంయుక్త.. ప్రజెంట్ భాషతో సంబంధం లేకుండా వరుస ప్రాజెక్టులు అనౌన్స్ చేస్తుంది. ఇప్పటికే ఈ అమ్మడు చేతిలో అఖండ 2, స్వయం భూ, నారీ నారీ నడుమ మురారి చిత్రాలతో పాటు.. పూరిసేతుపతి ప్రాజెక్టులో కూడా భాగం అయింది. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ హీరోయిన్ ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రాన్ని ఓకే చేసినట్లు తెలుస్తుంది. చాలా ఏళ్ల క్రితం వెంకటేష్ హీరోగా వచ్చిన 'చింతకాయల రవి' సినిమాకు దర్శకత్వం వహించిన యోగి.. ఇప్పుడు మళ్లీ రీ ఎంట్రీ ఇస్తున్నట్లు టాక్. ఈయన ఓ లేడి ఓరియెంటెడ్ మూవీని ప్లాన్ చేస్తున్నాడట. దీనికి 'బ్లాక్ గోల్డ్' అనే టైటిల్ అనుకుంటున్నట్లు టాక్. హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారని తెలుస్తుండగా.. ఇందులో ప్రధాన పాత్ర కోసం సంయుక్తను ఓకే చేసినట్లు టాక్. అంతే కాకుండా.. దీనికి సంబంధించి ఇప్పటికే 50% షూటింగ్ కంప్లీట్ అయినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ నడుస్తుండగా.. దీనిపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రాలేదు. త్వరలో వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# ఆ ఎక్స్‌పీరియన్స్ మాటల్లో చెప్పలేను



మరాఠీ ముద్దు గుమ్మ రిద్ధి కుమార్.. ప్రస్తుతం 'ది రాజాసాబ్' సినిమాతో బిజీగా ఉంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మోస్ట్ వెయిటెడ్ మూవీ వచ్చే ఏడాది సంక్రాంతి స్పెషల్‌గా జనవరి 9 రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హీరోయిన్ రిద్ధి కుమార్ డార్లింగ్ (ప్రభాస్)పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 'ప్రభాస్ నటించిన 'రాధే శ్యామ్' చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన నేను.. ఇప్పుడు ది రాజాసాబ్‌లో ఆయన పక్కన హీరోయిన్‌గా చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇది నాకు చాలా స్పెషల్ ప్రాజెక్ట్. ఈ సినిమా ఎక్స్‌పీరియన్స్ నిజంగా ఎంతో అద్భుతంగా ఉంది. టైటిల్‌కు తగిన విధంగా షూటింగ్ సెట్స్‌ను చాలా గ్రాండ్‌గా ఏర్పాటు చేశారు. ఇక డార్లింగ్ గురించి అయితే చెప్పక్కరలేదు. ప్రభాస్ నిజంగా చాలా మంచి వ్యక్తి. ఆయనతో పని చేయడం ఎంతో ఈజీగా ఉంటుంది. ఆయన చాలా స్వీట్. ఎదుటివాళ్లను అర్థం చేసుకునే వ్యక్తి. అవసరమైన చోట సహాయం చేస్తారు.. అలాగే ఎంతో కష్టపడతారు. రాజాసాబ్ సినిమాను కచ్చితంగా మీరు అందరూ ఎంజాయ్ చేస్తారు' అని చెప్పుకొచ్చింది. కాగా.. ది రాజాసాబ్ మూవీలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్‌తో పాటు రిద్ధి కుమార్ కూడా హీరోయిన్‌గా నటిస్తుంది.



## బాహుబలి: ది ఎపిక్‌కి సరికొత్త సవాల్.. ఆ రికార్డులని బ్రేక్ చేస్తుందా?

టాలీవుడ్‌లో రీ రిలీజ్‌ల ట్రెండ్ ఇటీవల ఒక మాస్ వైబ్‌గా మారింది. అభిమానులు తమ ఫేవరెట్ హీరోల పాత బ్లాక్‌బస్టర్లను 4%ఖ% టెక్నాలజీతో మళ్లీ థియేటర్లలో చూసి ఆస్వాదిస్తున్నారు. ఈ ట్రెండ్‌లో ఎన్నో సినిమాలు మంచి వసూళ్లను సాధించగా, రీ రిలీజ్‌లకు ప్రత్యేక మార్కెట్ ఉన్నదని నిరూపించాయి. ఇప్పుడు ఈ ఫీల్డ్‌లో ఇండియన్ సినిమా దిశను మార్చిన చిత్రం అడుగుపెడుతోంది. అదే బాహుబలి. అయితే, ఇక్కడ ఓ విషయం గుర్తు పెట్టుకోవాలి. మేకర్స్ పాత ప్రింట్‌ను మళ్లీ విడుదల చేయకుండా కొత్త హంగులతో బాహుబలి: ది ఎపిక్ పేరుతో చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ఈ స్పెషల్ వెర్షన్‌లో సినిమాటిక్ అప్‌గ్రేడ్స్‌తో పాటు ఇప్పటివరకు ఎవరూ చూడని కొన్ని కొత్త సన్నివేశాలు (అన్‌సీన్ షాట్స్) కూడా ఉంటాయి. ఈ కొత్త కంటెంట్, ఇప్పటికే వందల సార్లు 'బాహుబలి'ను చూసిన ప్రేక్షకులకు కూడా ఒక కొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. రీ రిలీజ్ ప్లానింగ్ వెనుక పెద్ద వ్యూహం ఉంది. చిత్రంతో రాజమౌళికి ప్రపంచవ్యాప్తంగా వచ్చిన గుర్తింపును ఈ ప్రాజెక్ట్‌కు బూస్ట్‌గా ఉపయోగించాలనే ప్లాన్ ఉంది. జక్కన్న మేకింగ్ స్టైల్‌ను ఇష్టపడే గ్లోబల్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ, ఓవర్సీస్‌లో భారీ ప్రమోషన్లతో ఈ 'ఎపిక్' వెర్షన్‌ను విడుదల చేయాలని చూస్తున్నారు. రాజమౌళి బ్రాండ్ ఇమేజ్ ఈ రీ రిలీజ్‌కు ప్రధాన అస్సెట్‌గా మారనుంది. రీ రిలీజ్ మార్కెట్‌లో ఇప్పటికే కొన్ని సినిమాలు తమ రికార్డులను సృష్టించాయి. తమిళంలో 'గిల్లి' 4%ఖ% వెర్షన్ 32.50 కోట్లు, తెలుగులో 'ఖలేజా' 10.78 కోట్లు, 'మురారి' 8.90 కోట్లు, 'గబ్బర్ సింగ్' 8.01 కోట్లు వసూళ్లు సాధించాయి. ఇతర రీ రిలీజ్‌లు కూడా కొంత మేర విజయం సాధించాయి. అయితే మధ్య కాలంలో రీ రిలీజ్ సినిమాలకు ముందున్నంత రెస్పాన్స్ లేదు. ఇప్పటికే 'బాహుబలి'ను థియేటర్స్, టీవీ, ఓటీటీలో ఎన్నోసారి చూసిన అభిమానులు కేవలం పాత సినిమాను మళ్లీ థియేటర్‌లో చూడడానికి రావడం కష్టం. కాబట్టి, మేకర్స్ చెప్తున్న కొత్త కంటెంట్ మాత్రమే ప్రేక్షకులను ఆకట్టుకుంటే సినిమా క్లిక్ అయ్యే అవకాశం ఉంది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com